ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 457
వెల : రూ.25/-
ఏప్రియల్ 2023




జనసాహితి ప్రచురణ




Power Consumption Comparision & Savings

| | Kumar BLDC | ISI Fan | Conventional |
|---|---|---|---|
| Power Consumption❖ | 28 | 50 | 75 |
| USAGE (Hours per day) | 16 | 16 | 16 |
| KWhr Units (per day) | 0.45 | 0.8 | 1.2 |
| Electricity bill (per day @ Rs. 7.0 / unit)* | 3.15 | 5.2 | 7.8 |
| Electricity bill (per year) | Rs. 1,150 | Rs. 1,898 | Rs. 2,847 |
| Savings (per year)✦ | Rs. 1,697 | Rs. 949 | |

❖ At 230V, 50Hz, 350 RPM, Wattage may vary 5%
* May vary from state to state
✦ Actual savings depends upon the usage & cost of Electricity

46 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

457

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

జనసాహితి ప్రచురణ

సంపుటి : 46
సంచిక : 9
ఏప్రియల్ 2023

website : www.prajaasaahithi.com

## ఈ సంచికలో...


✦ ముఖచిత్రం : ఇదేనా! మానవాభివృద్ధి – చిత్రం అంతర్జాలం నుండి .....01

✦ రెండవ అట్ట : కుమార్ బిఎల్‌డిసి ఫ్యాన్స్ వాణిజ్య ప్రకటన .....02

✦ మూడవ అట్ట : ఇటీవల వెలువడిన జనసాహితి ప్రచురణలు .....35

✦ నాల్గవ అట్ట : శశికాంత్ బానే గీసిన చిత్రం – అంతర్జాలం నుండి .....36

✦ సంపాదకీయం : విద్యార్థి, యువతరం దివిటీలై వెలుగు నింపాలి! .....05

✦ కథ : దొంగలు – ప్రసన్న .....07

✦ వ్యాసం : చరిత్ర చోదక శక్తులు – డా॥ ఆర్కే .....11

✦ ధారావాహిక : దేశ విభజన వస్తువుగా సాహిత్యం (8)
మనోహర్ మల్గోంకర్ నవల 'వంపు తిరిగిన గంగ' – కొత్తపల్లి రవిబాబు .....16

✦ స్పందన : 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు లభించటంపై – హరిబాబు .....18
: కార్పొరేటు విద్యకు జోహుకుం.... 'సార్' – ఓ.వీ.వీ.యస్. .....30

✦ సినిమా సమీక్ష : నియంతలను శిక్షించిన 'అర్జెంటీనా 1985' – బాలాజీ (కోల్‌కతా) .....26

✦ జాతీయ అక్షరయోధులు : శంభు మిత్ర – సింగంపల్లి అశోక్‌కుమార్ .....20

✦ పుస్తక పరిచయం : కోటంరాజు రామారావు రచన 'కలం నా ఆయుధం' – కొత్తపల్లి రవిబాబు .....22

✦ కవితలు : పల్లి మణికంఠ (**06**); ఏనుగు నరసింహారెడ్డి, దీర్ఘకవిత : శీలా సుభద్రాదేవి (**21**)
చెన్నుపాటి రామాంజనేయులు (**32**)

✦ వివిధ : ముప్ఫై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (**19**);
వర్తమాన సాహిత్య సాంస్కృతిక సామాజికాంశాలు (**15, 17, 29, 32**); చైతన్యవాహిని (**32**);
ఈ పుస్తకాలు అందాయి (**33**)

✦ సంతాపాలు : వీరేంద్రసింధు (**02**)


ప్రధాన సంపాదకుడు : **కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : 9490196890 E-mail : ravibabujs@yahoo.co.in

చందాలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :
**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
ఫోన్ : 70759 57010 prajasahithi1977@gmail.com

రచనలు పంపవలసిన చిరునామా :
**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. 59, రాధాకృష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, దగ్గస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – 532001
ఫోన్ : 78936 97469 prajasahithi1977@gmail.com

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 0971-278X

LIBRARY OF CONGRESS
LCCN 94903393

# రచయిత్రి వీరేంద్రసింధుకు జోహార్లు!



**షహీద్** భగత్సింగ్ మూల రచనలను వెలుగులోకి తెచ్చిన వీరేంద్రసింధు లండన్ నగరంలో తన 83వ యేట 23 ఫిబ్రవరి 22న మరణించారు. ఆమె 1940లో పాకిస్తాన్‌లోని పైసలాబాద్ (అప్పటి లాయల్పూర్)లో జన్మించారు.

వీరేంద్రసింధు, సమరయోధుడు షహీద్ భగత్‌సింగ్ చిన్న తమ్ముడు కుల్తార్‌సింగ్ కుమార్తె. భగత్‌సింగ్ ఉరితీత (1931) నాటికి కుల్తార్‌సింగ్‌కి 12 ఏళ్ళు. వీరేంద్రసింధు పుట్టినపుడు ఆయన జైలులోనే వున్నారు. జైలు నుండి కుల్తార్‌సింగ్ 1945లో విడుదలయ్యారు. కుల్తార్‌సింగ్ తాను భద్రపరచిన భగత్‌సింగ్, ఇతర కామ్రేడ్స్ రచనలను వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యతను వీరేంద్రసింధుకు అప్పగించారు.

పాకిస్తాన్‌లోని పైసలాబాద్ నుండి దేశ విభజన తర్వాత తూర్పు పంజాబుకి కుటుంబంతోపాటు వచ్చేసిన వీరేంద్రసింధు ఎమ్.ఎ; బి.ఇడి చదివారు. 1968లో బి.బి.సి. వరల్డ్ రేడియో బ్రాడ్‌కాస్టర్‌గా పనిచేస్తున్న నరేష్ అరోరాను ఆమె వివాహం చేసుకున్నారు. వీరు లండన్‌లో స్థిరపడ్డారు. వీరికి ఇద్దరు కుమారులు. షహ్మన్‌పూర్‌లో టీచర్‌గా పనిచేసిన కాలంలోనే భగత్‌సింగ్ రాజకీయ, సామాజిక, సాంస్కృతిక దృక్పథాన్ని తెలియచేసే గ్రంథాలను ప్రచురించారు. భగత్‌సింగ్ రచనలు, కోర్టు వాంగ్మూలాలు, ఆయన లేఖలు ఆధారంగా 'యుగద్రష్ట భగత్‌సింగ్ ఔర్ ఉన్కే మృత్యుంజయ్ ఫర్కే' పుస్తకాన్ని 1968లో ప్రచురించారు. భగత్‌సింగ్ ఉరితీతకి 20 రోజుల ముందు కుల్తార్‌సింగ్‌కి రాసిన ఉత్తరాలు, విస్తృతంగా సేకరించిన మరిన్ని రచనలతో 'భగత్‌సింగ్ పత్ర్ ఔర్ దస్తావేజ్' పుస్తకాన్ని 1975లో మరియు భగత్‌సింగ్ రచించిన 'క్రాంతికారి సాథి' పుస్తకాలను వెలువరించారు. వీరేంద్రసింధు వెలువరించిన పుస్తకాల ఆధారంగానే మొత్తం భగత్‌సింగ్ రచనలను జనసాహితి తెలుగులో మొదటిసారిగా 'మా నెత్తురు వృధాకాదు' (1986) పుస్తకాన్ని అనువదించి ప్రచురించింది.

షహీద్ భగత్‌సింగ్ సేవాసమితి, వందేమాతరం ఫౌండేషన్‌లవారు 30 సెప్టెంబరు 2007లో భగత్‌సింగ్ శతజయంతి సభను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఆ కార్యక్రమానికి వీరేంద్రసింధును ముఖ్య అతిధిగా ఆహ్వానించారు. ఆ సందర్భంగా వీరేంద్రసింధును జనసాహితి కలిసినపుడు, ఆమె మాట్లాడుతూ "భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 60 ఏళ్ళయినప్పటికీ దాని ఫలాలు పేదలకు అందనేలేదనీ, త్యాగమూర్తుల ఆశయాలు సిద్ధించనేలేదనీ, రోటి, కపడా ఔర్ మకాన్ నిరుపేద ప్రజలకు అందిననాడే నిజమయిన స్వాతంత్ర్యం వచ్చినట్లు" అని అన్నారు. భవిష్యత్తులో నేటి విద్యార్థులు భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకుని అమరవీరుల ఆశయాలను నెరవేర్చాలన్నారు.

వీరేంద్రసింధుకి జనసాహితి జోహార్లు చెబుతున్నది. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూన్నది. ●


'ప్రజాసాహితి'
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
"అకౌంట్ నెం.
**0680101004936**
**IFSC No. CNRB0000680**
**ఫోన్ : 94901 96890**

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

**ప్రజాసాహితి ప్రకటనల ధరలు**
**1/4 డెమ్మీ పరిమాణం**

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం


## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రికపంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# సంపాదకీయం

# విద్యార్థి, యువతరం దివిటీలై వెలుగు నింపాలి!

**బ్రిటిష్** సామ్రాజ్యవాదులు మనదేశం నుండి ప్రత్యక్షంగా తొలగి ముప్పాతికేళ్ళు అయింది. ఈ ముప్పాతికేళ్ళ మన దేశీయ పాలకుల పరిపాలనలో ప్రజల జీవన విధానం మెరుగుపడకపోగా మరింతగా దిగజారిపోతూంది. 1990ల తర్వాత మనదేశంలో అమలుచేయబడిన నూతన ఆర్థిక సరళీకరణ విధానాల వలన దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మృగ్యమయ్యాయి. ప్రపంచబ్యాంకు విధించిన షరతులలో భాగంగా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో 60 లక్షలు, రాష్ట్రంలో 2 లక్షలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేయలేదు. ఈ షరతుల ప్రకారమే ప్రభుత్వాలు సంక్షేమరంగాల బాధ్యతల నుండి తప్పుకుని కొత్తగా ఉద్యోగాలను ప్రకటించటంలేదు. అరాకొరా ఉన్న ఉద్యోగాల్ని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతుల్లో భర్తీ చేస్తూంది. గత 30 ఏళ్ళల్లో దేశంలో సుమారుగా 5 లక్షలదాకా పరిశ్రమలు మూతపడ్డాయి. లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వరంగ పరిశ్రమలన్నింటినీ నష్టాల్లో వున్నట్లు చూపించి కార్పొరేట్ సంస్థలకు, విదేశీ కంపెనీలకు కారుచౌకగా అప్పచెబుతున్నారు. కార్మికులు, వారి కుటుంబాలు వీధిన పడుతున్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన పాలకులైన ప్రధానమంత్రి మోడీ "ఇకనుండి ప్రభుత్వ ఉద్యోగాలు ఉండవనీ – పకోడి, బజ్జీ, పాన్‌షాపులు పెట్టుకుని యువతే ఉపాధిని కల్పించుకోవాలని" బాధ్యతారహితంగా ప్రకటిస్తున్నారు. ఉపాధి కోసం యువత ఇతర దేశాలకు వలసలు వెళ్ళి వెట్టిచాకిరీ చేస్తున్నారు. ఇక నిరుద్యోగ సమస్య గురించి, హుందాగా ఆత్మగౌరవంతో ప్రజలంతా బ్రతకాలన్న రాజ్యాంగపు హక్కు గురించి పట్టించుకోవాల్సిన పాలకులే గుత్తపెట్టుబడిదారుల, బహుళజాతి కంపెనీల సేవలో మునిగి వున్నారన్నది నేటి యథార్థ దృశ్యం.

మరోవైపు వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల్లో బహుళజాతి కంపెనీల ప్రవేశంతో సామ్రాజ్యవాద దోపిడీ తీవ్రతరం అయ్యింది. సబ్సిడీలు ఎత్తివేయటం, గిట్టుబాటు ధరలు ఇవ్వకపోవటంతో రైతాంగం పరిస్థితి దుర్భరమైపోతున్నది. ఈ దుర్భరమైన సంక్షోభ పరిస్థితుల సుడిగుండంలో చిక్కుకుని ఎందరో రైతాంగం, కార్మికులు ఆత్మహత్యల బాట పడుతున్నారు. ఇక పెరుగుతున్న విద్యార్థి, యువతరం ఆత్మహత్యల వార్తలు కలవరపరుస్తున్నాయి.

బ్రిటిష్‌వారు ప్రవేశపెట్టిన మెకాలే విద్యావిధానానికి కొనసాగింపుగా సాగుతున్న నేటి విద్యావిధానంలో సంస్కరణల పేరుతో, నూతన విద్యావిధానాల పేరుతో చేస్తూన్న మార్పులన్నీ విద్యను ప్రైవేటీకరించటానికి, కార్పొరేటీకరించటానికే తోడ్పడుతున్నాయి. 2020లో ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానం, ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పాఠశాలల విలీనం, తెలుగు మాధ్యమం రద్దు, ఎయిడెడ్ విద్యా ప్రైవేటీకరణ మొదలైన విధానాలు పేద, మధ్యతరగతి వర్గాలను చదువులకు దూరం చేస్తున్నాయి. ఈ విధానాల కారణంగా నేటికీ దేశంలో 16 కోట్లమంది బాలకార్మికులు ఉన్నారు. అక్షరాస్యత 74 శాతం అని పాలకులు ప్రకటించినా 50 శాతానికి మించి లేదన్నది వాస్తవం. చదువుకున్నవారు, చదువులేనివారు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక, దిక్కుతోచక ఆత్మహత్యల బాట పడుతున్నారు. రైతాంగం, చేనేత కార్మికులు, వివిధరంగాల కార్మికులు, నిరుద్యోగులు, విద్యార్థుల ఆత్మహత్యలు దేశంలోనూ, రాష్ట్రంలోనూ రోజురోజుకీ పెరిగిపోతున్నాయి.

వీటితోపాటు ముప్పాతికేళ్లుగా ప్రజల ఆలోచనలను నిరంతరం భ్రమల్లో ఉంచడానికి పాలకవర్గాలు వివిధ పద్ధతుల్లో విషసంస్కృతిని వ్యాప్తిచేస్తున్నారు. డబ్బు సంపాదించడమే అంతిమ లక్ష్యంగా, వ్యక్తివాదాన్ని, కెరీరిజాన్ని ఉన్నత విలువగా విద్యావిధానాల ద్వారా పాలకవర్గాలు వ్యాప్తి చేస్తున్నాయి. మద్యం, మాదకద్రవ్యాలు యువతను ఆలోచనారహితులుగా, క్రియాశూన్యులుగా చేస్తున్నాయి. సరుకుల సంతలో సామాజిక సాంస్కృతిక విలువలు అన్నీ లాభనష్టాల తూకంలోనే కొలవడం ప్రజాస్వామిక విలువగా చలామణి అవుతోంది. ఈ పరాధీన విద్య యువతరాన్ని ఉద్యోగమనే ఎండమావులెంట పరిగెట్టిస్తూంది. నేటి విద్యార్థి యువతరం అభద్రతల సుడిగుండం అనే దారుణ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

ఈ మధ్యనే పాఠశాల విద్యార్థిని 13 ఏళ్ల నిఖిత చదువుల ఒత్తిడి భరించలేక తరగతి గదిలోనే ఉరితీసుకుంది. ఇంటర్మీడియట్ విద్యార్థి సాత్విక్ 17 ఏళ్ల నవ యవ్వనంలో చదువుల భారాన్ని తట్టుకోలేక తరగతి గదిలోనే ఉరి తీసుకున్నాడు. 16 ఏళ్ళ దివ్య పరీక్షల్లో తప్పితే ఎదురయ్యే దారుణ పరిస్థితులను తలచుకొని ఆత్మహత్య చేసుకుంది. ప్రేమోన్మాదం, లైంగిక వేధింపులు వెరసి ర్యాగింగ్ రూపాన్ని సంతరించుకుని 20 ఏళ్ల రక్షితను, 26 ఏళ్ల వైద్య విద్యార్థిని ప్రీతినీ, విద్యాసంస్థల్లోని సాంస్కృతిక విష వాతావరణం బలి తీసుకుంది. అలాగే ఐఐటి అనే ఉన్నత, మహోన్నత విద్యాలయాలకు ఎదిగిన అణగారిన వర్గాల 18 ఏళ్ళ దర్శన్ సోలంకి, 17 ఏళ్ళ శ్రీ సాయి, 16 ఏళ్ళ సురభి

పాంచాలి, ఆ వాతావరణంలోని అవమానాలను భరించలేక ఆత్మహత్య చేసుకున్నారు. ఈ భావి మేధావుల్ని మన మనుధర్మ విద్యావిధానం పొట్టన పెట్టుకుంది. ముప్పాతికేళ్ల భారతదేశం దేశ విద్యార్థి యువతరానికి గరళాన్ని రుచి చూపించింది.

NCRB (జాతీయ నేర పరిశోధనా సంస్థ) నివేదిక ప్రకారం దేశంలో జరుగుతున్న అనేక ఆత్మహత్యల్లో ఎనిమిది శాతం విద్యార్థులవేనని తెలుస్తోంది. ఆ 8 శాతంలోనూ కూడా, 50% ఆత్మహత్యలు 18 ఏళ్ల లోపు వారివే అని చెప్పడం భారత అశాస్త్రీయ విద్యావిధానాలకు అద్దం పడుతోంది. 2022లో అయితే ఈ ఆత్మహత్యలు అత్యధిక స్థాయిలో నమోదయి రోజుకి 36 మంది విద్యార్థులు బలవంతంగా ప్రాణాలు తీసుకున్నారన్న వాస్తవం సమాజాన్ని తీవ్రంగా ఆందోళన పరుస్తోంది.

నాగరిక ప్రపంచంలో ఉండాల్సిన పరస్పర సహకారాన్ని కాలరాస్తున్న అనారోగ్యకరమైన పోటీ ఎండమావి పరుగుల ప్రపంచమే ఈ ఆత్మహత్యలకు నెలవు అవుతోంది. ఈ పోటీ పరుగుల్లో నిజానికి ఖరీదైన జీవనాన్ని, విలాసవంతమైన జీవితాన్ని కేవలం ఐదు శాతం మంది మాత్రమే దక్కించుకోగలుగుతున్నారు. మిగిలిన 95% వికృతమైన, అనారోగ్యకరమైన, నిస్సహాయకరమైన పోటీ పళ్ళ చక్రాలలో నలిగి పోతున్నారు. ఈ విషయం మీదే 3.8 లక్షల మంది మీద నిర్వహించిన NCERT సర్వే ఏం చెప్తుంది అంటే – 52 శాతం మంది విద్యార్థీ, యువతరం తీవ్రమైన చదువుల ఒత్తిడిలో శారీరక – మానసిక ఆరోగ్యాలను కోల్పోతున్నారు. 42 శాతం మంది అగమ్య గోచరంగా ఉన్న తమ భవిష్యత్తుపై బెంగపెట్టుకుని, భయపడి, నిరర్థకమైన ఆందోళనకు గురవుతున్నారు. కేవలం ఆరు శాతం మంది మాత్రమే ఈ భయంకరమైన, విషపూరితమైన, అనారోగ్యకరమైన పోటీ ప్రపంచంలో ఆరోగ్యంగా, స్వేచ్ఛగా ఒంటి స్తంభం మేడలో, ఎవరి గురించి కూడా పట్టించుకోకుండా ఒంటరి లంకలుగా నెట్టుకొస్తున్నారు.

**"విద్యార్థులు చేయాల్సిన ముఖ్యమైన పని చదువుకోవడం అని, వారు తమ దృష్టినంతటినీ చదువు మీదే లగ్నం చేయాలనీ మనం అంగీకరిస్తాం. అయితే – దేశ పరిస్థితుల అవగాహన, వాటిని మెరుగుపరిచే ఆలోచనలకు ప్రోదిచేసే యోగ్యతని కలిగించడం చదువులో భాగం కాదా! కాకపోతే ఆ చదువు వ్యర్థం అంటాను."**

ఈ మాటలను 24 ఏళ్ల నవ యువకుడు, అందులో, కేవలం 7 ఏళ్ళే తిరుగులేని రాజకీయ జీవితాన్ని నెరపి, దేశానికి నిజమైన శ్రామికవర్గ స్వాతంత్రాన్ని సాధించి పెట్టాలని జీవితాన్ని ఉరికంబానికి బలిదానం చేసిన భగత్ సింగ్ చెప్పారు. ఆయన చూపిన పోరాటబాటే భారత యువతకు దిక్సూచి.

మనం గతాన్ని నెమరువేసుకుంటే మహత్తర శ్రామికవర్గ పోరాటానికి తొలి విత్తుగా మొలకెత్తిన పారిస్ కమ్యూన్‌కు నేటికి 152 ఏళ్ళు. కుప్పకూలినా సరే, సామ్యవాద సమాజానికి మేలు నమూనాగా నిలిచిన రష్యా చైనా విప్లవాల అనుభవాలు ఉన్నాయి. మహత్తర తెలంగాణ, నక్సల్ బరి, శ్రీకాకుళ సాయుధ పోరాటాలు మిగిల్చి వెళ్లిన శ్రామిక వర్గ సంస్కృతి ఇంకా దీప స్తంభాలుగా నిలబడే ఉన్నాయి. ఈ విప్లవోద్యమ పోరాటాలలో నిప్పులు చిమ్మే యువతరం నిర్వహించిన త్యాగశీల పాత్రను నేటి యువతరం అంది పుచ్చుకోవాలి. ఆత్మహత్యలు పరిష్కారం కాదు. హుందాగా, ఆత్మగౌరవంతో బ్రతికే సమాజం కోసం పోరుబాట పట్టటమే నేడు విద్యార్థి, యువతరం ఎంచుకోవాల్సిన లక్ష్యం. విద్యార్థి యువతరాన్ని మేల్కొల్పాల్సిన బాధ్యత, వారికి పోరాటస్ఫూర్తిని అందించాల్సిన బాధ్యతలను దేశం ఒట్టిపోక ముందే రచయితలం, కళాకారులం, మేధావులం చేపడదాం.

**26 మార్చి 2023**

కవిత

## విద్య లేనివాడు వింత పశువా....!

– పల్లి మణికంఠ

గింజ పండించి
గెంజి దిగడం కోసం
గింజుకుంటున్న
శ్రామిక గుడిసెలకు
గంజాయి అలవరచి
బతుకులు గుంజుతున్న
గడుసరి ఒక చదువరి

రెక్కాడితే గాని
డొక్కాడని రైతుకు
ధాన్యం ముక్కలుగా నలిపి
ముప్పై వంకలు వెతికి
దిక్కుతోచక, ధిక్కరించని చేతికి
దిగువ సంఖ్యలతో సంకెల వేసిన
దళారి ఒక చదువరే!

పలక – బలపం స్పర్శ తెలియక,
కట్టె – గొడ్డలి స్నేహమెరిగి,
కడుపుమంటతో వంటకోసం
రెమ్మ కొడితే నేరమా....!
విద్య తెలిసి,
వినయమెరిగి,
వృద్ధి పేరుతో వనము నరికితే
న్యాయమా....!

తోటి వ్యక్తికి గాటు రగిలితే,
కొంగు చింపి, అంగి చింపి,
కట్టు కట్టిన వేలిముద్రలు....

బిల్లు కడితేగాని
ఒళ్ళు తాకని, హృదయనాదమినని
వైద్యశాలల ఇంకు చుక్కలు
విద్యలెక్కడ? విలువలెక్కడ?

విద్య లేనివాడు వింత పశువా
మరి విద్య నేర్చి,
విలువ తప్పితే
ఎంత పశువు?

కథ

# దొంగలు

– ప్రసన్న

"ఏరా పవనూ! రాత్రి మీ ఇంట్లో దొంగలు పడ్డారంటా?"

న్యూస్ పేపర్ చూడడానికి రోజూలాగే పంచాయితీ ఆఫీస్ దగ్గరకొచ్చిన పవన్ని పెద్దమనిషి తరహాలో పలకరించాడు కోటయ్య. నిజానికి కోటయ్య ఆ ఊరికి పెద్దమనిషే! ఆకారంలోనో, ఆత్మీయతలోనో కాదులేండి, ఆస్తిపాస్తుల్లో.

"ఔను బాబాయ్! నేను రావడం చూసి పారిపోయాడు వెధవ."

"నువ్వు నగ్జలైటువని వాడికి కూడా తెలిసుంటుందిలేరా!"

"ఊరుకో బాబాయ్! నీ వెటకారానికి నేనే దొరికానా పొద్దున్నే! అంత పెద్ద పెద్ద మాటలు అనిపించుకోవాలంటే చాలా అర్హతలు కావాలి"

"నగ్జలైట్లంటే దేశద్రోహుల కింద జమ కడతారందరూ.... నువ్వేమో వాళ్ళని మరీ అకాశానికేత్తేస్తావు. అందుకు గదంట్రా నిన్నందరూ నగ్జలైటనేది.... అదిసరేగానీ ఇంతకీ ఎవడ్రా వాడు?"

"ఎవడో మనూరోడే అయ్యుండాలి బాబాయ్. ఆరితేరిన దొంగలైతే ఏ ఒంటిగంటకో, రెండింటికో వస్తారు. ఈడు దొంగతనానికి కొత్తనుకుంటా. పదకొండింటికే వచ్చాడు!"

"ఏమేం పొయినియ్యేంటి?"

"ఏం పోలేదులే, వాడప్పుడే లోపలికి వచ్చాడనుకుంటా, నేను ఇంట్లోంచి బయటకు రావడం చూసి కంగారుగా గోడదూకి పారిపోయ్యాడు."

"ఎవడిమీదైనా అనుమానం ఉందా?"

"అమ్మవాళ్ళు మా ఇంటి ఎనక సుబ్బయ్య కొడుకయ్యుంటాడని అంటున్నారు బాబాయ్. వాడు చీకట్లో నాకు సరిగా కనిపించలేదు మరి."

"ముందు పోలీస్ కంప్లైంట్ ఇవ్వండి వాడిమీద. ఎందుకైనా మంచిది."

"మనకేం నష్టం జరగలేదుగా బాబాయ్. వాడో కాదో తెలియకుండా వాడిమీద కంప్లైంట్ ఇస్తే, పోలీసులు వాడ్ని పీల్చేయ్యరూ పాపం!"

"ఇప్పుడు నువ్వు గమ్మునుంటే వాడు మళ్ళీ వస్తాడు. నష్టం జరిగినాక తీరిగ్గా కంప్లైంట్ చేస్తే తిరిగి వచ్చేదేమీ ఉండదు. తర్వాత నీ ఇష్టం" లోపలికెళ్ళాడు కోటయ్య.

ఇదంతా వింటున్న కనకమ్మ లోపలికొచ్చిన కోటయ్యతో "ఎందుకండీ వాడ్ని రెచ్చగొడుతున్నారు. మొన్న ఎలక్షన్లో వాళ్లెమన్నా మనకి ఓటేశారా? ఆ సుబ్బడు మనమంటే ఎంత గౌరవంగా ఉంటాడు. వాడిమీద కంప్లైంట్ ఇవ్వమని పంపుతారేంటీ? మీకేమైనా పిచ్చా?"

"పిచ్చికాదే పిచ్చిదానా! ఆ సుబ్బడి కొడుకు ఇంతకుముందు కూడా ఒకట్రెండుసార్లు ఇలాగే చేశాడు. ఈ ఎదవల్ని ఊరకే వదిలేస్తే ఏదొకరోజు మన ఇంటికి కూడా కన్నమేస్తారు. మన చేతికి మట్టంటకుండా ఇట్టాంటి పోరంబోకుల్ని అదుపులో పెట్టాలి."

"ఔను నిజమే ఆ పవనుగాడింట్లో ఏం దొరుకుతయ్యని పొయ్యాడో పిచ్చిసన్నాసి!"

"ఇంటెనకే కాబట్టి దొరికినకాడికి చేతబట్టుకుని ఎవరికీ కనబడకుండా ఇంట్లో జొరబడొచ్చుని పొయ్యుంటాడు!"

★ ★ ★ ★ ★

"ఏందమ్మా, రాత్రి దొంగలొచ్చారంట? పోలీసులకి చెప్పారా?"

కరువుపనికి పోయొచ్చి ఇంటిముందు మెట్లమీద తీరిగ్గా కూర్చుని ఏదో ఆలోచిస్తున్న కమలమ్మని అడిగాడు కోటేశు పంతులు.

కమలమ్మకి కోపం నషాలానికంటింది. ఏమీ ఎరగనట్టు ఎంత నంగనాచి మాటలు మాట్లాడుతున్నాడో చూడు. అనుకుంది మనసులో.

కోటేశుపంతులు సుబ్బయ్యకి దూరపు చుట్టమే. బడిపంతులుగా ఉన్నప్పుడు సైకిలు మీద తిరిగిన కోటేశు రియల్ ఎస్టేట్ బ్రోకరుగా బాగా సంపాదించి ఇప్పుడు కారు లేకుండా ఇంట్లోంచి బయటకు రాడు.

"మేమొకరిజోలికి పొయ్యేవాళ్లంకాదు. మా జోలికొచ్చినోడు ఏం బాగుపడతాడు పంతులూ, నాశనమైపోతాడు."

పంతులికి కోపం వచ్చి ఏమైనా అంటే ఆ వంకతో తన ఆక్రోశం వెళ్లగక్కొచ్చని కావాలనే అలా మాట్లాడింది కమలమ్మ.

"మీ అనుమానం నిజమే. వాడ్ని పోలీసులకి పట్టివ్వలేదంటే ఇంకొకరోజు మీ ఇంట్లో దొంగతనం జరగడం ఖాయం. నా దగ్గర తిట్టి ఉపయోగం ఏముంది. మీ అబ్బాయిని పోలీస్ స్టేషన్‌కి పోయి కంప్లైంట్ పెట్టిరమ్మను."

కమలమ్మకి ఏమీ అర్థంకాలేదు. వాళ్ళలో వాళ్ళకి ఏమైనా గొడవలుండయ్యేమోలే! అని సరిపెట్టుకుంది.

"నీకేమన్నా బుద్ధుందా! వాడు ఎంత ఎదవైనా మనోడ్ని పోలీసులకి పట్టిచ్చమని మనమే చెప్పటమేందయ్యా?"

"మన దీపమేకదాని ముద్దు పెట్టుకుంటే మూతంతా కాలిందన్నట్టు అట్టాంటోడ్ని ఊరికే ఒదిలేస్తే రేపు మన కొంపలో దొంగతనం చెయ్యడని గ్యారెంటీ ఏముంది?"

★ ★ ★ ★ ★

న్యూస్‌పేపర్ చూసి ఇంటికొస్తున్న పవన్‌కి అప్పుడే తన ఇంటి ముందు నుంచి కదులుతున్న కోటేశుపంతులు కారును చూడగానే అప్పటిదాకా అక్కడ జరిగిన చర్చ ఏంటో అర్థమయ్యింది. రాత్రి నుంచి పోలీస్ కంప్లైంట్ ఇవ్వమని కమలమ్మ, వద్దని పవనూ వాదనలు జరుగుతూనే ఉన్నై. ఇంటికి వచ్చిన పవన్‌తో ఈ విషయమై మళ్ళీ చర్చ మొదలెట్టింది కమలమ్మ. కోటేశుపంతులు మాటలు కరెక్టే ననిపించింది కమలమ్మకి. కమలమ్మ ఒత్తిడికి పవన్ కూడా మెత్తబడ్డాడు. చీమకుర్తి పోలీస్ స్టేషన్‌కి బయల్దేరాడు. పక్కింటి ఇమానుయెల్ హడావిడిగా ఇంట్లోంచివచ్చి....

"ఎక్కడదాకన్నా!"

"పోలీస్ స్టేషన్‌కి ఇమానుయెల్."

"కొంచెం పనుంది. నేను కూడా వస్తానన్నా!"

తనని కూడా బండి ఎక్కించుకుని బయల్దేరాడు పవన్.

"పోలీస్ స్టేషన్‌కు ఎందుకన్నా!" మాట కలిపాడు ఇమానుయెల్.

"రాత్రి మా ఇంటికి దొంగవచ్చాడు కదా. కంప్లైంట్ ఇద్దామని."

"దొంగ ఎవరో తెలిసిందా అన్నా!"

"తెలియదు తమ్ముడూ!"

"మరి కంప్లైంట్ ఎవరి మీద ఇస్తావ్?"

"మనకి తెలిసినవరకు చెబితేచాలు. గుర్తుతెలియని వ్యక్తి దొంగతనానికి పాల్పడ్డాడని కంప్లైంట్ రాసుకుంటారు." పవన్ తెలియదంటు న్నప్పటికీ ఇమానుయెల్‌కి అనుమానంగానే ఉంది. తనముందు తెలియనట్లు నటిస్తూ, స్టేషన్‌కి వెళ్ళాక శామ్యూల్ మీదనే కంప్లైంట్ ఇస్తాడని.

"అన్నా! నువ్వు ఏమీ అనుకోకపోతే ఒక విషయం చెప్తా. వాడు నాతోనే పనికివస్తాడు. అలాంటివాడుకాదు. బయట చిన్నచిన్న దొంగతనాలు చేస్తాడు కానీ మన దగ్గర అలాచెయ్యడు. రాత్రి తాగిన మైకంలో పొరపాటున మీ ఇంటికి వచ్చాడు. ఇప్పుడు నువ్వు కంప్లైంట్ ఇస్తే పోలీసులు వాడ్ని పిండుకుంటారు."

పవన్‌కి అర్థమైంది. ఇమానుయెల్ ఎవరి గురించి చెబుతున్నాడో.

"అంటే అమ్మ రాత్రి నుండి చెబుతుంది నిజమేనన్నమాట."

తనక్కూడా ఎక్కడో కొద్దిపాటి అనుమానం ఉన్నా ఎందుకో ఇప్పటిదాకా నమ్మలేకపోయాడు. శామ్యూల్ ఇలా చేస్తాడని ఎప్పుడూ అనుకోలేదు. ఇప్పుడేం చేయాలి? వాడిమీదనే కంప్లైంట్ ఇవ్వడమా? మానుకోవడమా? ఆలోచనలో ఉన్నాడు పవన్.

"అన్నా! ఈ ఒక్కసారికి వదిలేయ్. మరోసారి జరిగితే తప్పకుండా కంప్లైంట్ పెడుదువుగాని. రాత్రి నేను వాడ్ని తన్నబొయ్యా. తప్పైందని కాళ్ళు పట్టుకున్నాడు. వాడికి మొహం చెల్లక రాత్రే వాళ్ళ అక్కవాళ్ళ ఊరు వెళ్ళాడు. వాళ్ళనాన్న హాస్పటల్లో ఉన్నాడు తెలుసుగా. వాడ్ని పోలీసులు ఎత్తుకెళ్తే వాళ్ళమ్మ ఒక్కతే హాస్పిటల్ దగ్గర చూసుకోలేదు."

ఎలాగైనా శామ్యూల్‌ని కాపాడాలని గట్టిగా బతిమాలుతున్నాడు ఇమానుయెల్.

"వాడిపేరు చెప్పనులే ఇమానుయెల్. ఊరకనే కంప్లైంట్ ఇచ్చేస్తా. లేకపోతే మా అమ్మ నన్ను సతాయిస్తది."

పవనెలాగూ మాట వినేలా లేదనుకున్న ఇమానుయెల్....

"సర్లేన్నా నేనూ ఎప్పుడూ పోలీస్ స్టేషన్‌కి పోలేదు. పద నేను కూడా అక్కడదాకా వస్తాను."

ఇమానుయెల్ ఎందుకు వస్తానంటున్నాడో అర్థమైన పవన్....

"నేను నిజంగానే వాడిపేరు చెప్పను ఇమానుయెల్. నువ్వు రావాలనుకుంటే రా వెళ్దాం."

ఇంతలో పోలీస్ స్టేషన్ రానే వచ్చింది. జనం గుంపులుగుంపులుగా ఎవరి గోలలో వాళ్ళు ఉన్నారు. కొన్ని గుంపుల దగ్గర ఒకరిద్దరు కానిస్టేబుళ్లు ఉండి మాట్లాడుతున్నారు. రిసెప్షన్ దగ్గర ఉన్న నాలుగైదు కుర్చీలు కూడా ఖాళీగా లేవు. రిసెప్షన్ దగ్గరకెళ్ళి పవన్ అడిగాడు....

"మేడమ్! ఎస్సైగారిని కలవాలి."

"ఏంటి పని."

"రాత్రి మా ఇంట్లో దొంగతనం జరిగింది. కంప్లైంట్ ఇవ్వాలి."

"ఎస్సైగారు బిజీగా ఉన్నారు. ఈలోగా కంప్లైంట్ రాయండి".... పేపర్ చేతికిచ్చింది.

"దొంగతనం జరగలేదుకదన్నా!".... పవన్‌కి మాత్రమే వినపడేలా సనుగుతున్నాడు ఇమానుయెల్.

"సరేలే తమ్ముడూ కంప్లైంట్లో అలాగే రాద్దాంలే!"

పవన్ రాస్తున్నాడు, ఇమానుయెల్ చూస్తున్నాడు. రాయడం పూర్తయ్యాక ఎస్సై అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నారు ఇద్దరూ.

"ఈ ఎస్సై దేశముదుర్రా!".... ఎవరో గొణుగుతూ ఎస్సై చాంబర్నుండి బయటకు వస్తున్నారు.

"ఈ దేశం బాగుపడదురోయ్" పక్కనింకొకడు వంత పాడుతున్నాడు.

ఎస్సైదగ్గరకి పోయొచ్చి పవన్ని లోపలకి పోవలసిందిగా పురమాయించింది రిసెప్షన్ కానిస్టేబుల్.

అసలే మొదటిసారి, దానికితోడు ఇప్పుడే విన్న విశేషణాలు. ఇద్దరూ భయంభయంగా లోపలకెళ్లి ఒక మూలన నిల్చున్నారు.

"ఏంటి కంప్లైంట్?"

"నినిని.... నిన్న మా ఇంటికి దొంగొచ్చాడు సార్."

"చుట్టమొచ్చినట్టు చెప్తన్నావేందిరోయ్? దొంగొచ్చేదేంది? దొంగతనం జరిగిందని చెప్పాలి.... ఇంతకీ మీదే ఊరు?

ఇమానుయెల్ మీద కోపమొచ్చింది పవన్‌కి. దొంగతనం జరిగిందంటే వీడందు కుంటాడు. దొంగొచ్చాడంటే ఎస్సైగాడి ఎటకారం....

"మాది హుస్నాబాద్ సార్.... దొంగతనమేమీ జరగలేదులే సార్!" ఇమానుయెల్ కలుగజేసుకున్నాడు.

"మరెందుకొచ్చారిక్కడికి?"

"రాత్రి పదకొండింటికి దొంగ మా కాంపౌండ్ వాల్ లోపల కనిపించాడు సార్. నేను క్రిందకి దిగడం చూసి వెంటనే పారిపోయాడు సార్."

"నువ్వేం ఆకాశం నుంచి కిందకి దిగుతున్నావా?"

"ఎండాకాలం ఉక్కపోతకి ఇంటిపైన నిద్రపోతూ యూరినల్స్ కోసం కిందకొచ్చాను సార్."

"నువ్వేడ నిద్రపోతే నాకెందుకుగానీ నీకెవురిమీదైనా అనుమానం ఉందా?"

"లేదుసార్!".... ఇమానుయెల్ మళ్ళీ జోక్యం చేసుకున్నాడు.

"ఇంతకీ ఎవరింట్లో దొంగలుపడ్డారు." గద్దించాడు ఎస్సై.

"మా ఇంట్లోనే సార్" పవన్ భయం భయంగానే చెప్తున్నాడు.

"మరి నువ్వెవరు?" మళ్ళీ ఎస్సై గద్దింపు

"ఫ్రెండ్ సార్" సర్దిచెప్పబోయాడు పవన్

"నువ్ బయటకెళ్లు"

బయటికెళ్ళాడు ఇమానుయెల్.

"సొమ్మేమీ పోలేదు. ఎవరిమీదా అనుమానం లేదు. మరిక్కడికెందుకొచ్చార్రా! మేమిక్కడ ఊరికే తిని కూర్చుంటున్నామను కుంటున్నారా?"

నేనేదో యాదృచ్ఛికంగా క్రిందికి రాబట్టి నష్టం జరగలేదు సార్! లేకుంటే.... చెప్పబోతున్నాడు పవన్.

"నన్ను మీ ఇంటికి కాపలా ఉండమంటావా మరి? మొన్న గుడిలో దొంగతనమన్నారు. ఇప్పుడు ఇంట్లో అంటున్నారు. మీ ఊరోళ్ళకిదొక తమాషా అయిపోయింది."

"రెండ్రోజులు మా ఊరికి పెట్రోలింగ్‌కి పంపితే మాకు కొంచెం ధైర్యంగా ఉంటది సార్!"

"ఏంచెయ్యాలో మాకు తెలుసుగానీ నువ్వు ఆ కాగితం రైటర్‌కిచ్చిపోరా! ప్రతోడూ పోలీసులకి ఆర్డర్లు ఏసేవాడే!"

రైటర్ సార్ కూడా కొద్దిపాటి ఇంటరాగేషన్ చేసి కంప్లైంట్ తీసుకుని వెళ్లమన్నాడు.

బయటికొస్తున్న పవన్ దగ్గరకి ఆత్రంగా వచ్చాడు ఇమానుయెల్. "అన్నా! ఇంతకీ వాడిపేరు చెప్పలేదుగా"

ఇమానుయెల్‌ని పక్కకి తీసుకెళ్ళాడు పవన్. "చెప్పలేదుకానీ, వాడు ఎదవని తెలిసి కూడా ఎందుకు వాడికి కోపం తెప్పించటం!"

"వాళ్లంతేలే అన్నా! ఇంక ఎల్దామా"

"ఔను ఇమానుయెలూ! కోటయ్య బాబాయి, కోటేశు పంతులూ ఇక్కడికొచ్చారేంటి?"

"ఎప్పుడొచ్చారూ?"

"అరుగో..."

"వీళ్ళకి ఇక్కడేమి పనబ్బా..."

"ఏమో చూద్దాం నువ్విక్కడే ఉండు."

మాట్లాడదామని దగ్గరకెళ్లేలోపే ఎస్సై రూమ్లోకి వెళ్లిపోయారిద్దరూ. "మనమైతే గంటలు గంటలు ఎదురుచూడాలి గానీ పెద్దోళ్ళు.... ఎంత దర్జాగా రాగానే లోపలికి వెళ్తున్నారో చూడు" అనుకుంటూ బయటకొచ్చాక మాట్లాడదామని ఎస్సై రూము గుమ్మం దగ్గరే నిల్చున్నాడు పవన్. ఇందాక వీళ్ళిద్దరే పోలీస్ కంప్లైంట్ ఇవ్వమని గట్టిగా చెప్పారు.

నేను ఇక్కడికి వచ్చిన సంగతి తెలిసి వచ్చారా? వేరే పనిమీద వచ్చారా? ఏం పనుంటుందబ్బా...?" ఆలోచిస్తున్నాడు పవన్. ఇంతలో లోపల్నుంచి ఎస్సై మాటలు గట్టిగానే వినబడుతున్నై.

"వాడు ఇందాక వచ్చి కంప్లైంట్ ఇచ్చాడుగానీ ఎవరిమీదా అనుమానం లేదని రాసిచ్చాడే.".....

"అంటే వీళ్ళొచ్చింది మన పనిమీదనే నన్నమాట. ఐనా ఈల్లకేంది అంత ఇంట్రస్టు."

"నువ్వేంచేస్తావో నాకు తెలియదు ఎస్సైగారూ! ఈ దొంగతనం వాళ్ళింటెనక సుబ్బిడి కొడుకు మీద కెళ్లిపోవాల!"

"అసలు వాడు దొంగతనమే జరగలేదంటుంటే మనమేంచేస్తాం కోటయ్యా!"

"నేను చెప్పేది ఈ దొంగతనం గురించి కాదు. ఆ దొంగతనం గురించి."

"ఏ దొంగతనమూ?"

"ఓరి నీ దుంపదెగ! నీకెవుడయ్యా పోలీసుజ్జోగమిచ్చింది? మా ఊరి గుడిలో దొంగతనం సంగతయ్యా బాబూ!" కోటయ్య నసిగినా స్పష్టంగానే వినపడింది పవన్‌కి.

"ఓ! అదంటావా! నీ మెదడు భలే పనిచేస్తాంది కోటయ్యా! ఇక్కడినుంచి ట్రాన్స్ఫర్ అయ్యేలోపు ఈ దరిద్రాన్ని మన నెత్తిమీద నుంచి ఎలా దింపుకోవాలా అని ఆలోచిస్తున్నా గానీ నాకు రాలేదు ఈ ఐడియా! ఒక్కదెబ్బతో మన ముగ్గురిమీ బయటపడిపోతాం"

"గుడి దొంగతనానికీ వీళ్ళకీ సంబంధం ఏంది? అంటే వీళ్ళే కాజేసారా దేవుడి సొమ్ములు? ఆ దొంగతనాన్ని ఎవరిమీదో నెట్టాలని కుట్ర పన్నుతున్నారా? ఓరి దొంగనాయాళ్ళారా!"

"సరే ఇంక మేం బయల్దేరతాం మరి!" ముక్తాయింపు ఇచ్చాడు కోటేశుపంతులు.

పవన్ వాళ్ళకి కనబడకుండా పక్కకి తప్పుకున్నాడు.

వాళ్లెళ్లిపోయాక ఇమానుయెల్‌కి జరిగిందంతా చెప్పాడు. చాలాసేపు ఆలోచించాక ఎమ్మెల్యేని కలిసి చెబుదామన్నాడు ఇమానుయెల్.

"ఎమ్మెల్యే మనకి సపోర్ట్ చేస్తాడని నాకు నమ్మకం లేదు ఇమానుయెల్. కానీ అన్యాయంగా శామ్యూల్ని నేనే ఇరికిచ్చినోడినౌతాను! సరే, చూద్దాం. ఎమ్మెల్యే ఎక్కడున్నాడో కనుక్కో!"

ఎమ్మెల్యే చీమకుర్తి పార్టీ ఆఫీస్లోనే ఉన్నాడని తెలిసి బయల్దేరారు.

పార్టీ మీటింగుల్లో ఇమానుయెల్‌కి ఎమ్మెల్యేతో కొద్దోగొప్పో ముఖపరిచయం ఉంది. అలా వెంటనే ఎమ్మెల్యే దగ్గరికి పోగలిగారు. చూడగానే అడిగాడు ఎమ్మెల్యే "ఏం ఇమానుయెల్ మన కుర్రోళ్ళంతా ఎలా ఉన్నారు?

"బాగానే ఉన్నారు సార్! చిన్న సహాయం కోసం మీ దగ్గరకొచ్చాం."

"చెప్పు. ఔను ఇతను.... మీ వూరే కదూ."

"ఔను సార్. రాత్రి మాపక్కింటి శామ్యూల్‌గాడు తాగిన మైకంలో ఈళ్ళింట్లో కెళ్ళాడు. ఇంట్లోవాళ్ళ గొడవ తట్టుకోలేక అన్న పోలీస్ కంప్లైంట్ ఇవ్వడానికొచ్చాడు. తీరా ఇక్కడికొచ్చాక తెలిసింది. మా ఊరి గుడి దొంగతనం కేసు మన శామ్యూల్ గాడి మీద ఎయ్యటానికి మా ఊరి పెద్దమనుషులు – ఎస్సై కలిసి ప్లాన్ వేస్తున్నారని. అందుకు ఈ అన్న పెట్టిన కేసును వాడుకోబోతున్నారని. ఇంకొకటేందంటే ఆ గుడిలో నగలు కాజేసింది ఈ ముగ్గురే. ఇప్పుడు మనం శామ్యూల్ని కాపాడకపోతే ఊర్లో కుర్రోళ్లు మనమాట ఇనరు సార్." సెంటిమెంటు మీద కొట్టాడు ఇమానెయెల్.

"ఔనా. ఇంతకీ ఎవురా పెద్దమనుషులు?"

"రంగయ్యగారి కోటయ్య, కోటేశు పంతులూ సార్!"

"ఏది, ఆ కోటేశు పంతులు నంబర్ చెప్పు." ఫోన్ చేశాడు ఎమ్మెల్యే. ఇమానుయెల్ ముందు బిల్డప్ కోసం లౌడ్ స్పీకర్ కూడా పెట్టాడు.

"కోటేశ్వర్రావుగారూ నమస్తే నేను ఎమ్మెల్యేని."

"సర్, సార్, సార్ నమస్తే. బాగున్నారా సార్!"

"నేను బాగానే ఉన్నా కానీ...."

"సార్ సార్ చెప్పండి సార్"

"ఏంలేదూ, మీ ఊరి గుడి దొంగతనం కేసుని ఆ శామ్యూల్ గాడి మీదకి తొయ్యట మెందుకు? ఇంకెవరూ దొరకలేదా మీకు?" అధికారం ధ్వనించే స్వరంతో గంభీరంగా అడిగాడు ఎమ్మెల్యే.

ఏంచెప్పాలో తోచలేదు కోటేశు పంతులికి. హలో.... హలో.... హలో.... అంటూ ఫోన్ కట్ చేశాడు. కోటయ్యకి జరిగింది చెప్పేలోపే మళ్ళీ రింగౌతుంది ఫోన్.

"ఇంతలోనే ఈడికెవురు చెప్పారు కోటయ్యా! ఆ ఎస్సైగాడికేమన్నా మెంటలా?" ఫోన్ రింగౌతూనే ఉంది.

"ఎటుగూడీ వాడికి తెలియనే తెలిసిందిగానీ ఆ ఫోనిటియ్యి, నేను మాట్లాడతాను".... ఫోన్ ఎత్తాడు కోటయ్య.

"హలో ఎమ్మెల్యేగారూ... నమస్తే!"

"హలో ఎవరూ?"

"నేనండీ కోటయ్యాని.... గుర్తు పట్టలేదా?"

"చెప్పండి కోటయ్యగారూ? మా వాళ్ళని గుడి మెట్లు కూడా ఎక్కనియ్యరుగా మీరు? గుడి దొంగతనం కేసు ఆ సుబ్బడి కొడుకు మీద నెడుతున్నారంట!.... ఇంకెవురూ దొరకలేదా మీకు?" ఇమానుయెల్ వైపు చూస్తూ మాట్లాడుతున్నాడు MLA.... చూడు నా ప్రతాపం అన్నట్టు.

"ఏందీ MLAగారూ! కొత్తగా మాట్లాడుతున్నారు? రాత్రి సుబ్బడి పక్కింటి లోనే దొంగతనం జరిగింది. అందరికీ వాడి మీదనే అనుమానం. ఇట్టాటప్పుడన్నా దొరికినోడి మీదకి నెట్టేసి ఆ కేసు క్లోజ్ చేపించుకోకపోతే ఎదో ఒకరోజు నిజంగా మనమే దొరికిపోతాం. అయినా ఆ గుడి సొమ్ములో మీ వాటా మీకు ఇచ్చేశాంగా? ఇంకా ఏందండీ ఈ కొత్త కొత్త మాటలు?"

MLAకి చెమటలు పట్టేశాయి. హలో ...హలో ....హలో అంటూ ఫోన్ పెట్టేశాడు.

కోటయ్య మాటలు ఏమీ విననట్టే "ఏమంటున్నారు సార్" అన్నాడు ఇమానుయెల్.

"వాళ్ళేదో అంటున్నారుగానీ మీరెళ్ళండి.. నేను వాళ్లతో తర్వాత మాట్లాడతాను."

"సరే సార్! ఉంటాం.... కొంచెం శామ్యుల్‌గాడి సంగతి గుర్తుపెట్టుకోండి సార్!"

"సరే సరే వెళ్ళండి. నాకు వేరే మీటింగ్ ఉంది...."

"ఉంటాం సార్.... నమస్తే సార్"

★ ★ ★ ★ ★

వీళ్ళిద్దరూ వెళ్ళిపోయి ఉంటారనుకుని MLA వెంటనే కోటయ్యకి ఫోన్ చేశాడు.

"ఏం కోటయ్యా.... బుద్దుందా నీకు.."

వాళ్ళిద్దరికీ ఇంకా అక్కడ ఉండబుద్ది గాలేదు. MLA మాటలు వినాలనే ఆసక్తి కూడా లేదు. కొద్దిదూరం పోయాక ఇమానుయెల్ అడిగాడు పవన్‌ని.... "అన్నా చూశావా ఈ నా కొడుకుల మోసం...."

"నీ తృప్తి కోసం ఇక్కడిదాకా వచ్చా గానీ.... నాకు వీళ్ళ సంగతి ముందే తెలుసు ఇమానుయెల్.... వీళ్ళంతా దొంగలు.... వీళ్ళే నిజమైన దొంగలు. ఒకడిది గ్రామ స్థాయి, ఒకడిది మండలం, ఇంకొకడిది జిల్లా, ఆ పైనున్నోళ్ళది రాష్ట్ర, దేశ స్థాయి.... కానీ అందరూ చేసేదొకటే.... దొంగతనం. ఈ దొంగతనాలలో కూడా చట్టబద్ధంగా చేసేవి, చట్ట విరుద్ధంగా చేసేవి రెండు రకాలుంటాయి. ఆ రెండూ నేర్పుగా చేసేవాడే నాయకుడౌతాడు. అగ్గిపెట్టె నుంచి ఆల్కహాల్ దాక ఏది కొన్నా జనం ప్రభుత్వానికి పన్నులు కడుతున్నారు. మరోపక్క సహజ వనరుల్ని అమ్ముకుని ఖజానా నింపుకుంటున్నారు. వీటన్నిటినీ దిగమింగింది చాలక, ఇలా ఊరుమ్మడి సొమ్మును కూడా వదలకుండా స్వాహా చేస్తున్నారు. వీళ్ళ దొంగతనాలకి రాజకీయం, పదవులు ముసుగులు మాత్రమే. కూటికి, గుడ్డకి దొంగతనాలు చేసేవాళ్ళని పట్టుకుని న్యాయాన్ని బ్రతికిస్తున్నట్టు ఫోజులు పెడతారు గానీ, ఆ ఫోజు వెనక తాము స్వయంగా చేస్తున్న దొంగతనాలను దాచిపెట్టడమే వాళ్ళ వ్యూహం. దొంగలు దొంగలు ఊళ్లు పంచుకోవడమంటే ఇదే తమ్ముడూ..."

"అన్నా నువ్విన్నాళ్ళు ఇదే చెబుతున్నా అర్థమయ్యేది కాదు కానీ.... ఈరోజు మాత్రం స్పష్టంగా అర్థమౌతుంది."

"ఇదే మన పాలకుల విజయ రహస్యం ఇమానుయెల్! ఈ గుట్టు జనమందరికీ స్పష్టంగా అర్థమైతే చాలు.... ఇక ఈ దొంగల ఆట కట్టు."

"ఔనన్నా! మన కష్టమంతా వీళ్ళిలా దోచుకు తింటుంటే, జనం మాత్రం అర్థాకలితో అలమటిస్తున్నారు. ఇవన్నీ జనానికి అర్థమయ్యేలా మనమే చెప్పాలన్నా! ఇంతకీ శామ్యూల్ సంగతి?"

"ఇది మనకి తెలిసిందని వాళ్ళకు అర్థమయ్యింది కాబట్టి, ప్రస్తుతానికి వాడి జోలికి రారులే! వస్తే అప్పుడు చూద్దాం". ●

వ్యాసం

# చరిత్ర చోదక శక్తులు

– డా॥ ఆర్కే

**చరిత్ర** అంటే "గతానికి, వర్తమానానికి జరిగే సంభాషణ" అంటాడు ప్రముఖ బ్రిటిష్ చరిత్రకారుడు ఇ.హెచ్.కార్. విషయం గతానిది. వ్యాఖ్యానం వర్తమానానిది. రెండిటిని సమన్వయం చేయటం అంత సులువైన పని కాదు. సత్యం కాలానుగుణంగా మారుతుంది. వాస్తవం అందరికీ ఒకేలా వుండదు. చరిత్రలో ఏది సత్యం? ఏది అసత్యం? ఏది వాస్తవం? ఏది అవాస్తవం? జవాబు వివాదాస్పదంగానే వుంటుంది. ఈనాటి తన దృక్పథం, ఆలోచనలు, భావజాలంకనుగుణంగానే చరిత్రకారుడు గత కాలంలోని సంఘటనలను బేరీజు వేస్తాడు. అందువల్ల చరిత్ర అంటే వాస్తవాల పుట్ట అనే మైమరుపులోకి జారిపోగూడదు.

చరిత్రను పరిశీలించటమంటే ఎందుకు అనే ప్రశ్నను వేసుకొని కారణాలను కనుగొనటమే అని కూడా అంటాడు కార్. చారిత్రక సంఘటనలలో యాదృచ్ఛికాలు ఉండవని కాదు. అవి పరిగణనలోకి తీసుకోదగినంత ప్రాధాన్యత కలిగినవి కావు. దేనికైనా ఒక కారణమే వుండదు. అనేకం వుంటాయి. ఒకటి ప్రధానమైనదిగా, మిగిలినవి ద్వితీయంగా వుంటాయి. వాటిని వరుస క్రమంలో వివరించటమే చరిత్రకారుడి కార్య క్షేత్రం.

చరిత్ర అంటే వ్యక్తి జీవితం కాదు. అది సామాజిక జీవితం. సామాజిక జీవితంలో వ్యక్తుల మధ్య ఉండేది ఉత్తుత్తి సంబంధాలుగాదు. అవి సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సంబంధాలు. సమాజానికతీతంగా వ్యక్తి లేడు. వుండబోడు. ఆయా సమాజాలలోని జీవన విధానమే ఆ వ్యక్తిని తయారు చేస్తుంది. రాతి పనిముట్లు రాతి యుగం మనిషిని, యంత్రాలు ఆధునికయుగం కార్మికుడిని తయారు చేశాయి. గ్రీకు మాసిడోనియా సామ్రాజ్యం ఓ అలేగ్జాండర్‌కు, రోమ్ బానిసల తిరుగుబాట్లు ఓ స్పార్టకస్‌కు, భారత ఉపఖండంలో వ్యవసాయ సమాజ ఆవిర్భావం ఓ బుద్ధుడుకు జన్మనిచ్చాయి. అందువల్ల చరిత్రను పరిశీలించటమంటే అయా కాలాలలోని సామాజిక జీవితాన్ని అధ్యయనం చేయటమే.

సామాజిక జీవితంలో వుండేది ఆర్థిక లావాదేవీలే గాదు, చైతన్యం కూడా. చైతన్యం అంటే తాత్విక, రాజకీయ, సాంస్కృతిక భావజాలం. భావాలు ఆకాశంనుండి ఊడిపడవు. వాటంతటవే మెదడులో ఊరి ఉబకవు. ప్రకృతి, పరిసరాలు, చుట్టూ సమాజం నుండే భావాల్ని గ్రహిస్తారు. అవి ఏ రూపంలో వున్నా ఆయా కాలాలలోని సామాజిక, ఆర్థిక స్థితిగతులకు దూరంగా వుండవు. చివరికి న్యాయం కూడ ఆర్థికవ్యవస్థకి లోబడి వుంటుంది. ఆదిమ గణతంత్ర సమాజంలో సొంత ఆస్తి అనే భావం తెలియదు. వర్గ సమాజంలో అదే ప్రాథమిక హక్కు. ఈనాడు బానిసత్వం నేరం. బానిసమాజంలో అరిస్టాటిల్ లాంటి మహా మేధావి కూడా బానిసను పౌరుడిగా గుర్తించలేదు. ఆయా కాలాలలోని సామాజిక, ఆర్థిక పరిస్థితుల నుండే క్రీ.పూ. 5–6 శతాబ్దాలలో బుద్ధిజం, 19వ శతాబ్దంలో మార్క్సిజం పుట్టాయి. బుద్ధుడి కాలంలో దేవుడు మార్క్స్‌ను పుట్టించవచ్చునేమోగాని, కాపిటల్ గ్రంథాన్ని రాయించలేడు. ఆర్థిక అవసరాలు అక్షరాల్ని, గణితాన్ని, వర్గసంఘర్షణ రాజ్యాంగ యంత్రాన్ని, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం 'కాపిటల్'ను సృష్టించాయి. అందువల్ల "మానవుల స్థితి (Being)ని నిర్ణయించేది వారి చైతన్యం (consciousness) గాదు. పైగా వారి సామాజికస్థితే వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది." (మార్క్స్)

దేశ చరిత్రలన్నిటిలోనూ సాధారాణాంశాలుంటాయి. ప్రత్యేకాంశాలుంటాయి. చరిత్ర అధ్యయనంలో ఈ రెండిటిని పరిగణనలోకి తీసుకోవాలి.

– మాతృస్వామ్య గణవ్యవస్థలో సొంత ఆస్తి, వర్గాలు, ప్రభుత్వాలు లేవు.

– ఆర్థిక వనరులు ఏ వర్గం చేతిలో వుంటాయో, ఆ వర్గం రాజ్యాధికారం చెలాయిస్తుంది.

– వర్గసమాజంలో వర్గపోరాటం వుంటుంది.

– వర్గ పునాదికనుగుణంగా భావజాలం రూపుదిద్దు కుంటుంది.

ఇవి సాధారణాంశాలు.


భిన్నత్వంలో ఏకత్వం వున్నట్టే, ఏకత్వంలో భిన్నత్వం వుంటుంది. బానిసత్వం అంతటా వున్నా గ్రీసు, రోమ్‌లో వున్నది క్లాసికల్ బానిసత్వం. అక్కడున్న 'కొద్దిమంది ప్రభుస్వామ్య పాలన' రాజరిక పాలనకు భిన్నమైనది.. పారిశ్రామిక విప్లవాలతో యూరప్ పెట్టుబడిదారీ విధానంలోకి అడుగిడింది. కాని ప్రాచ్యదేశాలు రాజరికంలోనే మగ్గి ఫ్యూడల్ విధానం కొనసాగించటంతో వలసలుగా మారాయి. సామ్రాజ్యవాద దోపిడీకి గురయ్యాయి. వర్గపోరాటాలు కూడా మూస పోసినట్లు ఒకే రీతిగా వుండవు. వలసలకు వ్యతిరేకంగా జాతీయ విముక్తి ఉద్యమాలు, ఫ్యూడల్, పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజాతంత్ర, సోషలిస్ట్‌విప్లవాలు జరుగుతాయి. కొన్ని మత, కుల రూపాలలో కూడా కొనసాగుతాయి.

భారత ఉపఖండంలో కులవ్యవస్థ ఒక ప్రత్యేకత. పాలకులు శూద్ర, అంటరాని కులాల శ్రమను దోచివేయటమేగాదు, మానసికంగా బానిసలను చేశారు. కర్మ సిద్ధాంతాన్ని ప్రజల నరనరాన ఎక్కించారు. అహింసను కూడ వర్గ ప్రయోజనాలకు ఉపయోగించటం ఈ దేశంలోనే చూడగలం. సామాజిక మార్పులను సాంస్కృతికంగా సాధించటంలో భారత్ తనదైన మార్గంలో పయనించింది. అందువల్ల చరిత్రలోని సాధారణాంశాలను, ప్రత్యేకాంశాలను అధ్యయనం చేయటం ద్వారానే పీడిత ప్రజలు తమ వ్యూహం – ఎత్తుగడలను రూపొందించుకొనగలరు. దోపిడీ పాలనపై విజయాల్ని సాదించగలరు.

ప్రాచీన ప్రపంచ చరిత్ర చదివిన ప్రతి పాఠకుడికి ఇపుడు సహజంగా ఎదురయ్యే చివరి ప్రశ్న –

చరిత్ర నావకు చుక్కాని ఏది?

రాతకు పూర్వం రాతి యుగంలో వేల సంవత్సరాల చరిత్ర దాగి వుంది. ఆ చరిత్రను నడిపింది హీరోలు గాదు, రాతి మనుష్యులే. ఊరు పేరు లేని మామూలు మనుష్యులే. నాగరిక యుగంలో ఎన్నో సామ్రాజ్యాలు వెలిశాయి. ఎందరో రాజులు, చక్రవర్తులు ఏలారు. ఎడతెగని యుద్ధాలు జరిగాయి. మతాలు, తాత్విక సిద్ధాంతాలు పుట్టాయి. పాలకుల ప్రయోజనాల కనుకూలంగా వున్నవి అందలమెక్కాయి. లేనివి ఎదురీదాయి. చివరికి మిగిలింది? రాజులు పోయినా, రాజ్యాలు కూలినా చరిత్ర ప్రయాణం ఆగలేదు. కదిలే కాలంతోపాటు మానవ సమాజం ముందుకు సాగుతూనే వుంది. ఇదెలా సాధ్యమైంది? చరిత్రను నడిపే శక్తులేవి?




ఉత్పత్తి మానవ సమాజ మనుగడకి మూలం. ఉత్పత్తిని సృష్టించాలంటే ఉత్పత్తి శక్తులు కావాలి. సృష్టించిన ఉత్పత్తిని పంపిణీ చేయాలి. ఇలాంటి ఉత్పత్తి సంబంధాలలో అత్యంత కీలకాంశం ఆర్థికవనరులుపై యాజమాన్యం. అదే సామాజిక, ఆర్థిక పునాదిని నిర్ణయిస్తుంది. ఈ పునాదిపైనే భావజాలం రూపుదిద్దుకుంటుంది. అది సైద్ధాంతికశక్తిగా మారి పునాదిని బలపరచటమో, బీటలు దీయటమో చేస్తుంది. దీనిని యాంత్రికంగా అర్థం చేసుకోగూడదు. ఇవి పరస్పరం ప్రభావితమవుతాయి – ఈ సామాజిక సూత్రమే చరిత్ర అధ్యయనానికి మార్గదర్శినిగా ఉంటుందని మనం చదువుకున్నాం.

జీవితావసరాల సంపాదనలోనే మనుష్యులు తమ చరిత్రను తాము నిర్మించుకుంటారు. అలా అని అది వారి ఇష్టానుసారం సాగదు. మన మనస్సుకు వెలుపల వుండే భౌతికపరిస్థితులపై ఆధారపడి మాత్రమే వారు తమ చరిత్రను నిర్మించుకోగలరు. సామాజిక పరిణామంలోని ప్రతి మెట్టులోనూ మనం ఈ సూత్రాన్ని దర్శించగలం.

ఆదిమ సమాజంలో రాతి పనిముట్లు అందరివీ. దొరికేది అరకొర ఆహారమే. మిగిలేది అర్ధాకలే. అందువల్లే అది ఆదిమ సమసమాజమైంది. రాతి గొడ్డలి, కర్ర నాగలితో నదీతీరాలలోని మెత్తని భూములలో పెద్దఎత్తున సాగుచేశారు. పశుపెంపకంతో ఆహారోత్పత్తిలో మిగులు ఏర్పడింది. మిగులు చేతి వృత్తులకు ఊతమిచ్చింది. మారకం వచ్చింది. లోహాలు, చక్రం, కుమ్మరి సారె, మగ్గం, తెరచాప పడవ ఉత్పత్తిరంగంలోకి అడుగు పెట్టాయి. రాతి పనిముట్లు కాలంలో తెగ మొత్తం సామూహికంగా పనిచేయాలి. లోహం పనిముట్లు వచ్చిన తర్వాత అనేకమంది చేసే పనిని కొందరే చేయగల్గుతున్నారు. తెగ ఆస్తులను ఉమ్మడి కుటుంబాలకు బదిలీ చేయాల్సిన అవసరం ఏర్పడింది. సొంత ఆస్తి వచ్చింది. తెగ నాయకత్వం తమ పలుకుబడి, అధికారాన్ని కుటుంబ వ్యక్తిగత ఆస్తుల కోసం వాడుకుంది.

ఉత్పత్తిశక్తులు అభివృద్ధి చెందటంతో ఒకవైపు ఆర్థిక వనరులు, మరొకవైపు మానవవనరుల అవసరము పెరిగింది. బానిసత్వం వచ్చింది. ఒక మనిషి శ్రమను మరో మనిషి దోచుకునే వర్గవ్యవస్థ చరిత్రలో తొలిసారి చోటుచేసుకుంది. వనరులపై యాజమాన్యం కొందరిదే. అనేకమంది వాటికి దూరం చేయబడినారు. దోపిడీకి గురయ్యేవారు ఎప్పుడైనా తిరుగబడతారు. వారిని అణచి ఉంచాలి. రాజ్యాంగయంత్రం పుట్టింది. అదే సరిపోదు. వారిని మత్తులో ఉంచాలి. మతమనే మత్తును వెదజల్లారు.

మెసపొటేమియా, ఈజిప్టు, చైనా, ఇండియాలోని హరప్పా నదీతీరాలలో కంచుయుగం రాజ్యాలు ఏర్పడ్డాయి. రైతులు, బానిసలు, చేతిపనివారి నుండి పాలకులు అదనపు శ్రమ విలువను పిండుకున్నారు. నాటి ప్రాచీన రాజ్యవ్యవస్థలో దోపిడీ సంపద పెట్టుబడిగా కేంద్రీకృతమైంది. నగర నిర్మాణం జరిగింది. దోపిడీ పునాదిపై కంచు నాగరికత వెల్లివిరిసింది. శారీరక శ్రమ నుండి మానసిక శ్రమ వేరైంది. కారుచౌకగా లభించే బానిస చాకిరీ దొరకటంతో విజ్ఞానశాస్త్ర ఫలితాల్ని పాలకవర్గాలు కాలదన్నుకున్నాయి. రాజరికం మూఢ విశ్వాసాలతో జిగ్గురాట్లను, పిరమిడ్లను నిర్మించి ప్రజల కష్టార్జితాన్ని దుబారా చేసింది.

క్రీ.పూ. 1200–1000 కాలానికి ఉత్పత్తి రంగంలోకి ఇనుము ప్రవేశించింది. కంచు అరుదైన లోహం. కొందరికే పరిమితం. ఇనుము అందరికి లభ్యమవుతుంది. ఇనుప కర్రునాగలితో గట్టి భూములను దున్నవచ్చు. ఇనుము పనిముట్లతో అడవులను నరికి, చదునుచేసి, సాగుచేశారు. వ్యవసాయం విశాల ప్రాంతాలకు విస్తరించింది. అనాగరిక ఇండోయూరోపియన్ తెగల దాడులకు కంచు రాజ్యాలు కూలిపోయాయి. మధ్యప్రాచ్యంలోని అస్సిరియ, బాబిలోనియా, పర్షియాలు, ఇండియా, చైనాలు, యూరప్‌లోని గ్రీసు, రోమ్‌లు

ఇనుపయుగంలోకి ప్రవేశించాయి. ఒక్కొక్క దేశం ఒక్కొక్క రీతిలో సామ్రాజ్యంగా ఎదిగాయి.

సామ్రాజ్య స్థాపనకు, విస్తరణకు వనరులు కావాలి. మార్కెట్ వుండాలి. ఇందుకు యుద్ధం, దురాక్రమణ తప్పనిసరి. పర్షియా గ్రీసుపై దండెత్తింది. అలెగ్జాండర్ ప్రపంచ జైత్రయాత్ర చేశాడు. గ్రీసు మధ్యధరా తీరమంతా వలసలతో రాజ్యమేలింది. రోమ్ ఆర్థికవ్యవస్థ అంతా విదేశీ దోపిడీలపైనే ఆధారపడింది. విశాల సామ్రాజ్యం స్థాపించింది. చైనాలో రాజరిక వంశాల క్రమం కొనసాగింది. భారతదేశంలో వర్ణ వ్యవస్థ రాజ్యంలో భాగమై సామ్రాజ్య స్థాయికి ఎదిగింది.

ప్రాచీన సామ్రాజ్యాలు తమ ఆధిపత్యాన్ని నిలుపు కోవటానికి ఏ అవకాశాన్ని జారవిడుచుకోలేదు. సామ్రాజ్యం వర్ధిల్లాలంటే వ్యాపారం, మార్కెట్టు కావాలి. తెగలు, విభిన్న ఆచారాలు, సంప్రదాయాలు కట్టుబాట్ల అడ్డుగోడలు పోయి ఒకే ప్రాంతం ఒకే రాజ్యాంగం, ఒకే పన్నుల విధానం వుండాలి. అప్పుడు ఒక విశాల మార్కెట్టుకి అవకాశాలు తలుపులు తెరుచుకుంటాయి. బహు దేవుళ్ళు, బహు మతాలకు బదులు ఒకే మతాన్ని ఒకే దేవుడ్ని ప్రోత్సహించారు. పర్షియాలో జొరాష్ట్రియన్, చైనాలో కన్‌ఫ్యూషియన్ మతాన్ని, భారతదేశంలో బౌద్ధ, జైన మతాలను, గ్రీసు, రోమ్‌లలో క్రైస్తవ మతాలను రాజ మతాలను చేశారు.

మతాన్నే గాదు, సైన్సు, టెక్నాలజీ, తత్వశాస్త్రాన్ని కూడా రాజ్యం తన స్వప్రయోజనాలకోసం ఉపయోగించుకుంది. అక్షరంతో తన భావజాలాన్నీ, చట్టాల్ని జనంలోకి తీసుకెళ్ళింది. తొలి రాజ్యాంగాన్ని హమ్మురాబి రాజ్యమంతటా శిలాశాసనాలుగా చెక్కించాడు. 'మనుస్మృతి'లో వర్ణ వివక్షత, కౌటిల్యుడి 'అర్థశాస్త్రం' గ్రంథస్తమై పాలకులకు మార్గదర్శక మయ్యాయి. వైద్యశాస్త్రాన్ని మమ్మీల కోసం, ఇంజనీరింగును, రేఖాగణితాన్ని, జిగ్గురాట్స్, పిరమిడ్లు, గ్రేట్‌వాల్ నిర్మాణానికి వాడుకుంది. వేదాలు, ఉపనిషత్తులు, శంకరుడి మిధ్యావాదంను భారతీయ జీవనంలో భాగం చేశారు. కన్‌ఫూజియసనిజం, లీగలిజాలను చైనా రాజరికం పెంచి పోషించింది. ప్లేటో తాత్త్విక ఆలోచన గ్రీకు, రోమన్లనేగాదు, యూరప్‌ను ప్రభావితం చేసింది.

ఎక్కడ దోపిడీ, అణచివేత వుంటుందో అక్కడ ప్రతిఘటన వుంటుంది. పాలకులు, పాలితుల మధ్య వర్గ పోరాటాలు జరిగాయి. పాలకవర్గాల మధ్య అంతర్గత సంఘర్షణలు చెలరేగాయి. మెసపొటేమియా, ఈజిప్టులలో రైతులు, బానిసలు తిరుగుబాట్లు చేశారు. భారతదేశంలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, వర్ణాల మధ్య ఆధిపత్యం కోసం కొట్లాటలు సాగాయి. శూద్రులు కనీస జీవన హక్కులకోసం పోరాడారు. చార్వాకులు, బౌద్ధులు, ఇతర శ్రమణ సంఘాలు వైదిక మతాన్ని ఎదిరించాయి. చైనాలో రైతాంగ తిరుగుబాట్లు ఆ దేశ చరిత్రలో ఒక అధ్యాయమే అవుతుంది. యెర్ర కనుబొమ్మల, పచ్చ తలపాగాల రైతాంగ పోరాటాలు ముఖ్యమైనవి.

ప్రాచ్య ప్రపంచంలో ప్రధాన ఆర్థిక వనరు వ్యవసాయం. రాజరికం, రైతాంగం ప్రధాన వర్గాలు. గ్రీసు, రోమ్‌లలో భూభాగం చిన్నది. సముద్రం, వ్యాపారమే వారి జీవితం. బయటి ప్రపంచం, ముఖ్యంగా అప్పటికే అభివృద్ధి చెందిన ఈజిప్టు, మెసపొటేమియాలతో ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలు వున్నాయి. అ ప్రభావంతో గ్రీసు, రోమ్‌లలో భౌతికవాదం, గతితార్కికం బాగా అభివృద్ధి చెందింది. అదీగాక వ్యవసాయక సమాజం కంటె పారిశ్రామిక సమాజం అన్ని రంగాలలో ఒక అడుగు ముందే వుంటుంది.

ప్రాచీన చరిత్రలో వర్గపోరాటాలకు గ్రీసు, రోమ్ పెట్టింది పేరు. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల కోసం అక్కడి ప్రజలు అలుపెరుగని పోరాటాలు చేశారు. మైసీనియా రాజరికం కూలిపోయిన తర్వాత గ్రీసులో రాజు అనే పదం వినపడలేదు. వారసత్వం లేదు. స్పార్టా మిలిటరీ రాజ్య దురాక్రమణకు వ్యతిరేకంగా మెస్సీనియ రైతులు దశాబ్దాల తరబడి యుద్ధాలు చేశారు. కొద్దిమంది ప్రభుస్వామ్య పాలనలోని కులీనుల అప్పుల దోపిడీకి గురై ఋణ బానిసలైన రైతులు తిరుగుబాట్లు చేశారు. సొలోన్ సంస్కరణలతో ఋణ విముక్తి పొందారు. ఏథెన్స్ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవటానికి అటు పర్షియా సామ్రాజ్యంతో, ఇటు స్పార్టా నాయకత్వంలోని గ్రీకు ద్రోహులతో కడకంటా ప్రాణాలొడ్డి పోరాడారు. తాత్త్విక రంగంలో కూడా గ్రీసు భౌతికవాదం భావవాదంతో సంఘర్షించింది. రాజ్యవ్యవస్థలో మతం, దేవుడు ప్రమేయం లేకుండా చేసింది.

ఇట్రుసియ రాజరిక పాలన చవిచూచిన రోమన్ తెగలు రిపబ్లిక్ బాటను పట్టాయి. పేరుకే ప్రజాస్వామ్యం. పాట్రీషియన్లకి, ప్లెబియన్లకి మధ్య పౌరహక్కుల కోసం రాజకీయ పోరాటాలు ఉధృతంగా, అప్పుడప్పుడు సాయుధంగా కూడా కొనసాగాయి. చివరికి ధనవంతులైన ప్లెబియనులు, పాట్రీషియన్లు రాజీపడ్డారు. రోమన్ సమాజం పేద, ధనిక వర్గాలుగా విడిపోయింది. రోమ్ ఇటలీనే గాదు, మధ్యధరా తీరమంతటిని ఆక్రమించింది. రోమ్ చరిత్ర అంటే యుద్ధాలే. ప్రాచీన ప్రపంచంలో అత్యంత పెద్ద సామ్రాజ్యంగా ఉద్భవించింది. ఒకవైపు ఆర్థిక వనరులను, మరోవైపు బానిస శ్రమను దోచుకుంది. బానిస దోపిడీయే రోమ్ సామ్రాజ్యానికి పునాది.

రోమన్ బానిస యజమానుల దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా బానిసలు వీరోచిత పోరాటాలు చేశారు. సిసిలీలో సుదీర్ఘకాలం తిరుగుబాట్లు జరిగాయి. స్పార్టకస్ విప్లవ వీరుడుగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాడు. వారు చిందించిన రక్తం రోమ్ సామ్రాజ్య పునాదులను కదిలించివేసింది. బగాడే తిరుగుబాట్లు వెనుకబడిన యురోపియన్ తెగల విముక్తికి దారిచూపాయి. రిపబ్లిక్ పేరుతో ఆనాడు జరిగిన ఎన్నికలు, అవలంబించిన అవినీతి పద్ధతులు, వెదజల్లిన డబ్బు, విలాసాల వలలు ఈనాడు మనకు సుపరిచితమే. వాటికి బీజం అప్పుడే పడింది. అదే పెట్టుబడిదారీ ప్రజాస్వామ్య వృక్షమైంది. ఆర్థిక, రాజకీయ సంక్షోభాలు తీవ్రమైనపుడు వర్గపోరాటంలో భాగంగానే గ్రాచస్ బ్రదర్స్ లాంటివాళ్ళు సామాజిక సంస్కరణలకు ప్రయత్నిస్తారు. కరుడుకట్టిన కన్సర్వేటివ్‌లు వాటిని కూడా సహించలేరు. పాము తన

పిల్లలను తాను చంపుకున్నట్టు, దోపిడీ పాలకవర్గాలు అవసరమైనపుడు తాము రాసుకున్న రాజ్యాంగాన్ని తామే కాలరాస్తారు. రోమ్ అసెంబ్లీలో జరిగిన దారుణ హత్యాకాండే ఇందుకు సాక్ష్యం. చివరికి పాలకముఠాలు అంతర్యుద్ధాలతో తమ పతనాన్ని తామే కొనితెచ్చుకున్నాయి. అనాగరిక జర్మన్ తెగల దాడులతో మహా సామ్రాజ్యం కుప్పకూలింది.

ప్రాచీన సామ్రాజ్యవ్యవస్థలో రాజు పృథ్వీపతి. భూస్వామ్య ప్రభువర్గం చేతిలో వందల వేల ఎకరాల భూమి ఎస్టేట్ల రూపంలో కేంద్రీకరింపబడింది. అంత భూమిని సాగు చేయటం ఒక కుటుంబానికి సాధ్యం కానిపని. బానిసల రైతుల తిరుగుబాట్లు, పాలకవర్గాల కుమ్ములాటలతో పాత సామ్రాజ్యాలు బలహీనమవ్వటమో, పతనం కావటమో జరిగిపోయింది. బానిసల సంఖ్య తగ్గిపోయింది. వారి ఖరీదు పెరిగిపోయింది. సాంకేతిక జ్ఞానం లేని బానిసల వల్ల ఖర్చుకు తగ్గ అదనపు ఆదాయం రాదు. సాగుభూమిని విభజించి రైతులకు కౌలుకిచ్చారు. పంటలో కొంత వాటా వుంటుంది. ఉత్పాదనపై ఆసక్తి వుంటుంది. ఇనుప పనిముట్లను మెరుగుపరచారు. గాలిమర, నీటిమర ఉపయోగంలోకి వచ్చాయి. భూయజమానుల సంపదలు పెరిగాయి. రైతు కుటుంబాలకు మిగిలేది కనీస ఆదాయమే.

బానిస సమాజంస్థానే వచ్చిన ఫ్యూడల్ సమాజంలో రాజరిక, భూస్వామ్య ప్రభువులు, రైతులు, చేతిపనివారుగా సామాజిక వర్గాలు రూపొందాయి. పాలకవర్గాలు దొంతరలుగా ఏర్పడి కొత్త రూపంలో దోపిడీ, అణచివేత కొనసాగించారు. ప్రధానంగా కౌలు రూపంలో దోపిడీ సాగేది. రైతులు అర్ధ బానిసలుగా భూస్వామ్య యాజమాన్యానికి బందీలుగా ఉండేవారు. కొత్త మతాలతో కొత్త దేవుళ్ళు పుట్టారు. రాజు దైవాంశ సంభూతుడన్నారు. ఇక్కడి కష్టాలు, కన్నీళ్ళకి పరలోకంలో సుఖాన్ని ఆశ చూపారు. మతం పేరుతో రాజ్యాల మధ్య యుద్ధాలు జరిగాయి. సామాన్యులు సమిధలయ్యారు. ఫ్యూడల్ దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా అనేక రైతాంగ తిరుగుబాట్లు జరిగాయి.

15-16 శతాబ్దాలనాటికి యూరప్‌లో కొత్త సైన్సు ఆవిష్కరణలు జరిగాయి. ఆవిరి యంత్రం, ప్రింటింగ్ ప్రెస్, మైనింగ్, లోహపరిశ్రమలు వచ్చాయి. పారిశ్రామికరంగం ప్రధాన ఆదాయ వనరుగా అభివృద్ధి చెందింది. బ్యాంకింగ్, దళారీ మార్కెట్‌తో వ్యాపారవర్గం బలంగా తయారైంది. సముద్రయానం కొత్త దేశాలను కనుగొనటం, ముడిసరుకు, మార్కెట్ల కోసం వలసలతో ప్రపంచ రూపురేఖలు మారిపోయాయి. ఉత్పత్తిశక్తుల అభివృద్ధికి ఫ్యూడల్‌వ్యవస్థ అడ్డుగా వుంది. ఫ్యూడల్ రాజరికాన్ని కూలద్రోసి పెట్టుబడిదారీ యుగం ప్రారంభమైంది. పెట్టుబడిదారులు, కార్మికులనే నూతన వర్గాలు బయలుదేరాయి.

పెట్టుబడిదారీ సమాజంలో ఆర్థికవనరులకు, యంత్రాలకు యజమాని పెట్టుబడిదారులు. శ్రమ కార్మికులది. ఎన్ని ఎక్కువ గంటలు చేస్తే, యజమానికి అంత అదనపు లాభం. ఈ సమాజంలో ప్రతిదీ సరుకే. అమ్మకానికే. డబ్బే అన్నిటికి మూలం. వ్యాపార కంపెనీల మధ్య మార్కెట్లో తీవ్ర పోటీ నెలకొంటుంది. పెద్దవి చిన్నవాటిని మింగేస్తాయి. ప్రజల కొనుగోలుశక్తి తరిగిపోతూ వుంటుంది. మార్కెట్లో సరుకు కుప్పలు తెప్పలుగా పడి వుంటుంది. ఆర్థిక సంక్షోభాలు తలెత్తుతాయి. సంక్షోభాల నుండి బయటపడటానికి యుద్ధాలు చేస్తారు. మొదటి, రెండవ, ప్రపంచ యుద్ధాలు అలాగే జరిగాయి. ఈ రకమైన సామ్రాజ్య వాదానికి, పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా జాతీయ విముక్తి ఉద్యమాలు, కార్మిక పోరాటాలు వెల్లువెత్తినాయి. రష్యా, చైనా, తూర్పు యూరప్, వియత్నాం, క్యూబాలలో విప్లవాలు విజయవంతమైనాయి.

సోషలిజంలో ఆర్థిక వనరులు, ఉత్పత్తి సాధనాలు కార్మికవర్గం యాజమాన్యంలో వుంటాయి. చిన్న జాతీయ పెట్టుబడిదారులు, రైతులు, మేధావులు పెద్ద సంఖ్యలో బలంగానే వుంటారు. వారిని సోషలిస్ట్ వ్యవస్థలోనికి తీసుకురావటం, వారిలో గూడుకట్టుకున్న పాత సంస్కృతి, భావాలు, ఆచార, సంప్రదాయాలను పారద్రోలటం సాధారణ సమస్య కాదు. శ్రామికులకు ప్రజాస్వామ్యం వుంటుంది. పూర్వపు భూస్వామ్య, పెట్టుబడిదారీశక్తులకు నియంతృత్వం వుంటుంది. సామ్రాజ్యవాదం సహాయంతో సోషలిస్ట్ వ్యవస్థను కూలద్రోయటానికి కుట్రలు పన్నే పాత దోపిడీ శక్తుల వల్ల నిరంతర ప్రమాదం పొంచి వుంటుంది. ఈ అవరోధాలను అధిగమించాలంటే వెనుకబడిన ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేయాలి. శారీరక, మానసిక శ్రమకు వ్యత్యాసం తగ్గించాలి. అదే సమయంలో వర్గపోరాటానికి పదును పెట్టాలి. కార్మికవర్గ సాంస్కృతిక భావజాలాన్ని వెదజల్లాలి. ఇది సుదీర్ఘమైన పోరాటం. ఆదిమ సమ సమాజం మినహా ఇంతకు ముందున్న వ్యవస్థలలో శ్రమించి ఉత్పత్తిని సృష్టించింది పాలితులైన బానిసలు, రైతులు, కార్మికులు. శ్రమ ఫలితాల్ని అనుభవించింది దోపిడీ వర్గాలు. సోషలిస్టు సమాజం ఇందుకు పూర్తి భిన్నమైనది. ఈ దశలో ఉండే సూత్రం "శక్తికొద్దీ పని, శ్రమకు తగిన ఫలితం." మనిషిలోని సృజనాత్మకశక్తిని ఆర్థిక సంక్షోభాలులేని ప్రణాళికాబద్ధ సామాజిక పురోగతికి వినియోగించటమే సోషలిజం లక్ష్యం.

చరిత్ర అవిచ్ఛిన్నంగా, సాఫీగా, సాదాసీదాగా సాగే ప్రయాణం కాదు. ఎత్తుపల్లాలు, పక్కదారులు, వెనక్కి మళ్ళటాలు వుంటాయి. కాని మానవ సమాజాభివృద్ధిని ఎవరు అడ్డుకోలేరు.

రాతి సమాజం రాయి గానే మిగిలిపోలేదు. కొత్త పనిముట్లతో ఆహార సేకరణ దశ నుండి ఆహారోత్పత్తి దశకి ఎదిగింది. ఉత్పత్తిశక్తుల అభివృద్ధికి ఊతమిచ్చిన బానిస సమాజం నిస్సందేహంగా ఆదిమ సమాజం కంటె ఉన్నతమైనదే. బానిస శ్రమే లేకుంటే కంచు నాగరికత, గ్రీసు, రోమ్ నగరాల జిలుగు వెలుగులు లేవు. ఆనాటి అభివృద్ధికి అది అనివార్యం. ఫ్యూడల్ సమాజంలో దోపిడీ కౌలు రూపంగా మారింది. బానిసత్వం నుండి మనిషి కొంతవరకు బయటపడ్డాడు. ఉత్పత్తి శక్తులు మరింత మెరుగయ్యాయి. ఇనుము సమాజంలోని అన్ని వర్గాలకు చేరింది. రైతాంగం ఇనుము పనిముట్లకే గాదు, ఆయుధాలకీ దగ్గరయింది. భూస్వామ్యవ్యవస్థ గర్భంలోనే పెట్టుబడిదారీవర్గం, కార్మికవర్గం పుట్టింది. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం నినాదాలతో గద్దె నెక్కింది. వేతన బానిసత్వం ప్రవేశించింది. మార్కెట్టు మనిషి జీవితాన్ని కంట్రోలు చేసింది.

పార్లమెంటరీ పేరుతో ధన ప్రజాస్వామ్యం నెలకొంది. ఉత్పత్తి శక్తులు బ్రహ్మాండంగా అభివృద్ధి చెందటానికి అవకాశాలున్న పెట్టుబడిదారీవ్యవస్థ పూర్వపు వ్యవస్థలకన్నా మిన్న. పెట్టుబడిదారీవ్యవస్థలోని ఆర్థిక సంక్షోభాలు, అంతర్గత వైరుధ్యాలు, కార్మికవర్గ పోరాటాలు దాని పతనాన్ని శాసిస్తాయి. పాత దోపిడీ వ్యవస్థలకు గుణాత్మకంగా భిన్నమైన సోషలిస్ట్ సమాజ దిశగా సమాజాన్ని నడిపిస్తాయి.

ఉత్పత్తి శక్తులు నిరంతరం అభివృద్ధి చెందుతూనే వుంటాయి. తదనుగుణంగా ఉత్పత్తి సంబంధాలు అంటే ఆర్థిక పునాది రూపుదిద్దు కోవాలి. లేనిచో కొత్త ఉత్పత్తిశక్తుల అభివృద్ధికి పాత ఉత్పత్తి సంబంధాలు అవరోధమవుతాయి. రెండిటి మధ్య తీవ్ర వైరుధ్యం ఏర్పడుతుంది. ఈ ఘర్షణ భావజాలంలో ప్రతిబింబిస్తుంది. వర్గ పోరాటంగా ప్రజ్వరిల్లుతుంది. అదేచరిత్ర నావకు చుక్కాని. సామాజిక దిశ, దశను నిర్దేశించే చోదక శక్తి.

రాతి పనిముట్లతో మొదలైన అనాగరిక, ఆటవిక తెగల జీవన పోరాటం ఇనుపకర్రు నాగలితో వ్యవసాయం, యంత్రాలతో పెట్టుబడిదారీ ఉత్పత్తి దశకి మళ్ళింది. అదనపు ఉత్పత్తితో శ్రమదోపిడీ, వర్గవ్యవస్థకి పునాది పడింది. బానిసలు - బానిస యజమానులుగా, భూస్వాములు - రైతులుగా, పెట్టుబడిదారులు - కార్మికులుగా సమాజం చీలిపోయింది. వర్గ పోరాటాలకు వేదిక అయింది. వర్గాల మధ్య సంఘర్షణ బానిస, ఫ్యూడల్, పెట్టుబడిదారీ, సోషలిస్ట్ వ్యవస్థల నిర్మాణాన్ని అనివార్యం చేశాయి.

ఎప్పుడైనా, ఎక్కడైనా ఉత్పత్తిని సృష్టించింది బానిసలు, రైతులు, కార్మికులే. వారు చిందించిన చెమట, రక్తం నుండే నాగరికత వర్ధిల్లింది. విజ్ఞానం వికసించింది. సామ్రాజ్యం విస్తరించింది. తమ దోపిడీ పాలన శాశ్వతమని పాలకులు నమ్మారు. నమ్మకం వమ్ము అయింది. దోపిడీ ఏ రూపంలో వున్నా అది శాశ్వతంకాదని పీడితవర్గాల పోరాటాలు నిరూపించాయి. మహామహా రోమ్ సామ్రాజ్యం నుండి హిట్లర్ ఫాసిజం వరకు కూకటి వ్రేళ్ళతో కూలిపోయాయి. పాత సంస్కృతి, పాత భావజాలం నశించుతాయి. కొత్త సంస్కృతి, కొత్త భావజాలం ఉదయించుతాయి. మానవ సమాజం సరళరేఖ నుండి అత్యున్నత శిఖరాల వైపుగా పురోగమిస్తూనే వుంటుంది. ఈ మహోన్నత చారిత్రక ప్రస్థానానికి ప్రజలే కర్త, కర్మ, క్రియలు. అంతిమంగా ప్రజలే చరిత్ర నిర్మాతలు. ప్రజలే చరిత్ర విజేతలు. ప్రజలు అంటే ఉత్పత్తిని సృష్టించే శ్రమ జీవులు.

- డా॥ ఆర్కే రచన :

**"ప్రాచీన ప్రపంచ చరిత్ర సామాజిక విశ్లేషణ"** నుండి



# కృతజ్ఞతలు

**30-01-2023న మరణించిన**

**కొత్తపల్లి (తుమ్మల) సుధాబాల జ్ఞాపకంగా**

**వారి కుటుంబసభ్యులు కొత్తపల్లి రవిబాబు, సృజన్‌కుమార్, శిశిర్‌కుమార్**

**ఈ సంచిక ముద్రణకై ఆర్థిక సహాయం అందించారు.**

**వారికి కృతజ్ఞతలు.**

- సం॥

# కవి, న్యాయవాది నమిలికొండ బాలకిషన్‌రావు మృతి



**'ప్రసారిక'** సంపాదకుడు, రచయిత నమిలికొండ బాలకిషన్‌రావు 30-3-2023న వరంగల్లులో తన 73వ యేట మరణించారు. ఆయన 6-9-1950న కరీంనగర్ జిల్లా పూడూరులో జన్మించారు.

జగిత్యాలలో డిగ్రీ పూర్తిచేసి, ఎం.ఏ.ఎల్.ఎల్.బి. చదివి హనుమకొండలో న్యాయవాదిగా స్థిరపడ్డారు. 1982లో వర్ధమాన సాహిత్యకారులను ప్రోత్సహిస్తూ 'ప్రసారిక' అనే సాహిత్య మాసపత్రికను తన సంపాదకత్వంలో ప్రారంభించారు. డా॥ టి. రంగస్వామి, గౌరవ సంపాదకులుగా మూడు దశాబ్దాల పాటు ఇది వెలువడింది.

చైతన్యసాహితీ సాంస్కృతిక సమాఖ్య, సాహితీ సమితి, పోతన విజ్ఞానపీఠం, కాళోజీ ఫౌండేషన్, రాజరాజ నరేంద్రాంధ్ర భాషానిలయం మొదలగు సాహిత్య సంస్థలలో నమిలికొండ క్రియాశీలంగా కృషిచేశారు.

ఆయన రచనలలో ముఖ్యమైనవి 1. యువస్వరం; 2. అక్షరచిత్రం; 3. శాంతి-సమత; 4. అక్షరాల్లో అనంతం; 5. అక్షర ప్రతిబింబం మొదలైనవి.

## దేశ విభజన వస్తువుగా సాహిత్యం-8

### మనోహర్ మల్గోంకర్ రాసిన నవల

# 'వంపు తిరిగిన గంగ'

### (A Bend in the Ganges)

– కొత్తపల్లి రవిబాబు

**వివిధ** ప్రక్రియలలో 20కి పైగా నవలలు, కథాసంపుటాలు, యాత్రారచన, నాటకం, వ్యాసాలు రాసిన మల్గోంకర్ దేశ విభజన కథావస్తువుగా వున్న ఈ నవలను 1964లో ప్రచురించారు. ఆయన బెల్గాం జిల్లాలో 12 జులై 1913లో జన్మించారు. తన 97వ యేట 14 జూన్ 2010లో మరణించారు.

ఆయన బెల్గాం, ధన్వాడ్‌లో చదివి, ముంబాయి విశ్వవిద్యాలయంలో డిగ్రీ పూర్తిచేశారు. 29వ యేట సైన్యంలో లెఫ్టినెంట్ కల్నల్ హోదాలో మరాఠా లైట్ కాల్బలంలో 1942లో చేరి తన 39వ యేట 1952లో రిటైరయ్యారు. ఆయన ముత్తాత (తల్లివైపు) గ్వాలియర్ ఆస్థానానికి గవర్నరుగా వుండేవారు. సైన్యం నుండి వచ్చేసిన తర్వాత ఆయన 1935–37 మధ్య వృత్తి వేటగానిగానూ, 1937లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగానూ, 1952లో గని యజమానిగానూ, టీ తోటల మేనేజర్‌గానూ ఇలా వివిధ శాఖలలో పనిచేశారు. 1957లో రాజకీయాలలో ప్రవేశించి శాసనసభ ఎన్నికలలో పోటీచేసి ఓడిపోయారు.

జర్నలిస్టుగా ఆయన మరాఠా చరిత్రపై అనేక పరిశోధనా వ్యాసాలు రాశారు. సమకాలికులైన ముల్క్‌రాజ్ ఆనంద్, ఆర్కే నారాయణ్, రాజారావుల్లాగా సమకాలీన భారతీయ వాస్తవిక చిత్రణ జోలికి ఆయన పోలేదు. ఆయనకు తెలిసిన కులీన సమాజం, రాజరిక సంస్కృతి, సైనిక అధికారుల జీవితం, టీ ఎస్టేట్ల కబుర్లు, పెద్ద వ్యాపారస్తుల, రాజకీయ నాయకుల జీవితాలు మాత్రమే ఆయన రచనల్లో ఎక్కువగా కనబడతాయి. 'వంపు తిరిగిన గంగ' నవలలో దేశ విభజన వల్ల కులీన సమాజం ఎలా ప్రభావితమైందో చిత్రించారు.

ఈ నవల కథాకాలం 1930ల నుండి ఆగస్టు 1947 వరకు. దీనిలో ప్రధాన పాత్రలైన జ్ఞాన్ తల్వార్ మొదట్లో గాంధీతో ప్రభావితుడైన అహింసావాది. దేవీదయాళ్, షఫీ ఉస్మాన్‌లు ఉగ్రవాదులు. జ్ఞాన్ గాంధీ ఉపన్యాసం విని అక్కడికక్కడే విదేశీ వస్త్ర దహనం కార్యక్రమంలో భాగంగా ఖరీదైన తన కోటును తగలబెట్టేస్తాడు. స్వాతంత్ర్య సమరంలో పాల్గొనే యువకుల శారీరక దారుఢ్యం పెంచడానికి హనుమాన్ క్లబ్ స్థాపించి, దాని ద్వారా ఉగ్రవాద చర్యలు చేసి బ్రిటీషువారిని ఓడించాలనే కార్యక్రమంలో దేవీదయాళ్, షఫీ, ఉస్మాన్‌లు నిమగ్నమై వుంటారు. హింసాయుత కార్యక్రమాల ద్వారానే స్వతంత్రం సాధించాలనే తత్త్వం వీరిది. దేశంలోని మతవిభేదాలు దేశ సమైక్యతను భగ్నం చేస్తాయని విశ్వసించి, అన్నిరకాల మతాలకు సంబంధించిన యువకులతో కూడిన ఒక బృందాన్ని రూపొందిస్తారు.

ఆవిధంగా హనుమాన్ క్లబ్ కార్యక్రమాలు బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా షఫీ నాయకత్వాన సాగుతుంటాయి. షఫీ తన తండ్రి జలియన్‌వాలాబాగ్ కాల్పులలో తన ముందే మరణించడం ప్రత్యక్షంగా చూశాడు. బ్రిటీషువారి క్రూరత్వం కళ్ళారా చూసిన ఆయన వారికి వ్యతిరేకంగా దేశపు సంకెళ్ళను తెంచేయాలని స్నేహితుడు దేవీదయాళ్‌తో కలసి రహస్య కార్యక్రమాలు చేస్తుంటాడు. గ్రీటింగ్ కార్డుల సందేశాలలో రహస్య సంకేత పదాలతో సమాచారం చేరవేస్తుంటారు. రైల్వేట్రాక్‌పై ఫిష్‌ప్లేట్లు తొలగించడం, టెలిఫోన్ తీగలు కత్తిరించడం, వైమానిక దళాల విమానాలను పేల్చివేయడం మొదలగు కార్యక్రమాలు ఈ గ్రూపు చూస్తూ వుంటుంది. షఫీ గురించి సమాచారం ఇచ్చినవారికి బ్రిటిష్ ప్రభుత్వం వేయి రూపాయలు బహుమతి కూడా ప్రకటించింది. షఫీ సిక్కు ఆహార్యంతో మారువేషంలో సంచరిస్తూ వుంటాడు.

ఒక పిక్నిక్‌లో దేవీదయాళ్, అతని చెల్లెలు సుందరి, జ్ఞాన్‌తల్వార్, సిక్కు వేషంలో వున్న షఫీ, బసులు కలుస్తారు. వీరందరూ వివిధ రకాల సామాజిక నేపథ్యం గలవారు. అందరిలో దేశమంటే ప్రేమ తొణికిసలాడుతూ వుంటుంది. ఆ పిక్నిక్‌లో అహింసా సిద్ధాంతంపై చర్చిస్తారు. అది అమాయకంగా వుండే గొర్రెల సిద్ధాంతం, పిరికివాళ్ళ సిద్ధాంతం, దేశానికి అది పెద్ద ప్రమాదకరం అని షఫీ వాదిస్తాడు. జ్ఞాన్ ఈ వాదనను అంగీకరించడు. అహింసా సిద్ధాంతాన్ని పాటించడానికి చాలా బలం కావాలనీ, అది ఉత్తమోత్తమ సిద్ధాంతమని, ఎవరెంత రెచ్చగొట్టినా ఎవరూ ఎవరినీ చంపకూడదని జ్ఞాన్ వాదిస్తాడు. ఆ తర్వాత జరిగిన ఘటనలలో జ్ఞాన్ తమ్ముడు హరిని భూమి సమస్యపై విష్ణుదత్ అనేవాడు హత్య చేస్తాడు. ఈ వాస్తవజనిత సంఘటన వల్ల జ్ఞాన్ అహింసా సిద్ధాంతానికి తిలోదకాలిస్తాడు. విష్ణుదత్తును చంపేసి ప్రతీకారం తీర్చుకుంటాడు.

ఒక బ్రిటీష్ సైనికుడు తన తల్లిపై లైంగికదాడి చేయడాన్ని ప్రత్యక్షంగా చూసిన దేవీదయాళ్ బ్రిటీష్‌వారిపై ప్రతీకార జ్వాలతో రగిలిపోతుంటాడు. క్లబ్‌లోని ఇతర సభ్యులతోపాటు టెర్రరిస్టు చర్యలలో పాల్గొంటాడు. వారికి ఆయుధాలు సమకూర్చుతూ వుంటాడు. ఒక విమానాన్ని పేల్చివేసే కార్యక్రమాన్ని షఫీ, అతనికి (దేవికి) కేటాయిస్తాడు.

విష్ణుదత్‌ను చంపినందుకు జ్ఞాన్, విమానాన్ని పేల్చివేసినందుకు దేవీదయాళ్ శిక్షలు పడి అండమాన్‌లో కలుసుకుంటారు. ఇండియాకు తిరిగి రావడానికి జ్ఞాన్ ఇష్టపడడు. ప్రస్తుతం భారతీయుల సమస్యను

ఇప్పుడు జ్ఞాన్ తన సమస్యగా తలచడు. దేవీదయాళ్ ఏదో ఒక పద్ధతిలో ఇండియాకు వెళ్ళి బ్రిటీషువారి దుష్టపాలనకు వ్యతిరేకంగా పోరాడాలను కుంటాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో అండమాన్‌ను జపాన్ ఆక్రమించుకున్న సందర్భంలో తాను జపాన్ పక్షం వున్నట్లు నటిస్తూ వారి సహాయంతో ఇండియాకు దేవీదయాళ్ తిరిగి వస్తాడు.

జ్ఞాన్ అండమాన్‌లోని జైలు సూపరింటెండ్ పాట్రిక్ ముల్లిగాన్‌కు సహకరిస్తూ దేవీదయాళ్‌పై నిఘా పెడతాడు. అతనిపై చాడీలు చెప్పి కొరడా దెబ్బల శిక్ష విధించేలా చేస్తాడు. నక్క జిత్తులతో తప్పించుకుని ఇండియా చేరతాడు. దేవీదయాళ్ స్నేహితుడనని చెప్పి దురియాబాద్‌లో టేక్‌చంద్ నిర్మాణ సంస్థలో చేరతాడు. ఇండియాకు తిరిగి వచ్చిన దేవీదయాళ్ దురియాబాద్‌లోని పాత టెర్రరిస్టు గ్రూపు సంస్థాపక సభ్యులను యుద్ధానంతరం కలుస్తాడు. బసు ద్వారా బ్రిటీషు ప్రభుత్వం హిందూ ముస్లిముల మధ్య వైషమ్యాన్ని పెంచడంలో విజయం సాధించినదని తెలుసుకుంటాడు.

మతం పేరుతో అనేక అకృత్యాలు, హత్యలు, దయావిహీనమైన సంఘటనలు, హింసాయుత కృత్యాలు చోటుచేసుకుంటాయి. బసు అందమైన భార్య దీపాలి మొఖం మీద సల్ఫ్యూరిక్ యాసిడ్ నింపిన బల్బు పగులగొట్టి ఒక ముస్లిం ఆమె ముఖాన్ని వికృతపరుస్తాడు. బసు ప్రతీకారేచ్ఛతో అహింసా సిద్ధాంతాన్ని అవతలబెట్టి – ముస్లిములపై దాడులను ప్రోత్సహిస్తాడు.

హిందువులకంటే ముస్లిములు ఉన్నతులు అని షఫీ నమ్మాడు. బ్రిటీషువారు వెళ్ళిపోతే ముస్లిములు రెండవ తరగతి పౌరులైపోతారని భయపడతాడు. హిందువులు తమపై పెత్తనం చేస్తారని అనుకుంటాడు. రావల్పిండి, ముల్తాన్, భగల్పూర్‌ల నుండి హిందువులను వారివారి ఇళ్ళనుండి తరిమివేశారు. షఫీ పైన ప్రతీకారం తీర్చుకోడానికి దేవీదయాళ్, బసువంత్ లాహోరంతా వెదికి అతన్ని ఒక వ్యభిచార గృహంలో చూస్తారు. షఫీ అది గమనించి వీరి గురించి పోలీసులకు సమాచారం అందిస్తాడు. బసువంత్ తెలివిగా తప్పించుకుంటాడు. షఫీ వుంచుకున్న ముంతాజ్‌ను బలవంతంగా ఎత్తుకుపోవడం ద్వారా దేవీదయాళ్, షఫీపై ప్రతీకారం తీర్చుకుంటాడు. ఆ తర్వాత ముంతాజ్‌ను తన భార్యగా షఫీ అంగీకరిస్తాడు. అల్లర్లలో దేవీదయాళ్‌ని ఒక మతోన్మాద మూక చంపేస్తుంది.

మత కొట్లాటలు ప్రారంభమైన తర్వాత జ్ఞాన్ దురియాబాద్ వెళ్ళి, సుందరిని లైంగికదాడి నుంచి, హత్య నుంచి రక్షించి పాకిస్తాన్ నుండి బయటపడటానికి సహాయపడతాడు. ఆమెను ఇండియాలోని ఒక సురక్షిత స్థలానికి పంపిస్తాడు. దురియాబాద్‌లో జ్ఞాన్, షఫీల మధ్య జరిగిన కొట్లాటలో షఫీ టేక్‌చంద్ భార్యను చంపేస్తాడు. జ్ఞాన్ షఫీని చంపేసి ఇండియాకు పారిపోతాడు.

ఈ నవల ఆఖరి అధ్యాయం శీర్షిక – **"వారు వదలి వెళ్ళిపోతున్న నేల"**.

పాత జ్ఞాపకాలు ముసురుకుంటున్న స్థితిలో పాకిస్తాన్ నుండి వలస పోతున్న జన ప్రవాహపు రద్దీలో ప్రజలు సుందరి, జ్ఞాన్‌లను ముందుకు తోసేస్తుంటారు. వృద్ధుడైన టేక్‌చంద్ వెనుకబడిపోవడాన్ని ఎవరూ పట్టించుకోని సన్నివేశం పాఠకుల హృదయాన్ని చీల్చివేస్తుంది. 'ఎవడో ముసలాడికోసం అందర్నీ ఆపలేం' (We can't hold up the convoy for somebody's old man) అంటూ ఆ ప్రవాహం ముందుకు నెట్టుకుంటూ వెళ్తుంది.

నవలలో దేవీదయాళ్ పాత్ర ద్వారా రచయిత ఒక ప్రశ్న లేవనెత్తాడు. ఆ ప్రశ్న : "ఎవరు గెలిచారు? గాంధీయా? బ్రిటీషువాడా?"

**(వచ్చే సంచికలో : యశపాల్ నవల "ఝూటాసచ్")**

# ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థులకు శిక్ష

**బి.బి.సి.** ఇటీవల విడుదల చేసిన రెండు భాగాల డాక్యుమెంటరీ "ఇండియా! ది మోదీ క్వశ్చన్" డాక్యుమెంటరీని విశ్వవిద్యాలయ ఆవరణలో ప్రదర్శించడానికి సహకరించినందుకు డాక్టరేట్ విద్యార్థి లోకేశ్ ఛుగ్ కూ, న్యాయశాస్త్ర విద్యార్థి రవీందర్‌కూ, ఏడాదిపాటు పరీక్షలకు హాజరు కానీయకుండా విశ్వవిద్యాలయ అధికారులు శిక్ష విధించారు. మరో ఆరుగురు విద్యార్థులకు తీవ్రమైన హెచ్చరికలు జారీచేశారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులను పిలిచి మీ పిల్లలను అదుపులో వుంచుకోమని హెచ్చరించారు.

ఈ డాక్యుమెంటరీ నిషేధింపబడినది గనుక ఈ చర్య తీసుకున్నట్లు విశ్వవిద్యాలయ అధికారుల వాదన. కాని ఈ డాక్యుమెంటరీని తమ సామాజిక మాధ్యమాల (మీడియా) నుండి ట్విట్టర్, యూట్యూబ్‌లతో సహా తొలగించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందేగాని నిషేధించినట్లు ప్రకటించలేదు.

అసలు బి.బి.సి.నే నిషేధించమంటూ హిందూసేన నాయకుడు విష్ణుగుప్తా సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం వేస్తే కోర్టు దానిని కొట్టివేసింది.

ఈ డాక్యుమెంటరీని ఢిల్లీ జవహర్లాల్ విశ్వవిద్యాలయ ఆవరణలో విద్యార్థి సంఘం ఆధ్వర్యాన ప్రదర్శనకు ఏర్పాటుచేసుకున్నా, ఆ సమయానికి విద్యుచ్ఛక్తి సరఫరా నిలిపివేశారు. కాని ప్రత్యామ్నాయ ఏర్పాటు ద్వారా ప్రదర్శించారు. ఈ సంఘటనపై విద్యార్థిసంఘం తన ప్రకటనలో 'ప్రసార మాధ్యమాల్ని, సాహిత్యాన్ని, సంగీతాన్ని, లలితకళలనూ నిషేధించడం సమాజం పతనంవైపు ప్రయాణించడాన్ని సూచిస్తుంది' అని వ్యాఖ్యానించింది.

జనవరి 26న ఈ డాక్యుమెంటరీ రెండు భాగాలను పూనేలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (FTII)లో ప్రదర్శించారు.

స్పందన

# "నాటు నాటు" పాటకు ఆస్కార్ అవార్డు లభించటం

# తెలుగు పాట, తెలుగు భాష, తెలుగు జాతి గెలుపు అవుతుందా?

– హరిబాబు

**95వ** ఆస్కార్ ఉత్సవంలో, తెలుగు చలనచిత్రమైన ఆర్.ఆర్.ఆర్. (రౌద్రం, రణం, రుధిరం – Rise, Roar, Revolt)లో చిత్రీకరించిన 'నాటు, నాటు' అనే పాటను 'ఒరిజినల్' పాటగా, ఆ పాటకు బాణీకట్టిన కీరవాణికి, ఆ పాటను రాసిన చంద్రబోస్‌లకు అవార్డు యిచ్చారు.

కమర్షియల్ సినిమారంగంలో, యీవిధంగా అవార్డును పొందటమన్నది, ఆ రంగంలో సినిమాలను తీస్తున్న రాజమౌళి తదితరులకు నిజంగా గొప్ప విషయమే. ఈ అవార్డును పొందిన కీర్తితో వీరు మరిన్ని కమర్షియల్ చిత్రాలను తీసి, ప్రపంచమంతటా ప్రదర్శించి, కోట్లకు కోట్ల రూపాయల లాభాలు గడించుకోవటం సాధ్యం చేసుకోవచ్చునన్నది కూడా నిజమే!

ఈ పాట గెలవటం వలన తెలుగుపాట, తెలుగుభాష, తెలుగుజాతి గెలిచిందని ప్రతీ తెలుగువాడు నేనే గెలిచాను అని అన్పిస్తోందని చెప్పడం ఆత్మవంచన మాత్రమే. అదేవిధంగా యీ పాట నెగ్గినందుకు పారవశ్యం చెందటమన్నది 'అస్తిత్వాల, ఆత్మాభిమానాల ఉత్సవంగా అభివర్ణించటాన్ని మించిన మోసం తప్ప మరొకటి కాదు.

ఈ పాటకు ఒరిజినల్‌సాంగ్ ఆస్కార్ అవార్డు రావటానికి, కారణం (న్యాయనిర్ణేతలు పరిగణనలోకి తీసుకొన్న అంశం), ఆ పాటలో వ్రాసిన "పొలంగట్టు, పోట్లగిత్తలు, కిర్రుచెప్పులు, మర్రిచెట్టు, కర్రసాములు, కుర్రగుంపులు, ఎర్రజొన్నలు, విచ్చుకత్తులు, మిరపతొక్కులు లాంటి" తెలుగు పదాల వల్లనా లేక యిందుకు కారణం మరేదైనా వుందా అన్న విషయాన్ని విశ్లేషించకుండా పైవిధంగా, తెలుగులో ప్రాచుర్యంలో వున్న ప్రధాన వార్తాపత్రికలు సంపాదకీయ వ్యాఖ్యలు, ప్రశంసలు చేయటం అన్నది తమ పత్రికలకు వున్న పేరు ద్వారా, తెలుగు పాఠకులకు అబద్ధపు అభిప్రాయాలను, "తమపట్ల – తమ భాష, తమ జాతి ఉన్నతిపట్ల" అబద్ధపు ప్రతిష్టను (false prestige) కల్పించటమే అవుతుంది?

ఈ సందర్భంగా యిటువంటి ప్రశ్నలు లేవనెత్తడం, అంటే చంద్రబోస్ పాటల రచనాప్రతిభనూ, కీరవాణి సంగీత దర్శకత్వ ప్రతిభనూ వారివారి రంగంలో విశిష్టమైన నైపుణ్య ప్రతిభలను శంకించడం కాదు. కానీ నిర్దిష్టంగా పరిశీలిస్తే, యీ అవార్డుకు కారణం అటు ఆ పాట బాణీ కాదు, అందులోని కవిత్వం కాదు. నిజానికి ఆ పాటలోని అనేక తెలుగు పదాలు, యిప్పుడు మన తెలుగు సమాజాలలో (ఆంధ్ర, తెలంగాణా) విరివిగా వాడుకలో లేవు. ఇటీవలి తరాల తెలుగు యువతకు వాటి అర్థాలు కానీ, సందర్భాలు కానీ తెలియవు. సినిమాలో (ఆర్.ఆర్.ఆర్.లో) కేవలం, ఆ పాట ఒక గోండు వీరుడు బ్రిటీషువారి డ్యాన్సును సవాలు చేసిన డ్యాన్సుగా చూపెట్టినంత మాత్రాన, అది గోండుల (లేదా యితర గిరిజనుల) ఆత్మాభిమానాన్ని, బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేకతకు ప్రాతినిధ్యం వహించేదిగానూ లేదా గోండుల "బ్రతుకు పోరాటం" ఎంతమాత్రం కాబోదు.

ఒక కమర్షియల్ చిత్రానికి కావల్సిన వివిధ హంగులను, మసాలాలు దట్టించినది ఆ పాట సందర్భం. ఈ పాటను, ఉన్నత సాంకేతికస్థాయి విజువల్ ఎఫెక్ట్‌తో చిత్రించటం అన్నదే యీ పాట ఆస్కార్ బహుమతి పొందటానికి సంపాదించిన అర్హత.

పాశ్చాత్య నృత్యంతో పోటీపడగల నృత్యాన్ని 'నాటు' (Native) ప్రజలు కూడా చేస్తారు అని చెప్పటం ఆ పాటను చిత్రీకరించటంలోని ఉద్దేశ్యం. అటువంటి అసంబద్ధ సెంటిమెంట్సుతో ప్రేక్షకులను ఆకట్టుకోవటం కోసం ఆ చిత్ర నిర్మాతలు – ఉత్పత్తిదారులు వాడిన ట్రిక్కు అది. నిజానికి నాటి గోండులకు గానీ, భారతీయులకు గానీ బ్రిటీష్ పాలకులతో వున్నది డ్యాన్సులు, తదితర ఆచారాలకు చెందిన వైరం కానేకాదు. వలస పాలన, వలస దోపిడీ, దేశ దురాక్రమణ లాంటి కీలకమైన మౌలిక అంశాలకు చెందిన వైరుధ్యం అది.

పైపెచ్చు ఆ నాటు పాటను బ్రిటిష్‌వారి డ్రెస్సు (ఆహార్యం)లో నృత్యం చేయటాన్ని చూపించటం ఏవిధమైన "నాటు" అవుతుంది? ఆ పాట విన్నంతసేపూ, దృశ్యాన్ని చూసినంతసేపూ ఆ పాట పదాలను కానీ, వాటి అర్థాలను కానీ విని అర్థం చేసుకొనే అవకాశమే లేకుండా పోయినపుడు ఆ పాటలోని తేటతెలుగు పదాల ప్రాశస్త్యం గురించీ, తెలుగుజాతి 'ఘనత' గురించి చంకలు గుద్దుకోవటానికి మించిన ఆత్మవంచన ఏముంటుంది?

నిజానికి యీ పాటకు ఆస్కార్ అవార్డు రావటం వల్ల రాజమౌళి, కీరవాణి, చంద్రబోస్‌లకు కమర్షియల్ సినిమారంగంలో వ్యక్తిగతమైన పేరు వచ్చి, మేలు కలిగిందే తప్ప, తెలుగు లేక భారతీయ సినిమా రంగానికి ప్రత్యేకంగా ఒరిగిందేమీ లేదు.

వాస్తవానికి యీ ఆస్కార్ అకాడమీ అవార్డులు అన్నవి అమెరికా దేశపు, సినిమారంగపు వాణిజ్య ప్రయోజనాలను పెంపొందించటం కోసం, హాలీవుడ్ జరిపే సంబరాలుగా వున్నాయి. ప్రపంచంలో అతిపెద్దదైన సినిమా మార్కెట్టు పరిశ్రమ వున్న భారతదేశపు మార్కెట్లను, తన వైపుకు ఆకర్షించుకొని తన వలలో వేసుకోవటమన్నది, అమెరికా ప్రదర్శనా వ్యాపారరంగపు ప్రస్తుత ప్రధాన ప్రాధాన్యతగా వుంది.

అటువంటి వ్యూహానికి అనుగుణంగానే, యీ అవార్డును 'నాటు నాటు' పాటకు యిచ్చారు తప్ప, ఆ పాటలోని తేట తెలుగు ప్రాశస్త్యానికి గానీ, ఆ పాట బాణీ విశిష్టతకు కానీ యిచ్చినది కాదు.

పైపెచ్చు సినిమాలోని ప్రతిభకన్నా దాని ప్రచారంపై భారీగా ఖర్చుపెట్టి, నిరంతరం ప్రచారం చేసి ముందుగానే న్యాయనిర్ణేతలను తమకు అనుకూలంగా మార్చుకోగలిగిన చాకచక్యం వున్నవారికే యీ అవార్డులు దక్కుతాయన్నది రహస్యం ఏమీ కాదు. లాస్‌ఏంజెల్స్‌లో భారీ ఎత్తున డబ్బు ఖర్చుపెట్టి, ప్రచారం చేయగల్గినవారికే యీ అవార్డులు దక్కే అవకాశం ఎక్కువ.

అటువంటి ప్రచారాలు భారీ మొత్తాల్ని వెచ్చించి ఖర్చుపెట్టలేని భారతదేశం నుండి నామినేట్ చేయబడిన గుజరాతీ భాషకు చెందిన 'చెల్లో షో', పాకిస్తాన్ నుండి నామినేట్ చేయబడిన 'జాయ్‌లాండ్' సినిమాలు అవార్డులు పొందలేకపోయాయి. వాస్తవానికి "చెల్లోషో" న్యూయార్క్‌లో జరిగే ట్రిబెకా ఉత్సవం నుండీ, "జాయ్‌లాండ్" ఫ్రాన్స్‌లో జరిగే కాన్సు వుత్సవం ద్వారా నామినేట్ చేయబడి, అప్పటికే పేరుగాంచిన చిత్రాలుగా వున్నాయి.

ఈ సంవత్సరం, యీ ఆస్కార్ అవార్డులను గురించిన ప్రచారం, వాటిని ప్రకటించటానికి చాలాకాలం ముందునుండే, విపరీతంగా మున్నెన్నడూ లేనివిధంగా జరిగింది. ఈ రకంగా హైప్‌ను (మోసపూరిత ప్రచారాన్ని) విరివిగా చేసారు. ఆర్.ఆర్.ఆర్. చిత్రంలోని 'నాటు నాటు' పాట గురించీ అటువంటి ప్రచారమే జరిగింది.

అదేవిధంగా ఎంతో భారీయెత్తున ఖర్చుపెట్టి రాజమౌళి బృందం ఆర్.ఆర్.ఆర్. చిత్ర అమెరికన్ డిస్ట్రిబ్యూటర్ అయిన వేరియన్స్ ఫిలిమ్స్ ద్వారా, న్యాయ నిర్ణేతలను ప్రభావితం చేసే 'ఫర్‌యువర్ కన్సిడరేషన్' (తమరి పరిగణన కోసం)" అనే భారీఎత్తు ప్రచారోద్యమాన్ని నిర్వహించి 14 కేటగిరీల్లో ఆ సినిమాను "ప్రమోట్" చేసింది. (ముందుకు నెట్టింది). ఈ అవార్డును చేజిక్కించుకోవాలన్న పక్కా ప్రణాళికతో వ్యవహరించి యీ అవార్డును గెలుచుకొంది తప్ప, "నాటు నాటు" పాట యొక్క తేటతెలుగు పదాలో, లేదా కీరవాణి బాణీపై ఆధారపడో, ఆ అవార్డు గెలుచుకోలేదు. ఇది రాజమౌళి కమర్షియల్ ఫిలింరంగంలో, చాకచక్యంతో సాధించిన వ్యక్తిగత విషయం – అమెరికన్ కమర్షియల్ సినీ, బిజినెస్ వర్గం, భారతీయ సినీ మార్కెట్లోకి చొచ్చుకుపోయి, భారీగా లాభాలు దండుకోవటానికి సాధించిన విజయం అవుతుందే తప్ప తెలుగు సాహిత్యం, తెలుగుభాష, తెలుగుజాతి విజయం ఎంతమాత్రమూ కాదు, కాబోదు!

నయా ఉదారవాద పెట్టుబడిదారీ ఆర్థిక విధానాల అమలు, పోస్టు మోడర్నిజమ్, సత్యానంతరవాదాల సాహితీ – సాంస్కృతిక అభిప్రాయాలు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నదానిలో భాగంగానే, యీ 'నాటునాటు' పాట విజయాన్ని, ప్రముఖ తెలుగు దినపత్రికలు కీర్తిస్తున్నట్లుగా అర్థంచేసుకోవాలి! అలా కీర్తించటంలో ఆ ప్రముఖ దినపత్రికల వాణిజ్య ప్రయోజనాలు మాత్రమే వున్నాయని కూడా అర్థంచేసుకోవాలి!


# ముప్పై ఏళ్ళక్రితం ప్రజాసాహితి

## సంపుటి : 16 సంచిక : 6 ఏప్రియల్ 1993

**ముప్పై** ఏళ్ళక్రితం 1993 ఏప్రిల్‌నాటి 'ప్రజాసాహితి' రాహుల్ సాంకృత్యాయన్ శతజయంతి సంచికగా వచ్చింది. అట్టపై రాహుల్ సాంకృత్యాయన్ ముఖచిత్రంతో వెనుక అట్టపై గోండు ప్రజలతో మమేకమై వారి జీవితాలను, స్థితిగతులను, స్పందనలను అర్థం చేసుకుని 'కొమరం భీము' వంటి నవలను, ఇతర పలు కథలను రచించి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసి, తన 38వ ఏట గుండెపోటుతో మరణించిన సాహు స్మృతికి సాహు కవితను నివాళిగా ప్రచురించారు. పరిణామ ఘనుడు – రాహుల్జీ అంటూ రాసిన సంపాదకీయంలో సమస్త శాస్త్రాల కృషి, అధ్యయనమూ సత్యాన్వేషణ కొరకే – విశాల ప్రజారాశుల ప్రగతికి తోడ్పడనిదేదైనా నిరర్థకమే – సత్యాన్ని రాబట్టడానికి జరిగిన కృషిలో రాహుల్జీ మైలురాయి వంటివాడని, సామాన్య పాఠకులకు అర్థమయ్యేలాగ శాస్త్ర విషయాలను సాహిత్యంలోకి అన్వయించారని పేర్కొన్నారు. గతాన్ని గురించిన అపోహలను, అగ్రవర్ణ అభిజాత్య భావజాలాన్ని, రాచరిక ఫ్యూడల్ సంస్కృతిని, వర్ణవివక్షను దోపిడీ పీడనలను అడుగడుగునా ఎండగడుతూ వ్యతిరేకించారని పేర్కొన్నారు. ఈ సంచికలో రాహుల్జీ గురించి "మాయావాదం నుంచి మార్క్సిజం దాకా" అనే వ్యాసాన్ని కాకరాలగారూ, "రాహుల్జీని అధ్యయనం చేద్దాం" అనే వ్యాసాన్ని ఛాయరాజ్‌గారు, 'మనందరిలోనూ ఉన్నాడు రాహుల్జీ' అంటూ చలసాని ప్రసాదరావుగారూ, 'రాహుల్ సాంకృత్యాయన్ – సుదూర స్మృతులు' అంటూ డా॥ సంజీవదేవ్‌గారూ వ్యాసాలు రాశారు. 'ఓల్గా నుండి గంగకు : ఒక పరిచయం' అనే వ్యాసాన్ని కాత్యాయనీ విద్మహే, జ్యోతిరాణిగారు రాశారు. రాహుల్ సాంకృత్యాయన్, సాహుల సాహిత్య జీవితాల సారూప్యతను స్మరిస్తూ 'రాహుల్ – సాహు సంస్మరణలో....' అంటూ శశిగారు రాశారు. రాహుల్జీ సృజించిన సాహిత్యం కలిగించిన ప్రేరణతో తమ్మినేని అక్కిరాజుగారు 'ప్రేమలోకం' అనే ఊహాచిత్ర రచన చేశారు. ఏబికె ప్రసాద్‌గారు రచించగా పర్‌స్పెక్టివ్స్ సంస్థ ప్రచురించిన 'పరాధీన భారతం (గ్రంథాన్ని', రాజకీయ స్థిరదృష్టి కొరవడిన పరిశీలన అంటూ ప్రశాంత్‌గారు సమీక్షించారు. 'యిప్పుడు చేయాల్సింది' అంటూ నారాయణస్వామి, 'పరకాయ ప్రవేశం ఇక వద్దు' అంటూ అఫ్సర్, "రాహుల్జీ" అనే చైతన్యప్రకాశ్ రాసిన కవితలను ప్రచురించారు. ఇంకా 'రాహుల్ తాత – మనకో సంపద' అంటూ పిల్లల ప్రపంచం, చైతన్యవాహిని శీర్షికలు ఉన్నాయి.

1/8 డెమ్మీలో 88 పుటలు. వెల : రూ. 8/–

## జాతీయ అక్షరయోధులు



## శంభు మిత్ర

**( 1915 - 1997)**

**13**

# బహురూపి

## బెంగాల్ కరువులో ఇప్టా రంగస్థల చరిత్ర
## సామాజిక చైతన్యం వరవడి మందు మాత్ర
## బెంగాలీ నాటకరంగాన్ని మలుపు తిప్పిన
## 'నవాన్న' నాటక దిగ్దర్శకుడు శంభుమిత్ర

**'చివరి వరకూ నేను సాధారణ మానవునిగా బతికాను. మరణానంతరం నిశ్శబ్దంగా నా జీవన శైలికనుగుణంగా వెళ్లిపోవాలి. పూలదండలు శుష్కప్రసంగాలు వద్దు. అంతిమ యాత్రకు సంబంధించిన ఆచార వ్యవహారాలు వద్దు. దినాలు, శ్రాద్ధాలు వద్దు. అటువంటివాటిని నేనేనాడూ విశ్వసించలేదు' అంటూ ఆదర్శప్రాయమైన తన చివరి కోరికను చెప్పిన శంభుమిత్ర బెంగాల్‌కు చెందిన భారతీయ రంగస్థల, చలనచిత్ర, నాటక రచయిత, నటుడు,దర్శకుడు.**

కలకత్తాలో హైస్కూలు, కాలేజీ విద్యలు సాగించిన శంభుమిత్ర విద్యార్థి దశనుండే బెంగాలీ నాటకాలను ఆసక్తిగా చదివేవారు. పాఠశాలలో జరిగే నాటకాలలో చురుగ్గా పాల్గొనేవారు. స్థానిక థియేటర్‌కు హాజరయ్యేవారు. తరువాత భారత కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంస్థ భారత ప్రజానాట్య మండలి (ఇప్టా)లో జాతీయస్థాయిలో సేవలందించారు. 1943 నుండి 1948 వరకు ఇప్టాలో దర్శకుడిగా, నటుడిగా తన ప్రతిభను ప్రదర్శించారు.

1944లో ఇప్టా కోసం బిజోన్ భట్టాచార్య రాసిన 'నవన్నా' నాటకం తొలి ప్రదర్శన శంభుమిత్ర దర్శకత్వంలో జరిగింది. 'నవన్నా' నాటకం బెంగాలీ నాటకరంగాన్ని మలుపు తిప్పింది. శంభుమిత్రను ఒక అసాధారణ దర్శకునిగా బెంగాల్‌కు పరిచయం చేసింది. 'నవన్నా' నాటకం వృత్తిరంగస్థలం నుంచి రంగస్థల చరిత్రను హైజాక్ చేసినదిగా పలు ప్రశంసలు పొందింది.

టాగూర్ నాటకాలు రంగస్థలానికి పనికిరావన్న అభిప్రాయం తప్పని నిరూపిస్తూ టాగూర్ రచనలైన 'రక్తఖరాబీ, రాజా, విసర్జన, ముక్తధారజు'లను ప్రసిద్ధ నాటకాలుగా మలిచారు.

కె.ఏ.అబ్బాస్ దర్శకుడిగా 'ధర్తీకె లాల్',రాజ్‌కపూర్ చిత్రం 'జాగ్‌తే రహో' బెంగాలీ రూపం 'ఏక్ దిన్ రాత్రే' (దర్శకుడు అమిత్ మొయిత్రాతో కలిసి స్క్రిప్టు), బెంగాలీ చిత్రం 'కాంచనగంగ'కు దర్శకులుగా పనిచేశారు. ఎన్నో బెంగాలీ, హిందీ చిత్రాలలో నటించారు. బెర్టోల్డ్ బ్రెహ్ట్ నాటకం 'ది లైఫ్ ఆఫ్ గెలీలియో'లో ప్రధాన పాత్రగా నటించారు.

1948లో కమ్యూనిస్టుపార్టీ నిషేధంలో ఉన్న కాలంలో 'బహురూపి' అనే నాటక సంస్థను ప్రారంభించి పలునాటకాలు ప్రదర్శించారు.ఆ నాటకాలన్నీ కమ్యూనిస్టుపార్టీ విభేదించే వ్యక్తివాదానికి సంబంధించినవైన కారణంగా ఇప్టా సంస్థకి దూరమయ్యారు.

ఆయన సంగీతం, కవిత్వం, చిత్రకళ, గానం కళారంగాల బహురూపి. 1970లో పద్మభూషణ్,1976లో రామన్‌మెగసేసే అవార్డు అందుకున్నారు. 1986లో రవీంద్రభారతి యూనివర్సిటీ డాక్టరేట్,1992లో విశ్వభారతి యూనివర్సిటీ దేశికోత్తమ బిరుదు ఇచ్చాయి.

తన కళాకౌశలంతో ప్రజారంగస్థలానికి విశిష్ట సేవలందించిన దర్శకులకు మార్గదర్శి యైన శంభుమిత్ర 1915 ఆగస్టు, 22న కలకత్తాలో శరత్‌కుమార్ మిత్ర, సతాదల్‌బాసిని దంపతులకు జన్మించారు. 1997 మే 19న కలకత్తాలోని తన స్వగృహంలో కేన్సర్‌తో కన్నుమూశారు.

**సింగంపల్లి అశోక్‌కుమార్**

దీర్ఘ కవిత

# రంగు వెలిసిన చిత్రం

- శీలా సుభద్రాదేవి

(గత సంచిక తరువాయి....)

సంకల్పితం కావచ్చు
అసంకల్పితమైనా కావచ్చు
ఏ పార్టీ ఎవరి ఓట్లను చీల్చుతుందో
ఏవేవి కూటములు కట్టి
ఉమ్మడి కుంపట్లు రాజేస్తాయో
ఏవేవి సొంతంగా చలికాచుకుంటూ
ప్రభుత్వ వంటల్ని వండి
వార్చాలనుకుంటున్నాయో
ఏ ఆలింగనం మేలు కలిగిస్తుందో
దేన్ని దగ్గరకు తీస్తే
ధృతరాష్ట్ర కౌగిలి అవుతుందో
ప్రతిజండాకీ భయమే
అతుకులబొంతగా అన్నింటినీ కలిపి కుట్టి
జండాగా ఎగరేస్తే
ఏ వ్యతిరేకగాలో బలంగా వీస్తే
కుట్లను తెంపి ఎన్ని పీలికలు చేస్తుందో
ఏమిటో అన్నీ అనుమానాలే
చేతులు కలిపి మానవహారాల్ని కడుతున్నా
ఏ అంగీ కింద ఏ చురకత్తి దాగుందో
దొంగచూపుల సిసికెమేరాల నిత్యపహారాలే!
ఇప్పుడిక
నాయకమ్మన్యుల ఇళ్ళల్లోని కళ్ళన్నీ
వత్తులు వేసుకుని వెలిగే దీపాలౌతుంటాయి
వెన్నుపూస లోతుల్లోంచి చలిపాము
స్రరున పాకినట్లు జలదరింపులు
బయటికి డాంబికాల మాటల్తో
ప్రజలపై వరాలజల్లులు కురిపిస్తున్నా
ఏమూలో మనసులో తేలుకొండిలా
ఓటర్ల మీద అనుమానపు త్రాచు
భయం ఉండుండి పడగవిప్పుతూనే ఉంది
దుర్భిణీ వేసుకు వెతుకుతున్నా
చీకటి మూలాల మాటున
గూడుపుఠాణీ అనుమానాలే
భజనపరులు చుట్టూ చేరి
జయనామ జపాలు చేస్తున్నా
ఎక్కడో ఏమూలో
తేలుకొండిలా లేస్తున్న భయం భయం!! (ఇంకావుంది)

కవిత

# సుందరాంగి

- వెనుగు నరసింహారెడ్డి

అది
పుట్టకముందే పూయబడ్డ బురద కదా
దాన్ని కడిగేసుకోగలిగే జలభాండం
సంపాదించుడు అంత ఈజీ కాదు
దాని రెప్పల రెపరెపల ఆకర్షణ తప్పించుకొనుడు
మామూలోడి తరం కాదు
దాని వర్చస్సూ దాని వచస్సూ దాని టచింగ్ నెస్సూ
దాని నీతీ ఖ్యాతీ అబ్బబ్బబ్బబ్బ....
అల్ టు గెదర్ అదొక సుందరాంగి

★ ★ ★

దయ్యాలకు అందమైన
రూపముండొద్దని ఎక్కడుంది
భీకర గళాలకు సన్నాయి నొక్కులు
తెలియొద్దని ఎక్కడుంది
రాక్షసులకు సంస్కృత ప్రేమ
ఉండొద్దని ఎక్కడుంది
భక్తీ ముక్తీ ఇతరులకు నిర్దేశించిన ప్రవచనాలే

★ ★ ★

అది పూలగుత్తై ఊరేగొచ్చు
పక్వ ఫలమై ప్రదర్శించొచ్చు
కళ్ళు మూసి తాదాత్మ్యం నటించొచ్చు
కన్రెప్పల్ని సుతారంగా
మునివేళ్ళతో తాకి
పరవశం ప్రదర్శించొచ్చు

★ ★ ★

అందర్నీ ఉన్మత్తీకరణతో
నీతుల పురివేసి
ధర్మం 'పలుగు' పేనుతూపోవచ్చు
ఆదర్శమనుకునే తూర్పున కానీ
ఆకర్షణీయమైన పడమర కానీ
ధార్మికత
అవసరార్థం వేషం మార్చే బహురూపి
బహుసుందరాకారి
అందమైన అబద్ధాలమారి

పుస్తక పరిచయం

కోటంరాజు రామారావు రచన


# 'కలం నా ఆయుధం'

ఒక పాత్రికేయుడి జ్ఞాపకాలు

- కొత్తపల్లి రవిబాబు

**ప్రసిద్ధ** సంపాదకుడు కోటంరాజు రామారావు తన జ్ఞాపకాలను 1965లో ఇంగ్లీషులో 'The Pen as my Sword' అనే పేరుతో ప్రచురించారు. దానిని తెలుగులోకి కందిమళ్ళ శివప్రసాద్ 2022లో అనువదించి ప్రచురించారు.

కోటంరాజు పున్నయ్య, రామారావులు అన్నదమ్ములు. ఇద్దరూ ఉత్తర భారతం నుండి వెలువడిన ఇంగ్లీషు పత్రికలకు సంపాదకులుగా ప్రసిద్ధి చెందారు. రామారావు 1896 నవంబరు 9న చీరాలలో జన్మించారు. చీరాల, రాజమండ్రి, కాకినాడ, మద్రాసులలో విద్యాభ్యాసం చేశారు. వివిధ హోదాలలో నాలుగు దశాబ్దాలపాటు 25 పత్రికలలో పనిచేశారు. జవహర్లాల్ నెహ్రూ ప్రారంభించిన 'నేషనల్ హెరాల్డ్'కు 1938 నుండి 1946 వరకు సంపాదకులుగా పని చేశారు. నవభారత చరిత్ర నిర్మాణ క్రమంలో జాతీయోద్యమానికి కలాన్ని కరవాలంగా ఉపయోగించారు. ఒక రైలు ప్రయాణంలో తలుపు వద్ద వున్న సీటులో కూర్చున్న ఆయన నిద్రలో రైలు నుండి పడిపోయి 1961 మార్చి 3న తన 65వ యేట మరణించారు. ఆశ్చర్యం కల్గించే విషయం ఏమిటంటే వీరి అన్న పున్నయ్య, 1948లో అఖిలభారత వార్తామండలి సమావేశాలకు ముంబై వెళ్ళి అక్కడ రోడ్డు మీద నడుస్తూ గుండెపోటుతో జులై 23, 1948న తన 63వ యేట మరణించారు. మూడు రోజుల పాటు ఆయన ఆనుపానులు లభించలేదు. చివరకు ఒక హాస్పిటల్ మార్చురీలో ఆయన మృతదేహాన్ని గుర్తించారు.




ఇంగ్లీషు పత్రికల సంపాదకులుగానూ, ఉత్తర భారతదేశంలో ఇంగ్లీషు పత్రికలకు సంపాదకులుగానూ ప్రసిద్ధిగాంచిన తెలుగువారు కోటంరాజు సోదరులేగాక సి.వై. చింతామణి, మానికొండ చలపతిరావు, డా॥ లంక సుందరం, జి.వి. కృపానిధి, ఎస్. వెంకట నారాయణ, జి.కె. రెడ్డి, వి.వి.ఆర్. శర్మ, పర్సా వెంకటేశ్వరరావు, పాలగుమ్మి సాయినాథ్, కుందూరి ఈశ్వరదత్తు, భాసా సుబ్బారావు, ఎ.ఎస్.రామన్, గోరాశాస్త్రి తదితరులు వున్నారు. తన జ్ఞాపకాలలో కోటంరాజు రామారావు పైన ఉదహరించినవారిలో కొందరితో తన పరిచయాన్ని ప్రస్తావించారు.

కోటంరాజు రామారావు 'సమరశీల సంపాదకుడు', 'భయమెరుగని వ్యక్తి', 'నేషనల్ హెరాల్డ్' సంపాదకునిగా ఆయన కృషి అనుపమానం. దాదాపు 12 ఇంగ్లీషు పత్రికలకు ఆయన సంపాదకునిగా వున్నారు. ఇప్పుడు పరిచయం చేస్తున్న పుస్తకం ఆయన స్వీయచరిత్ర కాదు. పత్రికారంగంలో ఆయన జ్ఞాపకాలు మాత్రమే. ఆ జ్ఞాపకాలతోపాటు 1916 నుండి 1965 వరకు జరిగిన రాజకీయ సంఘటనలు, వాటికి తన స్పందనలను మనకూ అందించారు. ఫలితంగా ఒక చరిత్ర గ్రంథం చదువుతున్నట్లు పాఠకులకు అనిపిస్తుంది. జాతీయోద్యమ కాలంలో ఒత్తిడికి లోనైన సంక్లిష్ట సందర్భాలను, పత్రికారంగం గాంధీ సందేశాలను ప్రజలకు అందించిన వైనాన్ని వివరించిన రామారావు తరంనాటి పాత్రికేయులు ఒక పవిత్రమైన దీక్షగా తమ వృత్తిని చేపట్టారు. ఆనాటి పత్రికలు దేశభక్తిని ప్రబోధించే సాధనాలుగా పనిచేశాయి.

వారి కాలంలో జాతీయతకు పర్యాయ పదంగా పాత్రికేయ వృత్తి రూపాంతరం చెందింది. ఆయన మొట్టమొదట 'హ్యూమానిటీ' అనే బ్రహ్మసమాజం వారి పత్రికలో చేరారు. సంఘ సంస్కరణలపై కేంద్రీకరించిన ఆ పత్రికలో "మద్రాసులో వున్న అసంఖ్యాకమైన దేవాలయాలు, దేవతా విగ్రహాలను వదిలించుకోవాలంటే మరో మహమ్మద్ గజినీ అవసరం వుందని" రాసిన ఆయన చిక్కులలో పడ్డారు. పత్రికనూ ఇబ్బందులలో పడేశారు. దాదాభాయి నౌరోజీ మరణించిన సందర్భంగా 1917లో ఆయనపై రాసిన వ్యాసంతో రామారావు తొలిసారిగా పాఠకులకు పరిచయమయ్యారు.

తన అన్న పున్నయ్య సబ్‌ఎడిటర్‌గా వున్న 'న్యూస్‌టైమ్'లో మరో సబ్ ఎడిటర్‌గా రామారావు మార్చి 1919లో చేరారు. వృత్తిలో తొలి పాఠాలు ఆ పత్రికలో పనిచేసిన 11 నెలలపాటు నేర్చుకున్నారు. జర్నలిజం పాఠశాలలో ప్రాథమికమైన శిక్షణ పాత్రికేయ వృత్తిలో కనీస అవసరమని గ్రహించారు. జలియన్ వాలాబాగ్ దురంతానంతరం సింధ్ కమీషనర్ ప్రజాసదస్సు పెట్టి పంజాబ్‌లో రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన అల్లర్ల వంటివి జరగరాదని హెచ్చరించారు. ఆ సదస్సు జరిగిన హాలుకి ఎదురుగా వున్న యింట్లో మాటువేసి వార్తలు సేకరించే పనిలో ఒకసారి గుర్రం కాలి గిట్టలు మధ్య రామారావు నలిగిపోవలసిన పరిస్థితి నుండి నేర్పుగా తప్పుకున్నారు.

సి.వై. చింతామణి సంపాదకుడుగా వున్న అలహాబాద్ పత్రిక 'లీడర్'లో 1920 జనవరిలో ఉపసంపాదకునిగా చేరి, ఆయన చీవాట్లు

తింటూ రామారావు మరింత రాటుదేలారు. ఆ తర్వాత 1920 జూన్‌లో 'అడ్వకేటు ఇండియా' అనే బొంబాయి పత్రికలో చేరారు. 1921 అక్టోబర్‌లో కరాచీలోని 'సింధ్ అబ్జర్వర్' పత్రికలో ఉపసంపాదకునిగా చేరి వెనుకబడిన సింధ్ ప్రాంత సమస్యలపై కేంద్రీకరించి దానికి తన సేవలను అందించారు. 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా'లో తనకు లభించిన అనుభవ సంపద అపూర్వమైనదని చెప్పారు. ఆ పత్రిక యాజమాన్యం ఐరోపావారిదైనప్పటికీ సబ్ ఎడిటర్లందరూ నల్లవాళ్ళేనని ఒక యూరోపియన్ అధికారి చేసిన వ్యాఖ్యకు, యూరోపియను యాజమాన్యం అభ్యంతరం తెలిపి ఆ అధికారి చేత క్షమాపణ చెప్పించారు. ఇలా వివిధ పాత్రికేయులు, వారి వార్తా కథనాలలోని విశేషాలు, లోటుపాట్లు రామారావు తన కథనంలో ఆసక్తిదాయకంగా అందించారు. ఆయన 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా' 'ఈవెనింగ్ న్యూస్ ఆఫ్ ఇండియా'లలో 4 ఏళ్ళ నాలుగు నెలల (జూన్ 1923 – సెప్టెంబర్ 1927) పాటు పనిచేశారు.

రామారావుకు గాంధీపట్ల అపారమైన గౌరవం. కనుక ఆయన తన తొలి సంతానమైన ప్రతాప్‌ను తీసుకెళ్ళి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. చీరాలలో 10 నెలలు విశ్రాంతి తీసుకున్న తర్వాత 1928 జులైలో 'పయనీర్'లో చేరారు. చీరాలలో సైమన్ కమీషన్‌కు వ్యతిరేకంగా జరిగిన వూరేగింపులో పాల్గొన్నారు.

'పయనీర్' సంపాదకుడు యఫ్. డబ్ల్యు విల్సన్ పత్రికకు భారతీయతను సంతరింపచేశాడు. మంచి జర్నలిస్టుగా లోతైన పుస్తక సమీక్షలను, నిశితమైన సంపాదకీయాలు అందించేవాడు. కాని సంపాదకుడి పాత్రలో విఫలమయ్యాడు. మీరట్ కుట్రకేసుపై తన శైలిలో వ్యాఖ్యానాలు రాసి 1600/– రూపాయలు కోర్టుకు కట్టారు. ఈ పత్రిక విల్సన్ సంపాదకత్వాన ఇర్విన్ ప్రకటన రావడానికి ప్రయత్నం చేసింది. సైమన్ కమీషన్‌ను తీవ్రంగా ప్రతిఘటించింది. లండన్‌లో టోరీ ప్రభుత్వం దుర్నీతిని ఎండగట్టింది.

డిసెంబరు 1928లో కలకత్తా కాంగ్రెసు సభ డొమినియన్ ప్రతిపత్తికి అనుగుణంగా తీర్మానం చేసింది. రామారావు రెండురోజులు ఈ సభలకు హాజరై వాటి విశేషాలు ప్రచురించారు. సాండర్స్ హత్య, అసెంబ్లీలో బాంబుదాడులు, ఆనందభవన్‌ను నెహ్రూ జాతిపరం చేయడం నెహ్రూ ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొనడం, బార్డోలీ సత్యాగ్రహం, మొదలగు రాజకీయ సంఘటనకు రామారావు ప్రత్యక్ష సాక్షి.

రెండు రౌండ్‌టేబుల్ సమావేశాలు, విదేశీ వస్తు (వస్త్రాల) బహిష్కరణ, సారాకొట్ల ముందు పికెటింగ్, ఉప్పు ఉత్పత్తి ఉద్యమాల నేపథ్యంలో 1932 జనవరి 4న బొంబాయిలో గాంధీని ప్రభుత్వం అరెస్టు చేసింది. ఆంధ్రలో ఐతే జాతీయ జెండా ఎగరవేయకూడదనీ, గాంధీ టోపీ ధరించరాదని ఆనాటి తెల్లజాతి కలక్టర్ ఇచ్చిన ఆదేశాలను మద్రాసు హైకోర్టు కొట్టేసింది. ఉప్పుసత్యాగ్రహాల విచారణలో, మేజిస్ట్రేటు నేరస్తుడిని పేరు అడిగితే, ఆ నేరస్తుడు తన పేరు 'నమక్‌లాల్' (ఉప్పువాళ్ళ అబ్బాయిని) అనీ, మీ నాన్నగారి పేరేమిటి అంటే 'మితాలాల్' అనీ (మరాఠీలో మితా అంటే ఉప్పు) చెప్పిన సంఘటనలతో పాటు మరెన్నో విశేషాలను రామారావు తెలియచేశారు.

భారతీయులపట్ల విల్సన్ ('పయనీర్' సంపాదకుడు)కు గల ఆదరాభిమానాల కారణంగా బ్రిటిష్ పాత్రికేయులు యూనియన్ నుంచి ఆయనను తొలగించడం, చివర్లో బీదరికంలో అనామకంగా చనిపోయిన ఉదంతాన్ని రామారావు అందించారు.

'ఇండియన్ డెయిలీ మెయిల్'కు చెందిన పోతన్ జోసఫ్, 'బాంబే క్రానికల్'కు చెందిన హర్నిమన్, 'ఫ్రీ ప్రెస్ జర్నల్' సదానంద్, మొదలగు పాత్రికేయ ప్రముఖుల వ్యక్తిత్వాన్ని, వారి విశేష ప్రతిభను రామారావు తన జ్ఞాపకాలతో ప్రతిభావంతంగా చిత్రీకరించారు. హర్నిమన్ అయితే 'భారతదేశం స్వతంత్ర సిద్ధి పొందేవరకు నా కలం విశ్రాంతి తీసుకోదు' అని ప్రకటించారనీ, ఈ ఆంగ్లేయ పాత్రికేయుని సమాధి బొంబాయి శివార్లలో అజ్ఞాతంగా వుందనీ రామారావు గుర్తుచేశారు. సదానంద్ గురించి చెబుతూ ఆయన ఒక సాహసి అనీ, అంతులేని సృజనాత్మక శక్తి ఆయనకు వుందనీ, ఉక్కుమనిషి అనీ, ప్రజలలో రాజకీయ చైతన్యం తీసుకురావడానికి పత్రికను సాధనంగా మలచుకున్నాడనీ, గుజరాతీ, మరాఠీలలో కూడా పత్రికను ప్రచురించాడనీ, ఫ్రీ ప్రెస్ న్యూస్ ఏజెన్సీని 1927లో ప్రారంభించి, ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే వార్తలను ప్రచురించారనీ, 'రాయిటర్' లాంటి విదేశీ వార్తలనందించే విభాగాన్ని ప్రారంభించాలని విఫల యత్నం చేసారనీ చెబుతూనే, సదానంద్ సంపాదకీయాలలో తరచు దాటవేసే ధోరణి వుండేదనీ, హేతుబద్ధత లోపించేదనీ, అప్పుడప్పుడూ వ్యాకరణ దోషాలుండేవనీ, హిందూ మత వాదిగా వుండేవాడని కూడా రామారావు చెప్పారు. సదానంద్ పత్రికలో రామారావు పనిచేసిన రెండు సంవత్సరాల కాలంలో ఆయన రాసిన మూడు, నాలుగు రచనలు మాత్రం తిరస్కరణకు గురైనట్లు తెల్పారు.

ఒక విలాసవంతమైన ఓడలో బొంబాయి చేరిన ప్రముఖ ఆంగ్ల రచయిత బెర్నార్డ్ షాతో ఓడ పైభాగంలో జరిపిన పత్రికా విలేకరుల సమావేశ వివరాలు పాఠకులకు ఈ పుస్తకంలో లభిస్తాయి.

నాలుగేళ్ళ విరామం (అక్టోబరు 1934 – జులై 1938) తర్వాత రామారావు ప్రకాశం పంతులు నడుపుతున్న 'స్వరాజ్య' పత్రికకు సంపాదకునిగా చేరి వందరోజులపాటు 'స్వరాజ్య' పత్రిక మూతపడే వరకు పనిచేశారు. ఆ తర్వాత పదినెలల నిరుద్యోగ కాలంలో 60 వేలమంది హాజరైన బొంబాయి కాంగ్రెసు మహాసభలకు హాజరయ్యారు. 1934లో ఢిల్లీ నుండి వస్తున్న 'నేషనల్ కాల్' అనే పత్రికలో చేరారు. ఆ పత్రిక కాగితం పట్టుకుంటే మసి అయ్యేట్టు నాసిరకంగా వుండేదట. 'అందులో ఒక బండెడు ముద్రా రాక్షసాలు, పేలు నిండిన పిల్లవాడి చింపిరి జుత్తులా వుండేది' అని రామారావు చమత్కరించారు. అయితే దీనిలో ప్రముఖ పాత్రికేయులు జె.యన్.సాహ్ని, సంపాదకునిగా, కె.డి.కోహ్లి మేనేజరుగా వుండేవారు. జార్జిరాజు మరణవార్త మొదటగా ప్రచురించిన కీర్తి ఈ పత్రికకు వచ్చింది.

ఆనాటి అసెంబ్లీ చర్చలలో పాల్గొన్న యన్.వి.గాడ్గిల్, యన్.జి.రంగా, వి.వి. గిరి, కాశీనాధుని నాగేశ్వరరావు, ఉమర్ ఆలీషా, డా॥ భగవాన్‌దాసు, శ్రీ ప్రకాశ్, భూలాభాయ్ దేశముఖ్, యస్. సత్యమూర్తి, గిరిజా శంకర్ వాజపేయి మొదలగువారి వాక్చాతుర్యం గురించి, ప్రతిభ గురించి రామారావు వివరించారు. 'నేషనల్ కాల్'లో జీతాలు ఇవ్వడంలేదని లాహోర్ పత్రిక 'పీపుల్'లో ఐదునెలలు పనిచేస్తే ఒక్కసారి మాత్రం జీతం అందుకున్నారు. 'జేబు వట్టిపోయింది కాని బుద్ధి చురుకు తేలింది' అని ఆనాటి పరిస్థితిని వర్ణించారు.

నెహ్రూ పంజాబ్ పర్యటన సందర్భంగా, రామారావు అన్నయ్య పున్నయ్య సంపాదకుడుగా వున్న 'సింధ్ అబ్జర్వర్' యాజమాన్యం నెహ్రూ సభల గురించి పత్రికలో ఏమీ రాయవద్దని శాసించింది.

కాని ఆత్మగౌరవం కల సంపాదకునిగా పున్నయ్య నెహ్రూ ఉపన్యాసాలను, వార్తలను ప్రచురించాలని ఆదేశించాడు. వెంటనే కొన్ని గంటలలోపే, కొంత డబ్బు ఇచ్చి పున్నయ్యను ఉద్యోగం నుంచి తొలగించారు. అయితే ఆ పరిహార ధనాన్ని పున్నయ్య తీసుకోకుండా, స్వంత పత్రిక పెట్టే ప్రయత్నం చేస్తున్న సందర్భంలో, 'సింధ్ అబ్జర్వర్' పత్రిక యాజమాన్యం దానిని పున్నయ్యకు అప్పచెప్పారు. ఒక సంపాదకుడు పత్రిక యాజమాన్యాన్ని తొలగించడం, సంపాదకునిది పైచేయి కావడం ప్రపంచ పత్రికా చరిత్రలోనే తొలి విజయమని రామారావు ప్రశంసించారు.

జవహర్లాల్ నెహ్రూ సొంత పత్రిక 'నేషనల్ హెరాల్డ్'కు రామారావు సంపాదకునిగా 1938లో చేరారు. కాంగ్రెసు పార్టీ ముఖ్యులు ఈ పత్రికకు ఆర్థికవనరులు సమకూర్చారు. పత్రికలో చిరుద్యోగిగా వున్న ఎమ్. చలపతిరావు రెండేళ్ళలో రెండవ స్థానానికి ఎదిగారు. ఆయన మేథస్సు, ఆంగ్లభాషపై వున్న అధికారం అద్భుతం. 1946లో రామారావు తర్వాత ఆయన సంపాదకుడయ్యారు. విదేశీ రాజకీయాలపై సాధికారికత వుండేది. "ఒక సింహంలోని గాంభీర్యం, ఒక రాయబారికి వుండే ఔన్నత్య ప్రాభవాలు కలగలపిన సంస్కారం ఆయన స్వంతం". ఈ పత్రిక పాలకుల క్రూరత్వానికి వ్యతిరేకంగా నిలిచి, స్వేచ్ఛాప్రవృత్తిని నిర్భయంగా ప్రకటించింది. ఇది నెహ్రూ మానసపుత్రికే ఐనా నెహ్రూ అభిప్రాయాలకు వ్యతిరేకంగా కూడా పత్రిక నడిచిన సందర్భాలున్నాయి. సంపాదకుని స్వేచ్ఛకు ఆయన అడ్డుపడేవారు కాదు.

తాను సంపాదకునిగా వున్న కాలంలో పత్రిక వివిధ రాజకీయ, సామాజిక అంశాలపై అవలంబించిన దృక్పథాన్ని రామారావు వివరంగా చెప్పారు. ఉదాహరణకు 1938-39లలో తెలంగాణలో నిజాంకు వ్యతిరేకంగా ఆర్యసమాజ్‌వారి సత్యాగ్రహాన్ని సమర్థించడం లక్నోలోని 60 మంది ఖస్కర్ మూకలను, అప్పటి ముఖ్యమంత్రి రఫీ అహ్మద్ కిద్వాయ్ నాయకత్వాన లక్నో నుంచి వెళ్ళగొట్టడం, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయ రజతోత్సవ సభలో ప్రేక్షకులను నెహ్రూ గాడిలో పెట్టడం, ఇందిరా నెహ్రూ, ఫిరోజ్ గాంధీల వివాహం, త్రిపురలో 1939లో జరిగిన కాంగ్రెస్ మహాసభలో బోసు-గాంధీల మధ్య వివాదం, యం.యన్.రాయ్ అరెస్టు, ఇంగ్లాండ్ జర్మనీ మీద యుద్ధం ప్రకటించిన వార్త వీరి పత్రికలో మాత్రమే మొట్టమొదటిగా రావడం మొదలగు విశేషాలతో అత్యంత ఆసక్తిదాయకంగా ఈ పుస్తకంలోని 12వ భాగం 'ప్రతిరోజూ ఒక సంచలనమే' సాగింది.

యుద్ధం రోజుల్లో ఫాసిస్టు వ్యతిరేక పత్రికగా 'హెరాల్డ్' గుర్తింపు పొందింది. 1939 నవంబరు తర్వాత కాంగ్రెసు నాయకత్వం అజ్ఞాతంలోకి వెళ్ళినపుడు, పార్టీ వాణిని 'హెరాల్డ్' వినిపించింది. 'హెరాల్డ్' శత్రువర్గానికి ప్రతినిధిగా వుండటం యు.పి. గవర్నర్ సర్ మారిస్ హేలెట్‌కు నచ్చక పత్రిక మీద విమర్శల దాడి చేశాడు. అటువంటి దాడితో 'హెరాల్డ్'కు అదనపు ప్రచారం కల్పించాడు. ఈ కాలంలో సంపాదకుడైన రామారావుపై ప్రభుత్వం సెన్సార్ నిబంధనల క్రింద ఆరుసార్లు దాడిచేసింది. ఒక దశలో ఈ దాడికి నిరసనగా సంపాదకీయాల్ని ప్రచురించడం ఆపేశారు. మరోసారి సెక్యూరిటీగా ఆరువేల రూపాయలు, 12 వేల రూపాయలు మదుపు చేయమని ప్రభుత్వం తాఖీదు పంపింది. వచ్చిన విరాళాల వెల్లువ ద్వారా ఆ డబ్బును 'హెరాల్డ్' చెల్లించింది. క్రిప్స్ ఏర్పాటుచేసిన పత్రికా విలేకరుల సమావేశంలో రచనలు వివాదాస్పదంగా వున్నాయన్న మిషతో ఎడిటర్‌పై దేశద్రోహ నేరం మోపారు. మొత్తానికి అగస్టు 1942 వరకు పత్రికను కాపాడుకున్నారు.

1942 ఆగస్టు 8న బొంబాయిలో కాంగ్రెసు మహాసభ 'క్విట్ ఇండియా' తీర్మానాన్ని చేసింది. ఆ సభ విశేషాలు, ఆ తర్వాత సభపై పోలీసుల దాడులకు రామారావు ప్రత్యక్ష సాక్షి. 'హెరాల్డ్' సంపాదకవర్గం అరెస్టుకు సిద్ధమయ్యారు. ఈ ఉద్రిక్త పరిస్థితిలో కూడా కాంగ్రెసుకు వ్యతిరేకంగా ప్రభుత్వం రూపొందించిన 'పుకల్ సర్క్యులర్'లో సూచించిన నిర్బంధ చర్యలను పత్రిక ద్వారా ప్రజల దృష్టిలోకి తేవడంలో సఫలమయ్యారు.

ప్రభుత్వ ప్రమేయం లేకుండా స్వచ్ఛందంగా పత్రికను మూసివేయాలని భావించి 'వందేమాతరం' శీర్షికతో చివరి సంపాదకీయాన్ని ప్రచురించారు. అలహాబాద్ కోటలోని అశ్వత్థ వృక్షాన్ని మొగలాయిలు తొలగించటంలో విఫలమైనట్లే కాంగ్రెసును ఈ విదేశీ శక్తులు ఏమీ చేయలేవు అంటూ ఆ సంపాదకీయంలో ఆత్మస్థైర్యాన్ని ప్రకటించారు.

1942 మే లో రామారావు అరెస్టయ్యారు. 5 నెలల జైలు జీవితం గురించి రాస్తూ 'అది నాకెన్నో పాఠాలు నేర్పింది. నాలోని మానవీయ మూలాలను తట్టి లేపింది. నా దృష్టిలో సామాజిక శాస్త్రాలను అభ్యసించే ప్రతి విద్యార్థి కొద్దికాలంపాటు నిర్బంధ జైలు జీవితం అవసరమను కుంటాను' అని రామారావు రాశారు. సహ ఖైదీలలో కొందరి గురించి వివరించారు. ఆయన వున్న గదిలోనే గతంలో మోతీలాల్ నెహ్రూ, జవహర్లాల్ నెహ్రూ, జె.బి. కృపలాని, ఆర్.యస్. పండిట్ లాంటివారు వుండి కందిరీగలతో, ఉడతలతో సహజీవనం చేశారు. జైళ్ళలో లంచం ఇచ్చి అన్ని సౌకర్యాలు పొందవచ్చని, భార్యతో కాపురం కూడా చేయవచ్చనీ తెలుసుకున్నారు. జైలు నుంచి బయటకు వచ్చే సమయానికి 'హెరాల్డ్' పోలీసుల అధీనంలో వుంది. సంవత్సరం తర్వాత పోలీసుల చెర నుండి విడిపించుకున్నారు. బెంగాల్‌కరువుపై రహస్య కరపత్రాన్ని విడుదల చేశారు.

జైలు నుండి బయటకు వచ్చిన తర్వాత స్వతంత్ర పాత్రికేయునిగా 'అమెరికన్ యునైటెడ్ ప్రెస్'కు ఐదు వ్యాసాలు, జ్యోతిష్యులు, ముషాయిరాలు, ఎప్పుడు రిటైర్ అవ్వాలి! పరీక్షలు, ధరలు, ఎగతాళి చేయడం వంటివాటిపై 12 వ్యాసాలు రాశారు. 'హిందుస్తాన్ టైమ్స్'కు వ్యాసాలు రాస్తూ, గాంధీ-జిన్నా చర్చలు విఫలమైన తర్వాత రామారావు వార్ధాలోని సేవాగ్రాం చేరారు. గాంధీతోపాటు మహాబలేశ్వర్‌కు పంచగమికి వెళ్ళారు.

1945 నవంబర్‌లో 'హెరాల్డ్' పత్రికను తిరిగి ప్రారంభించగల్గారు. జనవరి 1946లో జరిగిన రాష్ట్ర ఎన్నికలలో 'హెరాల్డ్' ప్రముఖపాత్ర నిర్వహించింది. ఈ కాలంలో వైస్రాయి వేవెల్‌తో రెండు నిమిషాలు మాట్లాడే అవకాశం రామారావుకు లభించింది. 'హెరాల్డ్'లో ఉద్యోగం వదలి నాగపూర్‌లో కుటుంబసభ్యులతో వుంటూ ఫ్రీలాన్సర్‌గా స్థిరపడ్డారు.

స్వాతంత్ర్యం ప్రకటించిన తర్వాత, దేశ విభజన కారణంగా బెంగాల్, పంజాబ్‌లలో జరిగిన హత్యాకాండ, వలసలకు రామారావు ప్రత్యక్ష సాక్షిగా వున్నారు. అగస్టు 15ను విజయవాడ దగ్గర ఒక పల్లెటూరులో జరిపి, ఆ సభలో ఆవేశంగా రామారావు ప్రసంగించారు.

పాట్నాకు చెందిన 'సెర్చిలైట్' పత్రికతో నవంబరు 1948లో రామారావు కాంట్రాక్టు కుదుర్చుకుని, దాని సోదర సంస్థ 'హిందుస్తాన్ టైమ్స్'కి రాజ్యాంగసభ చర్చలపై నివేదిక ఇచ్చారు. జైపూర్‌లో కాంగ్రెస్ తిరునాళ్ళ గురించి పత్రికలకు సమాచారం అందించారు. నల్ల డబ్బు ప్రభావంతో జోరుగా సాగిన సభ విశేషాలను 'జూమ్ ఫ్రం జైపూర్' అనే శీర్షికతో చర్చల సారాంశానికి హాస్యాన్ని జోడించి సుదీర్ఘమైన రచనలు పంపారు. నేపాల్ తిరుగుబాటుదార్లకు మద్దతుగా రాసినందుకు, 1950 నవంబరు చివర్లో రామారావును 'సెర్చిలైట్' పత్రిక సంపాదకత్వ బాధ్యతల నుండి అకస్మాత్తుగా తొలగించారు. ఈ తొలగింపును బీహారు పత్రికలన్నీ తప్పుబట్టాయి. ఒక పత్రిక 'రామారావు జిందాబాద్' అనే కథనాన్ని ప్రచురించింది. ప్రజల దృష్టిలో 'సెర్చిలైట్'కు ఒక గౌరవ స్థానం కల్పించి దాని పూర్వ వైభవాన్ని పునరుద్ధరించిన రామారావుకు పాట్నా రైల్వేజంక్షన్‌లో మరువలేని వీడ్కోలు సభ జరిగింది.

1949 నవంబరులో ప్రధానమంత్రి నెహ్రూతోబాటు అమెరికా, కెనడా పర్యటనలో పాత్రికేయునిగా చేసిన విదేశీ పర్యటన రామారావు జీవితంలో మరపురాని ఘట్టం. 20 వేల మైళ్ళ ప్రయాణంలో డజను పెద్ద నగరాలను ఆరు విశ్వవిద్యాలయాలను చూశారు. 'హిందుస్థాన్ టైమ్స్', 'సెర్చిలైట్', 'లీడర్' పత్రికలకు ప్రాతినిధ్యం వహించారు. తన పర్యటన విశేషాలను ఎప్పటికప్పుడు తన పత్రికలకు పంపారు. 'మిక్కుటమైన డబ్బుతో బాధపడటం, సుష్టుగా తినడం, హాయిగా నిద్రపోవడం, రాక్షసుడిలా పనిచేయడం', అమెరికన్ పౌరుడి జీవన విధానంగా రామారావు భావించారు. వంద రకాల జాతులు, విభిన్న సంస్కృతులు, నాగరికతలు ఉద్భవించిన అమెరికా సమాజం గురించిన చాలా వివరాలు రామారావు 'అమెరికా పర్యటన' అనే అధ్యాయంలో ఇచ్చారు.

మార్గమధ్యమంలో లండన్‌లో కొద్దిరోజులు గడిపి, ఆ నగరంలోని అందాలను అసహ్యకరమైన అంశాలను ఆకళింపు చేసుకున్నారు. పారిస్‌ను చూశారు. 'ఉక్కు రాక్షసిలా అసహ్యంగా కనిపించే ఈఫిల్ టవర్‌ను కూల్చివేస్తే బాగుంటుందని' అనుకున్నారు.

1951 జనవరి 1న 'ఇండియన్ న్యూస్ క్రానికల్' పత్రికలో రామారావు కొద్దిరోజులు పనిచేశారు. సంపాదక బాధ్యతలు పేరుకి మాత్రమే. రామ్‌నాథ్ గోయంకా, దేశబంధు గుప్తాలు ఈ పత్రికాధిపతులు. కొంతకాలం తర్వాత కృపలానీకి సంపాదక బాధ్యతలు అప్పచెప్పాలనుకున్నారు. ఆయన సంపాదకవర్గానికి చైర్మన్‌గా వుండటానికి అంగీకరించారు. కాని తను ప్రారంభించాలనుకున్న క్రిషిక్ మజ్దూర్ ప్రజాపార్టీకి అది ఉపయోగపడలేదు. దానితో ఆయన పత్రిక వదిలేసి వెళ్ళిపోగా, ఆ తర్వాత రామారావుకు కూడా యాజమాన్యం ఉద్వాసన పల్కింది.

ఆ తర్వాత తొలి స్వారత్రిక ఎన్నికల కాలంలో ఆలిండియా కాంగ్రెస్ కమిటీ నడిపిన 'కాంగ్రెస్ సందేశ్' పత్రిక సంపాదకునిగా అది మూతబడేవరకు పనిచేసి తొమ్మిదివారాల పాటు నాలుగువేల సభల్లో మాట్లాడిన నెహ్రూ ప్రసంగ వార్తలను అందించారు. అప్పటికే పార్లమెంటు సభ్యుడైన రామారావు పత్రిక పట్ల తగు శ్రద్ధ వహించక పోవడం కూడా దీని మూసివేతకు ఒక కారణం.

1950లో పాత్రికేయులు, ఒక జాతీయ సంస్థను ఏర్పాటు చేసుకొని, అధ్యక్షునిగా మానికొండ చలపతిరావును ఎన్నిక చేసుకున్నారు. ఆయన మూడుసార్లు యీ పదవిని నిర్వహించారు. ఈ సంస్థ ప్రెస్ కౌన్సిల్ ఏర్పాటుకు కృషిచేసింది పత్రికలు యాజమాన్యానికి కాకుండా, ప్రజలకు లోబడి నిబద్ధతతో పనిచేయాలని రామారావు పేర్కొన్నారు. ధనికుల చేతుల్లో పత్రికకు సంబంధించిన అధికారం వుంటే, అది పత్రికారంగ వికాసానికి గొడ్డలిపెట్టు కాగలదని హెచ్చరించారు.

1952-54 మధ్య పార్లమెంటు సభ్యునిగా వుంటూనే 'కాంగ్రెస్ సందేశ్', 'పీపుల్' పత్రికలకు సంపాదకత్వం వహించిన రామారావు పలు అంశాలపై రాజ్యసభలో మాట్లాడారు. ఆయనకు రాజ్యసభ సీటు ఇవ్వమని అడగ్గానే నెహ్రూ సీటు ఇచ్చారు. తొలి ప్రసంగంలో నెహ్రూ విధానాలను, పంచశీల సిద్ధాంతాన్ని, రష్యా సోషలిస్టు సిద్ధాంతాలను పొగిడారు. రాజ్యసభ సభ్యునిగా ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు విషయంలో ప్రత్యేకమైన కృషిచేశారు. డా॥ కట్జూ ప్రవేశపెట్టిన ప్రెస్ (అభ్యంతరకర సమాచారం) బిల్లుపై ప్రతిపక్ష సభ్యులను మించి బిల్లును ఎండగట్టారు.

రాజ్యసభ సభ్యత్వం ముగిసిన తర్వాత పంచవర్ష ప్రణాళిక సంఘ ప్రచార విభాగంలో సలహాదారుడిగా ఉద్యోగం చేశారు.

ఆఖరి అధ్యాయంలో కుందూరి ఈశ్వరదత్తు, ఖాసా సుబ్బారావుల గురించి ఆసక్తిదాయకమైన వివరాలు అందించారు. పాతిక పత్రికలకు, రెండు వారపత్రికలకు పనిచేసిన రామారావు ఎన్నో దుర్భరమైన ఘటనలు ఎదుర్కొన్నా, ఈ వృత్తి నుంచి తప్పుకోవాలని ఎప్పుడూ అనుకోలేదు. బాట గతుకులమయంగా వున్నా, దేశానికి సేవ చేశారు. మంచి పేరు తెచ్చుకున్నారు.

సమాజ శ్రేయస్సు కోసం ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడంలో ఆనాటి పత్రికలు మహత్తరమైన పాత్ర పోషించాయి. సంఘంలోని దురాచారాలపై పోరాడాయి. కాని ఈనాటి పత్రికలు ఏదో ఒక పార్టీకి, ధనికులకు అనుబంధమైపోయి గత వైభవాన్ని మసకబారుస్తున్నాయి. ఒకే వార్తను వివిధ పత్రికలు తమ తమ దృక్పథాలకనుగుణంగా ప్రచురిస్తున్నాయి. సంఘసంస్కరణ కాదు గదా మూఢవిశ్వాసాలను ప్రచారం చేస్తున్నాయి. డబ్బు తీసుకుని వార్తలు, కథనాలు ప్రచురించే అధమ స్థాయికి దిగజారాయి. సంపాదకులకు స్వేచ్ఛ లేదు. వాక్స్వాతంత్ర్యం లేదు. ఆయన యజమాని చెప్పినట్లు విని జీతానికి పనిచేసే ఉద్యోగి మాత్రమే. పత్రికారంగం ఇంత పతన స్థాయికి దిగజారుతుందని పాత తరంవారు వూహించి వుండరు.

కందిమళ్ళ శివప్రసాద్ మూలంలో వున్న భావాలను తెలుగు పాఠకులకు అందిస్తూ ఒక ఉత్తమ గ్రంథాన్ని అనువదించారు. ఇది చదివిన తర్వాత కోటంరాజు రామారావు ఇంగ్లీషులో రాసిన 'ది పెన్ యాజ్ మై సోర్డ్' చదవాలనే కుతూహలం కలుగుతుంది.

**(కలం నా ఆయుధం. రచయిత : కోటంరాజు రామారావు. 1/8 డెమ్మీలో 282 పుటలు. వెల : రూ.150/- మొదటిముద్రణ : అగస్టు 2022. ప్రతులకు : జయచాముండేశ్వరి ప్రచురణలు. దొర బుక్‌హౌస్, 5-92-3/12, 5వ లైను, దేవపురం, గుంటూరు - 522002. ఫోన్ : 94412 70979)**

**సినిమా సమీక్ష**

## నియంతలను శిక్షించిన

# 'అర్జెంటీనా 1985' (2022)

– బాలాజీ (కోల్‌కతా)

**1985** ఏప్రిల్ 22 నుండి 1985 డిశెంబర్ 9 వరకు అర్జెంటీనాలో జరిగిన 'హుంటాల న్యాయవిచారణ' (The Trial of the Juntas) (స్పానిష్‌లో 'J' ని 'హ' గా పలుకుతారు.) ప్రపంచంలోనే అరుదైన న్యాయవిచారణ. రెండో ప్రపంచయుద్ధం తర్వాత హిట్లర్ మంత్రివర్గంపై జాతిసంహార నేరాన్ని మోపి సాగించిన 'న్యూరెంబర్గ్ విచారణ' తర్వాత, ఒక దేశపు ప్రజాస్వామ్య ప్రభుత్వం అదే దేశపు గత సైనికాధికారులపై విచారణ జరిపి శిక్షించడం చరిత్రలోనే కనీ, వినీ, ఎరుగని ఘట్టం. ఈ చారిత్రక సంఘటనపై వచ్చిన సినిమా 'అర్జెంటీనా, 1985'. సాంటియాగో మిత్రె ఈ సినిమాకు దర్శకుడే కాక, సహ రచయిత, సహ నిర్మాత కూడా. భారీ వ్యాపార విజయం పొందిన తర్వాత, గోల్డెన్ గ్లోబు అవార్డు రావడంతో ఈ సినిమాపై అందరి దృష్టీ పడింది. ఆస్కారుకు కూడా నామినేట్ అయింది గానీ, 'అర్జెంటీనా మిలటరీ దమనకాండలో అమెరికా హస్తం జగమెరిగిన సత్యం' ఐనప్పుడు అమెరికా పెద్దలు ఈ సినిమాకు అవార్డు ఇవ్వరని ఆస్కారు రాజకీయాలు తెలిసినవారికి ముందే తెలుసు. నేడు నియంతృత్వాలు మొత్తం ప్రపంచాన్నే కబళిస్తున్న దశలో ఈ సినిమా ఒక్క అర్జెంటీనాకే కాదు, అన్ని దేశాలకూ దిశ చూపుతుంది. ఈ సినిమా కథ అర్థం కావాలంటే అర్జెంటీనా చరిత్ర కొంచెం తెలుసుకోవాలి.




### అర్జెంటీనా చరిత్ర అతి సూక్ష్మంగా :

'వెండి'ని లాటిన్‌లో 'అర్జెంటమ్' అంటారు. ఆ పదం నుంచే 'అర్జెంటీనా'కు ఆ పేరు వచ్చింది. వెండి నిల్వల దేశం అర్జెంటీనా. లాటిన్ అమెరికా దేశమైన అర్జెంటీనాలో ఐరోపా వాసులు అడుగుపెట్టే వరకూ అది అల్ప జనసాంద్రత గల ఓ ఆదివాసీ తెగల దేశం. వేట, వ్యవసాయం వారి జీవనాధారం. 1480లో 'ఇంకా' సామ్రాజ్యం దండెత్తినప్పుడు మొదటి సారి ఓ ప్రధాన సామ్రాజ్యంలో భాగమైంది. 1516లో స్పానిష్ నావికుడు జువాన్ డియాజ్ డి సోలియాస్ నేటి బ్యూనస్ ఎయిర్స్ ప్రాంతంలో మొదటి కాలనీని స్థాపించాడు. ఓడరేవు నగరంగా బ్యూనస్ ఎయిర్స్ ప్రాముఖ్యత పెరగడంతో 1776లో 'వైస్రాయల్టీ ఆఫ్ ది రియో డి లా ప్లాటా' పేర అర్జెంటీనాను స్పెయిన్ దేశపు వలసగా మార్చేశారు. అర్జెంటీనాలో స్వాతంత్ర్య పోరాటాలు సాగాయి. అనతి కాలంలోనే జోస్ డి శాన్ మార్టిన్ నేతృత్వంలో 9 జూలై 1816న తమ స్వాతంత్ర్యాన్ని సాధించారు. స్పెయిన్ ఓడినా దేశంలో అంతర్యుద్ధం మాత్రం ఆగలేదు. చివరకు 1853లో రాజ్యాంగాన్ని రాసుకుని 1861 లో అధికారిక జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించారు. 1900 ల ప్రారంభంలో అర్జెంటీనా ఆర్థికంగా అభివృద్ధి సాధించింది. కానీ అభివృద్ధి ఫలాలు మాత్రం పై వర్గాలకే. నిమ్న వర్గాల్లో అశాంతి నెలకొంది. జువాన్ డొమింగో పెరోన్ అనే నాయకుడు 'పెరోనిజం' అనే జనాకర్షక ఉద్యమాన్ని ప్రారంభించి 1946లో అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. అతడి భార్య, సినీ నటి ఈవా అర్జెంటీనా మహిళాలోకంలో విశేషాదరణ పొందింది. 1955 లో మిలటరీ కుట్ర పన్ని అధికారాన్ని హస్తగతం చేసుకుంది. పెరోన్ స్పెయిన్‌కు పారిపోయాడు. అప్పట్నుంచీ 1973 వరకూ సైనిక పాలన లేదా బలహీన ప్రభుత్వాల పాలన సాగింది. 1973లో పెరోనిస్టులు మళ్ళీ గెలిచారు. జువాన్ పెరోన్ దేశానికి తిరిగి వచ్చి అధ్యక్ష పదవి చేపట్టాడు. మరో ఏడాది కాలంలోనే పెరోన్ మరణించగా అతని రెండో భార్య ఈసాబెల్ అధ్యక్షురాలైంది. ఆమె పాలనలో ద్రవ్యోల్బణం తీవ్రంగా పెరిగింది. అప్పటికే మిగతా లాటిన్ అమెరికా దేశాల్లోలానే కార్మిక వర్గ పోరాటాలూ, విప్లవ పోరాటాలూ సాగుతున్నాయి. ప్రపంచం సోవియట్, అమెరికాల మధ్య రెండు ధృవాలుగా చీలి, ప్రచ్ఛన్న యుద్ధం సాగుతోంది. లాటిన్ అమెరికాను 'కమ్యూనిస్టు భూతం' నుండి రక్షించుకోడానికీ, అమెరికా పెట్టుబడులకు రక్షణ కల్పించడానికీ, 'ఆపరేషన్ కండోరా' పేర సీఐఏ ద్వారా వివిధ లాటిన్ అమెరికన్ దేశాల్లో సైనిక కుట్రలు జరిపి అమెరికా నియంతృత్వాలను స్థాపిస్తోంది. పారాగువా, బ్రజిల్, బొలీవియా, ఉరుగ్వే, చిలీ, పెరూల తర్వాత అర్జెంటినాలో కూడా 1976 లో సైనిక కుట్రను విజయవంతం చేసింది. ఫలితంగా మార్చి 24, 1976న జెనరల్ జార్జ్ రఫేల్ విడేలా నాయకత్వంలోని మిలటరీ హుంటా 'ఉగ్రవాదాన్ని అణిచివేసే' నెపంతో ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని కూలదోసి, సైనిక నియంతృత్వాన్ని స్థాపించింది.

## ఏడేళ్ల రక్త చరిత్ర :

హుంటా పాలన 1976 నుండి 1983 వరకూ ఏడేళ్ల పాటు సాగింది. 'జాతీయ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ' పేర సాగిన ఈ పాలనలో కాంగ్రెస్‌ను రద్దు చేశారు, రాజకీయ పార్టీలను నిషేధించారు, పౌర హక్కులను కుదించారు, వాక్ స్వాతంత్ర్యాన్నీ, జాతీయ మీడియానూ తీవ్రంగా నిరోధించారు. వామపక్ష సిద్ధాంతాలకు మద్దతునిస్తున్నారని ఆరోపించి సాధారణ పౌరులను ఎత్తుకుపోయి వారిని చంపివేయడమో లేక మాయం చేసెయ్యడమో చేశారు. ఇలా 30,000 మంది విషయంలో జరిగింది. సైనిక చర్యల్లో కనిపించకుండా పోయినవారిని అర్జెంటీనాలో "డెసపరేసిడోస్" అని పిలుస్తారు. అర్జెంటీనా అంతటా 300 నిర్బంధ శిబిరాలు, హింసా కేంద్రాలతో సైనిక పాలన వర్ధిల్లింది. 'డర్టీ వార్'గా పేరుపడ్డ ఈ పాలనలోని మరో భయంకర నేరాలలో ఒకటి 'డెత్ ఫ్లైట్స్'. అనుమానితులను బంధించి, మత్తుమందు ఇచ్చి, విమానాల నుండి అట్లాంటిక్ మహాసముద్రంలోకి విసిరేసేవారు. యువతులనూ, స్త్రీలనూ లైంగిక వేధింపులకు గురిచేసేవారు. గర్భిణీ స్త్రీలకు కూడా మినహాయింపు లేదు. హింసా కేంద్రాలలో అటువంటి కొందరు ప్రసవించినపుడు, ఆ స్రీలను చంపేసి ఆ పిల్లలను కొందరు పిల్లలు లేని సైనికులు పెంచుకునేవారు. ఇలా తస్కరించబడ్డ, చట్టవిరుద్ధంగా దత్తత తీసుకోబడ్డ పిల్లల ఆచూకీ కోసం పోరాటం చేసే బామ్మల హక్కుల సంఘం ఒకటి నేటికీ అర్జెంటీనాలో పనిచేస్తోంది. దానిపేరు 'Abuelas de Plaza de Mayo'. ('అబుఎలాస్' అంటే అమ్మమ్మ లేదా నానమ్మ). ఈ సంస్థకు సంబంధించిన అమ్మమ్మలు తమ తమ సంస్థ పేరు రాసి ఉన్న శిరోవస్త్రాలను తలకు కట్టుకుని పోరాటం చేస్తుంటారు. ఇటువంటి వారు ఈ సినిమాలో మనకు కనిపిస్తారు. జన్యు విజ్ఞానం అభివృద్ధి చెందిన తర్వాత డీఎన్ఏ పరీక్షల ద్వారా 130కి పైగా పిల్లల అసలు వారసత్వాన్ని గుర్తించారట. చిలీలో కూడా తమ వాళ్ల అస్తికల కోసం ఎడారిలో త్రవ్వకాలు జరిపే కుటుంబసభ్యుల కథలను 'Nostalgia for the Light' అనే డాక్యుమెంటరీలో చూడగలం. రాజధాని నగరం బ్యూనస్ ఎయిర్స్‌లోనే నావికాదళం వారి 'School of Naval Mechanics' ఉంది. దీన్ని స్పానిష్ భాషలో 'Escuela de Mecánica de la Armada' లేదా ESMA అని అంటారు. ఇందులో ఒక నిర్బంధ హింసా కేంద్రం ఉంది. దేశం మొత్తం మీద జరిగిన అత్యాచారాలు ఒకెత్తు ఐతే ఈ ఒక్క కేంద్రంలో జరిగినవి మరొక ఎత్తు.

సినిమా కథలోకి వెళ్లే ముందు 1976లో జరిగిన సంఘటనని చూద్దాం. ఆర్థిక మాంద్యం ఉన్న ఆ రోజుల్లో తమ కోసం బస్సుల ఫీజులు తగ్గించాలని హైస్కూలు విద్యార్థులు ధర్నాలు చేశారు. ఈషాబెల్లె ప్రభుత్వం దిగి వచ్చింది. విద్యార్థులకు తగిన రాయితీలు కల్పించింది. కానీ అమెరికా మద్దతుతో ఆ దేశ ప్రజాస్వామ్యాన్ని కబ్జా చేయబోతున్న మిలటరీ కమాండర్లకు మాత్రం ఇది నచ్చలేదు. ఈషాబెల్లె ప్రభుత్వాన్ని కూల్చి సైనిక పాలన స్థాపించిన తర్వాత సెప్టెంబర్ 16 నాటి రాత్రి మాస్కులు ధరించిన వ్యక్తులు స్టూడెంట్ యూనియన్లో చురుకుగా పాల్గొన్న విద్యార్థులను వారి వారి ఇళ్ళ నుండి ఎత్తుకు పోయి డిటెన్షన్ సెంటర్లలో పడేశారు. ఆ రాత్రిని మిలిటరీ అధికారులు 'పెన్సిళ్ల రాత్రి' (ది నైట్ ఆఫ్ ది పెన్సిల్స్) అనగా 'విద్యార్థుల్ని ఎత్తుకొచ్చిన రాత్రి' అని పేరుపెట్టుకున్నారు. ఎత్తుకొచ్చిన పిల్లలపై చాలా రోజుల టార్చర్ జరిగింది. అమ్మాయిల్ని అత్యాచారం చేశారు. తరువాత వారు ఎప్పటికీ కనిపించని వారి జాబితాలో చేరిపోయారు. దేశం మొత్తం మీద ఇలాంటి మిస్సింగ్ విద్యార్థుల సంఖ్య 232. 1986 లో దర్శకుడు హెక్టర్ ఒలివేరా ఈ సంఘటనపై 'ది నైట్ ఆఫ్ ది పెన్సిల్స్' సినిమా తీశాడు. ఇలా సాగుతున్న పాలనలో ఇంకా తీవ్రమైన ఆర్థిక సంక్షోభాలు వచ్చాయి. ప్రజల దృష్టి మళ్ళించడానికి మిలటరీ పాలకులు ప్రక్కనే ఉన్న ఫాక్ల్యాండ్ దీవుల్ని ఆక్రమించారు. కానీ కొద్ది రోజుల్లోనే బ్రిటన్ సైన్యం ఆ దీవుల్నుంచి అర్జెంటీనాను తరిమికొట్టడంతో ఆ పాలకులు మరింత అభాసుపాలయ్యారు. తీవ్ర ప్రజా వ్యతిరేకత కారణంగా 1983 లో ఎన్నికలు జరిపారు. రావుల్ ఆల్ఫోన్సిన్ 'రాడికల్ సివిల్ యూనియన్' పార్టీ తరుపున గెలిచి అధ్యక్షుడయ్యాడు. ఆయన పాలన మొదలైన ఏడు నెలలకు ఈ సినిమా కథ ప్రారంభమౌతుంది.

## అర్జెంటీనా, 1985 సినిమా కథ :

రావుల్ ఆల్ఫోన్సిన్ పాలనలోకొచ్చి కొన్ని నెలలే గడిచింది. ఈ ప్రజాస్వామ్య ప్రభుత్వం ఎన్ని రోజులు మనుగడలో ఉంటుందో ఎవరూ చెప్పలేరు. బ్యూరోక్రసీలోనూ, బయటి సమాజంలోనూ గత పాలకుల విధేయులు చాలామందే ఉన్నారు. అయినప్పటికీ మిలటరీ హుంటాలపై విచారణ జరపాలని నిర్ణయించడం కొత్త అధ్యక్షుడి సాహస నిర్ణయమనే చెప్పాలి. విడేలాతో పాటు విచారణ ఎదుర్కోబోయే తొమ్మిది మంది కమాండర్లు ఈ విచారణే చట్టవిరుద్ధమనీ, 'ఉగ్రవాదాన్ని అణచడం'లో తాము యుద్ధ పరిస్థితిని ఎదుర్కొన్నామనీ, అంచేత సివిల్ కోర్టులో కాకుండా సైనిక న్యాయస్థానంలో విచారణ జరగాలనీ వాదించారు. మిలటరీ కోర్టు ఇందుకు ఒప్పుకోలేదు. కాబట్టి విచారణను చేపట్టాల్సింది సివిల్ కోర్టే. గత సైనిక పాలకుల నేరాలను రుజువుచేసే బాధ్యత చీఫ్ ప్రాసిక్యూటర్ హూలియో సీజర్ స్ట్రాస్సెరాపై పడింది. సినిమా అంతా స్ట్రాస్సెరా దృష్టికోణంలోంచి నడుస్తుంది. ఈ పాత్రను అర్జెంటీనా ప్రముఖ నటుడు రికార్డో డారిన్ చాలా అద్భుతంగా పోషించాడు. స్ట్రాస్సెరాకు కూడా ఈ కేసు అంతిమ ఫలితం ఎలా వుంటుందా అన్న అనుమానం ఉంది. తన కుటుంబ రక్షణ గురించిన చిన్నపాటి భయం కూడా వుంది. కానీ అతడి నిజాయితీ, కార్యదీక్షపై అనుమానాల్లేవు. దేశ చరిత్రనే మలుపు తిప్పగల ఈ కేసును జయించాలంటే, అతి తక్కువ సమయంలో బలమైన సాక్ష్యాధారాలు సంపాదించాలి. అందుకోసం అనుభవజ్ఞులైన సీనియర్ ప్రాసిక్యూటర్ల సహాయం కావాలి. కానీ ఎవరూ రిస్కు తీసుకుని అతనితో చేరడానికి ఇష్టపడడం లేదు. ప్రభుత్వం లూయిస్ మోరెనో ఓకాంపో (పీటర్ లంజానీ) అనే యువకుడ్ని అతడి డిప్యూటీగా నియమిస్తుంది. ఆ కుర్రాడికి అసలు అనుభవం లేదు. ఇదివరకెన్నడూ ఏ కేసునూ వాదించలేదు. పైగా అతడొక మిలటరీ పరివారం నుండి వచ్చాడు. విడేలా వెళ్లే చర్చికే అతడి తల్లీ వెళుతుంది. ఈ వివరాలు తెలిసిన తర్వాత స్ట్రాస్సెరాను ఓకాంపోపై బొత్తిగా ఆసక్తి పోతుంది. కానీ ఓకాంపో మాత్రం తన నిజాయితీని శంకించవద్దని స్ట్రాస్సెరాకు వేడుకుంటాడు. చివరికి వీరిద్దరూ

'సోమీ' అనే థియేటర్ మిత్రుడి సహాయంతో యువ లా గ్రాడ్యుయేట్ల బృందాన్ని ఎంపిక చేసుకుంటారు. ఈ యువకులకు అనుభవం లేకపోయినా, అన్యాయం చేసిన వారిని శిక్షించాలన్న పట్టుదల మాత్రం వుంది. ఈ లాయర్ల టీము దేశమంతా తిరిగి బెదిరింపులకు కూడా భయపడకుండా ఎలా సాక్ష్యాలనూ, సాక్షులనూ సంపాదించారు, చివరికి దోషులకు ఎలా శిక్షలు పడేలా చేశారన్నది మిగతా కథ. సినిమా అంతా ఉత్కంఠతో సాగే కోర్టు రూం డ్రామా.

ఫ్లాష్ బ్యాక్‌లో గతకాలంలో సాగిన టార్చర్ దృశ్యాలు చూపే అవకాశమున్నా అలాంటిదేం చేయలేదు దర్శకుడు. విట్నెస్ బాక్సులో బాధితులు చెప్పే వర్ణనలతోనే మన కంటతడిపెట్టిస్తాడు. యువ లాయర్ల టీము 17 వారాలు శ్రమించి 709 కేసుల సాక్ష్యాలను సంకలనం చేస్తారు. 280 మందిని కోర్టులో హాజరుపరుస్తారు. విడివిడి నేరాలు ఏవి కూడా కింది స్థాయి ఉద్యోగులు చేసిన అతిచర్యలు కావనీ, పై అధికారుల ఆదేశాల మేరకు ఒక పథకం ప్రకారం జరిగిన నరమేధంలో భాగమనీ రుజువు చేస్తారు లాయర్లు. ఫోన్లపై బెదిరింపులూ, కోర్టులో బాంబు వుందన్న బెదిరింపుల మధ్య విచారణ చాలా ఆసక్తిగా సాగుతుంది. విచారణలో సాక్షులూ, బాధితులూ వినిపించే కథనాలు రేడియో, టీవీల్లో ప్రసారమౌతూ వుంటాయి. అర్జెంటీనా ప్రజలంతా ఈ కేసు వివరాలను వింటూ, అంతిమ తీర్పు కోసం ఎదురుచూస్తుంటారు.

ఈ సినిమా నిండా కళ్ల నీళ్లు పెట్టించే దృశ్యాలెన్నో వున్నాయి. ఒక బాధితురాలు తనను నిండు గర్భిణీగా వున్నప్పుడు ఎలా బంధించి తీసుకెళ్లారో, ప్రసవిస్తున్న సమయంలో తనను ఎలా కాలిబూటు కింద తొక్కిపెట్టి వుంచారో, తను ఎంత కష్టం మీద తన అండర్‌వేర్ తొలగించిందో, పుట్టిన పసికందు బొడ్డుతాడుతో సహా ఎలా కిందికి వేలాడిందో, ఆ బిడ్డను ఆ దుర్మార్గులు చల్లని మార్బుల్ బెంచీ మీద పెట్టగా ఆ బిడ్డ ఎలా ఏడ్చిందో, బిడ్డను చూస్తానన్నా కళ్లగంతలు విప్పకుండా ఎలా హింసించారో, పచ్చి బాలింత అయిన తన చేత గది మొత్తాన్ని ఎలా శుభ్రం చేయించారో చెబుతుంటే కోర్టులో వింటున్న వారితో సహా మనకూ కన్నీళ్లు కూడా ఆగవు. రేడియోలో ఈ కథనాన్ని విన్న ఓకాంపో తల్లిలో హృదయ పరివర్తన జరుగుతుంది. 'మిలటరీ పాలనే కరెక్టని నేను గతంలో అనుకున్నాను. కానీ వారు నేరస్తులు అని నేనిప్పుడు మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను. ఒక గర్భిణీ స్త్రీతో వారలా ఎలా ప్రవర్తించగలిగారు?' అని కేసు పనుల్లో బిజీగా వున్న తన కుమారుడికి ఫోనుచేసి ఆ తల్లి చెబుతుంది. నిజమే, వాస్తవాలు తెలీని చాలా మంది నియంతల్ని అలానే గుడ్డిగా సమర్థిస్తుంటారు. 'ది నైట్ అఫ్ ది పెన్సిల్స్' బాధితుడొకడు ఎలక్ట్రిక్ షాక్ తిన్న చాలా రోజుల వరకు తను నీరు త్రాగలేకపోయే వాడినని చెబుతాడు. డిటెన్షన్ సెంటర్ నుండి మాయమైన తన ప్రేయసి గురించి కూడా చెబుతాడు. "నువ్వు బయటికి వచ్చాక మనిద్దరం భార్యాభర్తలుగా కలిసి బతుకుదాం అని నేను నా ప్రేయసితో అన్నప్పుడు, నన్ను ఇంటారాగేట్ చేసిన వారు నన్ను విపరీతంగా రేప్ చేశారు. నీకివ్వడానికి నా దగ్గరేమీ మిగల్లేదు. ప్రతి కొత్త సంవత్సరం రోజూ నువ్వు నన్ను గుర్తుచేసుకుంటే చాలు అని ఆమె నాతో అంది" - అన్న మాట విన్నపుడు 'ది నైట్ అఫ్ ది పెన్సిల్స్' సినిమాలోని దృశ్యం గుర్తొస్తుంది మనకు.

కథ ముగింపు దశకు వస్తున్న తరుణంలో దేశాధ్యక్షుడు స్ట్రాస్సెరాను వ్యక్తిగతంగా కలిసి అతడు వినిపించబోయే క్లోజింగ్ ఆర్గ్యుమెంట్ కోసం తానెంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నట్టు చెబుతాడు. ఈ సంగతిని విన్న స్ట్రాస్సెరా భార్య 'దీన్నే సెపరేషన్ ఆఫ్ పవర్స్ అంటారు కదా? నా భర్త తలతిక్క నాస్తికుడు మాత్రమే అనుకున్నాను గానీ, అతనొక నేషనల్ హీరో అని ఇప్పుడే గ్రహించాను' అని తన భర్తతో అన్న దృశ్యం కూడా గుర్తుండిపోయేలా చిత్రించాడు దర్శకుడు. నాస్తికుడైన స్ట్రాస్సెరా మానవత్వం గురించీ, అర్జెంటీనా భవిష్యత్తు గురించీ గంభీరమైన తన చివరి ఆర్గ్యుమెంట్ వినిపిస్తుంటే ప్రధాన నేరస్థుడైన విడేలా కోర్టులో బైబిల్ చదువుతూ దొంగచూపు చూస్తుంటాడు. "Nunca mas (Never Again) - మానవత్వంపై మాయని మచ్చలాంటి ఆ దమనచర్యలు 'ఇంకెన్నడూ వద్దు' అని నేడు అర్జెంటీనా ప్రజలంతా అంటున్న మాటలతో నా వాదనను ముగిస్తాను" అని స్ట్రాస్సెరా తన మాటల్ని ముగించిన తర్వాత కోర్టు హాలంతా చప్పట్లతో మార్మోగుతుంది. ఈ దృశ్యంలోనే కాక, సినిమా ఆఖర్లో కూడా ఒరిజినల్ ఫుటేజీనీ, ఫొటోలనూ చూపిస్తాడు దర్శకుడు. సినిమా కలర్ టోన్, యాస్పెక్ట్ రేషియో ఆ కాలాన్ని సూచించే విధంగా వుంచారు. జేవియర్ హూలియా సినిమాటోగ్రఫీ, పెడ్రో ఒసూనా సంగీతం అద్భుతంగా ఉన్నాయి.


ఇటువంటి సినిమా ప్రపంచ ప్రజలకిచ్చే సందేశమెంత గొప్పదో తెలుసుకోవాలంటే ఈ సినిమా ప్రథమార్థంలోని ఓ దృశ్యాన్ని గుర్తుచేసుకోవాలి మనం. కేసును ఒప్పుకునేదా లేదా అనే మీమాంసలో ఉన్న స్ట్రాస్సెరా తన సీనియర్ మిత్రుడి సలహా కోసం వారింటికి వెళతాడు. "చూడు స్ట్రాస్సెరా, చరిత్రలో కొన్ని సార్లు చాలా తక్కువ సమయం కోసం కొన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. చప్పున తలుపులు తెరుచుకుని వెంటనే మూసుకుంటాయి. నువ్వు చాలా లాఘవంగా తలుపులు తెరుచుకున్నంతనే లోపలికి దూరాలి. అర్జెంటీనా చరిత్రను మార్చే సువర్ణావకాశం నీకు దొరికింది. జారవిడుచుకోకు." అని చెబుతాడు ఆ సీనియర్ మిత్రుడు. స్ట్రాస్సెరా ఆ అవకాశం వినియోగించుకోవడంతో ఇద్దరు నియంతలకు జీవిత ఖైదు పడింది. మరి కొందరికి కొన్నేళ్ల జైలు శిక్ష దొరికింది. కోర్టు తీర్పు పూర్తిగా సంతృప్తి నివ్వకపోయినా, ఈ తీర్పు అర్జెంటీనా చరిత్రను మాత్రం మలుపు తిప్పింది. ప్రజల అప్రమత్తత పెరిగింది. ఆనాటి నుండీ ఈనాటి వరకూ మరెన్నడూ ఆ దేశంలో సైనికపాలన రాలేదు. ప్రజాస్వామ్యం ఇప్పటికీ సజావుగా సాగుతోంది. 'కరోనా తర్వాత మితవాద శక్తులు మన దేశాలన్నింట్లోనూ తలెత్తుతున్నాయి. మనం మన సంస్థలను మళ్లీ ఫాసిస్టులు ఆక్రమించకుండా కాపాడుకోవాలి" అని అర్జెంటీనా ప్రస్తుత అధ్యక్షుడు అల్బర్టో ఫెర్నాండేజ్ ఇటీవల జరిగిన లాటిన్ అమెరికా, కేరీబియన్ దేశాల సదస్సులో అన్నాడు. చరిత్ర నుంచి గుణపాఠం నేర్చుకున్న వ్యక్తులే ఇటువంటి హెచ్చరికలు చేయగలరు.

మనదేశంలో లిబరల్ డెమాక్రసీకి కూడా చివరి గడియలు దాపురించాయని ఇటీవలి పరిణామాలు చెబుతున్నాయి. ఈ చారిత్రక పరిణామాన్ని అర్థం చేసుకుని ఉన్న ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోడానికి ప్రతిపక్షాలన్నీ, ప్రగతిశీల శక్తులన్నీ ఒక చోటికి చేరుతాయా లేక పూర్తి నియంతృత్వం కోసం దారిని సుగమం చేస్తాయా అన్నది వేచిచూడాలి.

**(ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్‌లో అందుబాటులో వుంది. హిందీ ఆడియోతో చూడవచ్చు. డబ్బింగ్ క్వాలిటీ బాగుంది.)**

## సాహిత్య సాంస్కృతిక సామాజికాంశాలు

# అణ్వాయుధాలను వ్యతిరేకించిన జపాన్‌కు చెందిన నోబెల్ సాహిత్య బహుమతి గ్రహీత కెంజాబురో ఓయ్ (Kenjaburo Oe) మరణం



**1994లో** నోబెల్ సాహిత్య పురస్కారం అందుకున్న జపాన్‌కు చెందిన కెంజాయిరో ఓయ్ తన 88వ యేట 03-03-2023న మరణించారు. ఆయన షికాకు ద్వీపంలోని డీసే గ్రామంలో 31-1-1935న పుట్టారు. ఆయన 10వ యేట తండ్రి మరణించగా తల్లి సంరక్షణలో పెరిగారు.

ఆయన టోక్యో విశ్వ విద్యాలయంలో ఫ్రెంచి సాహిత్యం ఒక అంశంగా గ్రాడ్యుయేట్ డిగ్రీ చదివారు. రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ ఓడిపోయేనాటికి ఆయన 10 ఏళ్ళ బాలుడు. వీరి ఇంటికి 100 మైళ్ళ దూరంలో అగస్టు 6, 1945న హిరోషిమాపై అణుబాంబును అమెరికా వేసింది. అగస్టు 9, 1945న నాగసాకిపై బాంబును ప్రయోగించింది. జపాన్ 15 అగస్టున లొంగిపోయింది. బాలునిగా ఆ బాంబుదాడులు సృష్టించిన విధ్వంసాన్ని చూసి విచలితుడౌతాడు. ఆ తర్వాత రచయితగా తను రాసిన 12 నవలల్లోనూ రెండే రెండు అంశాలు వస్తువుగా వున్నాయి. మొదటిది అణ్వస్త్ర వ్యతిరేకత, రెండవది వికలాంగుడైన తన కొడుకు గురించి, మెదడు దెబ్బతిన్న కొడుకు హికారి పాత్రగా ఆయన కొన్ని నవలలు రచించారు.

2013లో టోక్యోలో అణ్వస్త్ర వ్యతిరేక ప్రదర్శనను ఆయన నిర్వహించారు. యుద్ధానికి వ్యతిరేకంగా, శాంతిని చాటుతూ రాసుకున్న జపాన్ రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నించిన ప్రధానమంత్రి షింజో ఏటన్‌ను వ్యతిరేకించారు. తన రాజ్యాంగంలో యుద్ధాన్ని వదలివేసినట్లు, అణువిద్యుత్ కేంద్రాలను కూడా రద్దుచేయాలన్నారు.

జపాన్ చక్రవర్తి ఇచ్చే ఆర్డర్ ఆఫ్ కల్చర్ బహుమతిని ఆయన తిరస్కరించారు. 'ప్రజాస్వామ్యంకంటే ఉన్నతమైన అధికారి - జపాన్ చక్రవర్తినైనా - నేను గుర్తించను. ఆ చక్రవర్తి చేతులమీదుగా ఇచ్చే పురస్కారాన్ని తిరస్కరిస్తున్నాను' అని ప్రకటించారు. మితవాదులు చంపుతామని ఎన్నిసార్లు బెదిరించినా ఆయన చెక్కుచెదరలేదు. ●

# 'హిందుత్వ'పై వ్యాఖ్యానం చేసిన కన్నడ నటుడు, సంఘ సేవకుడు చేతన్‌కుమార్ అరెస్టు

**కన్నడ** నటుడు చేతన్‌కుమార్ మార్చి 20న తన ట్విట్టర్ ఖాతాలో "హిందుత్వ అబద్ధాలపై నిర్మించినది", "దాన్ని సత్యం చేత ఓడించవచ్చు" అనీ, "రాముడు రావణుడిని వధించి అయోధ్యకు తిరిగి రావడంతో భారతదేశం అవతరించింద"ని చెప్పడం మరో అబద్ధమనీ, "యుడిరిగౌడ, నంజెగౌడలు టిప్పుసుల్తాన్‌ను వధించారనడం" ఇంకో అబద్ధమనీ వ్యాఖ్యానించారు.

బెంగుళూరు భజరంగ్‌దళ్ కన్వీనర్ శివకుమార్ దీనిపై పోలీసులకు ఆరోపణ చేయగా, దాని ఆధారంగా శేషాద్రిపురం పోలీసులు, దళిత, ఆదివాసీ, హక్కులకై పోరాడుతున్న కన్నడ నటుడు చేతన్‌కుమార్‌ను మార్చి 21న అరెస్టుచేసి జుడీషియల్ కస్టడీ విధించారు. రెండురోజుల తర్వాత 25,000 రూపాయల ధరావత్తు, ఒక సెక్యూరిటీతో చేతన్ కుమార్‌కు బెయిల్ లభించింది.

యురిగౌడ, నంజెగౌడలు వక్కలిగ కులంవారు. గత ఏడాది ఒక నాటకంలో టిప్పుసుల్తాన్‌ను ఈ కాల్పనిక పాత్రలు వధించినట్లుగా చిత్రీకరించారు. దీనిని రాబోయే ఎన్నికలలో ముస్లిములకు వ్యతిరేకంగా వక్కలిగ కులంవారిని సమీకరించడానికి బిజెపి వాడుకుంటోంది. నిజానికి టిప్పుసుల్తాన్ 1799లో బ్రిటిష్‌వారితో పోరాడుతూ నాల్గవ ఆంగ్లో మైసూరు యుద్ధంలో చనిపోయారని చరిత్ర చెబుతోంది.

ఈ బిజెపి ప్రచారాన్ని ముస్లిములు, వక్కలిగలు తిరస్కరించారు. ఈ అసత్య ప్రచారాన్ని ఆపకపోతే వక్కలిగ సంఘం ఆందోళన చేపడ్తుందని మార్చి 19న ప్రకటించింది.

గతంలో ఫిబ్రవరి 2022లో హిజాబ్‌పై తీర్పు ఇచ్చిన హైకోర్టు న్యాయమూర్తి కృష్ణాదీక్షిత్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యానించినందుకు చేతన్‌కుమార్ అరెస్టయ్యారు. అలాగే 'కాంతార' సినిమాలో "భూతకోలా' ఆచారం హిందూ ఆచారం కాదు. అది తులు భాష మాట్లాడే ప్రజల ఆచారం' అని వ్యాఖ్యానించారు. ●

స్పందన

# కార్పొరేటు విద్యకు జోహుకుం.... 'సార్'

- ఓ.వి.వి.యస్.

**చాన్నాళ్ళకు** ఒక మంచి సినిమా చూశాం.... చదువు విలువ బొత్తిగా తెలియకుండాపోతున్న ఈ తరానికి చదువు ఔన్నత్యాన్ని తెలియజేసే మంచి సినిమా.... ఇత్యాది కామెంట్లు, లైకులు, షేర్లతో ఇటీవల వాట్సాపు యూనివర్శిటీని 'సార్' సినిమా మోత మోగించింది. ఇంటర్మీడియట్ విద్య అంటే ప్రభుత్వ ఇంటర్మీడియట్ విద్య చెదలు పట్టి హరించుకుపోతున్న వైనాన్ని, అటు ప్రభుత్వ అధ్యాపకుల నుండి ఇటు తల్లిదండ్రులు ఎలా నలిగిపోయారన్న అంశాలను బాగానే చూపించారు. కానీ కార్పొరేటు శక్తుల సామ దాన భేద దండోపాయాలకు తల వంచి ఎదిగి, తదుపరి అవసరమైనవారికి మీ వంతు సాయం చేయండనే హీరో సార్‌గారి పతాక సన్నివేశపు దిశానిర్దేశం దిగ్భ్రమ కల్పిస్తుంది. చదువును ర్యాంకులపాలు చేసి, ఆత్మహత్యల ఋతువులను విద్యార్థుల జీవితాలలో నింపుతున్న పరాధీన పాలక విధానాలను ఏ మాత్రమూ ప్రశ్నించని దర్శకుని ప్రతిభ ఆందోళన కలిగిస్తుంది. వ్యవస్థ దుర్నీతిని కనిపెట్టడం, ప్రశ్నించడం, మార్చేందుకు పూనుకోవడం వంటి విషయాల జోలికే పోకుండా, బుద్ధిగా చదువుకొని, ర్యాంకులు సంపాదించి, కార్పొరేటు శక్తులకు ఊడిగం చేయమనే ప్రతిపాదనకు ఒళ్ళు మండిపోతుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ మరియు శ్రీకర స్టూడియోస్ బ్యానర్ల సంయుక్త నిర్వహణలో, నాగవంశి, సాయిసౌజన్యలు నిర్మాతలుగా అట్లూరి వెంకీ దర్శకత్వంలో ఆన్లైన్లో ఫిబ్రవరి 17న, ఆఫ్‌లైన్లో మార్చి 17న విడుదలయ్యిందీసినిమా. కథానాయకుడైన ధనుష్ 2011లో జాతీయ ఉత్తమ నటుడు పురస్కారం పొందాడు. నటనే కాక నేపథ్య గాయకుడుగా, గీత రచయితగా కూడా ఇతను ప్రజ్ఞాశాలి.

సినిమాలోకి వెళితే.... మన నాటు నాటు తెలుగు సినిమా సంప్రదాయాన్నే పాటిస్తూ ఈ సినిమాలో కూడా హీరో ఫైటింగ్‌తోనే కథలోకి ప్రవేశిస్తాడు. దిగువ మధ్యతరగతికి చెందిన ఒక సాధారణ డ్రైవర్ కొడుకైన మన హీరో గొప్ప లెక్చరర్‌గా ఎదగాలని కోరుకుంటాడు. మన చైనా (చైతన్య, నారాయణ) వంటి కార్పొరేటు విద్యాసంస్థ అయిన త్రిపాఠీ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో 'సి' గ్రేడు లెక్చరర్‌గా పనిచేస్తూ ఉంటాడు. తన కుటుంబానికి ఫ్యామిలీ ఫ్రెండు అయిన అన్సారీ అనే రిటైర్డ్ ఉపాధ్యాయుడి నుండి స్ఫూర్తి పొందుతాడు. చదువు చెప్పటం ఉద్యోగం కాదు.... అది బాధ్యత. నువ్వు తీసుకునే జీతం కంటే నీ




విద్యార్థుల జీవితాలకు విలువ ఎక్కువంటూ అన్సారీ హీరోతో చెప్పిన మాటలు ప్రేక్షకులను బాగా కదిలిస్తాయి. కానీ సరళీకృత ఆర్థిక విధానాల వల్ల, ప్రైవేటైజేషన్ ఆఫ్ ఎకానమీ కారణంగా దేశ రాబడి (ఎవరికో?!....) బాగా పెరిగిందనీ, చదువనేది నిత్యావసరంగా మారిందనీ సినిమా కథకు నేపథ్యాన్ని వివరించడం చిరాకు తెప్పిస్తుంది. విద్య అంగడి సరుకుగా మారి, ప్రైవేటు కాలేజీల ఫీజుల దోపిడీ భరించలేనంతగా పెరిగిపోతుంది. దీనిని వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు ఆందోళన చేసిన ఫలితంగా ప్రభుత్వం ఫీజు రెగ్యులేషన్ బిల్లును పెట్టాలనుకుంటుంది. ఆ బిల్లు అమలైతే తమ దోపిడీకి గండి పడుతుందని గ్రహించిన త్రిపాఠీ ఆ గండం నుంచి గట్టెక్కేందుకు ఒక మాస్టర్ ప్లాన్ వేస్తాడు. దాని ప్రకారం కునారిల్లిపోతున్న ప్రభుత్వ ఇంటర్మీడియట్ కాలేజీలను ప్రైవేటు కాలేజీల యూనియన్ టేకోవర్ చేసుకుని కాపాడతానంటూ ముందుకొస్తుంది. ఈ ప్లాన్లో భాగంగానే గ్రామీణ ప్రాంతపు సిరిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మన హీరో పంపబడతాడు. తన టాలెంట్‌తో విద్యార్థులను కూడగట్టి, ప్రోత్సహిస్తూ మరల చదువుల బాట పట్టిస్తాడు.

Zero Fees Zero Education

More Fees More Education అనేది తన సక్సెస్ మంత్రంగా చెప్పే త్రిపాఠీ కళాశాలల ఉత్తీర్ణత 75%గా ఉండగా హీరో (బాలు) నిర్వహించి తీర్చిదిద్దిన సిరిపురం కళాశాల ఉత్తీర్ణత 100% వస్తుంది.

ఈ పరిణామం త్రిపాఠీ కన్నెర్రకు కారణమౌతుంది. దీంతో త్రిపాఠీ అధికార, ప్రతిపక్ష ప్రముఖులతో లాబీ చేస్తాడు. ప్రైవేటు కళాశాలలు, ప్రభుత్వ కళాశాలలను టేకోవర్ చేసుకోవడం వలన ప్రభుత్వ కళాశాలల్లో లెక్చరర్ల నియామకాలు ఆగిపోయాయని, తద్వారా నిరుద్యోగ సమస్య పెరిగిపోతుందని ఆందోళనలు చేయిస్తాడు. ప్రభుత్వమే టేకోవర్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే పరిస్థితి కల్పిస్తాడు. అనంతరం త్రిపాఠీ పెట్టిన శారీరక, మానసిక, సాంఘిక హింసలను తట్టుకొని హీరో బాలు విద్యార్థులను ఎలా ర్యాంకర్లుగా మార్చాడన్నది తెరమీద చూడాలి.

విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం పెట్టి, అబ్దుల్ కలాంగారిని రోల్ మోడల్‌గా చూపిస్తూ మోటివేషనల్ స్పీచ్ ఇచ్చేస్తే.... కుటుంబ అవసరాల రీత్యా ఆయా పనులలో తమ భాగస్వామ్యాన్ని తెంచుకుని, పరుగులు పరుగులుగా పిల్లలు కాలేజీకి వచ్చేస్తారా?!.. భౌతికశాస్త్రపు రెండు సారూప్య అంశాలైన Speed మరియు Velocity అంశాలను తరగతి గదిలో కులపరమైన పట్టింపులకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు వాడుకున్న తీరు బాగున్నప్పటికీ కుల భావనను పెరికివేయడం పంచ్ డైలాగ్ వేసినంత సులభమా?!.. నిజానికి కులవివక్ష పట్ల విద్యార్థులకు వ్యతిరేక చైతన్యాన్ని కలిగించేందుకు వేలాదిమంది ఉపాధ్యాయులు తమ బోధన ద్వారా, తరగతి గది సన్నివేశాల ద్వారా కృషిచేస్తూనే ఉన్నారు. కానీ వారి కృషికన్న ఎన్నో రెట్లు బలమైన ఫ్యూడల్ సంస్కృతి, దానికి అండనిస్తున్న సామ్రాజ్యవాద సంస్కృతి కలిసి కులవివక్షను కాపాడుతూ, పెంచి పోషిస్తున్నాయి. చరిత్ర పొడుగునా, వర్తమానంలోనూ దళితులపై అమలౌతున్న దాష్టీకాలు మనకు తెలిసినవే కదా!.. సినిమా సగంలో విలన్ త్రిపాఠీ పెట్టే బాధలు భరించలేక హీరో బాలు యింటికి వెళ్ళిపోతాడు. అక్కడికి హీరోయిన్ వెళ్ళిన సందర్భం అత్యంత చౌకబారుగా, నేలబారుగా ఉంటుంది. మొదట సేల్సు గర్లా?!.. అని హీరో తల్లి అడుగుతుంది. తర్వాత తన కొడుకు అంటే బాలు సార్ కడుపు చేశాడా?!.. అని ఆ తర్వాత ఇంకా ముందుకెళ్ళి ఆయ్యో.. చేయలేదా?!.. అంటూ కుసింత కామెడీ పేర లేకిగా ప్రవర్తించడం వీళ్ళు ప్రతిపాదించే విలువలలో కూడా జెండర్ వివక్షను చూపుతుంది. అలాగే ఎంట్రన్స్ పరీక్షకు బస్సులో విద్యార్థులను తీసుకెళ్ళే సందర్భంలో సుబ్రహ్మణ్య భారతి గెటప్‌లో త్రిపాఠీ మనుషులతో పోరాటం చేయడం ఎబ్బెట్టుగా అనిపిస్తుంది. కానీ బళ్ళపై ధాన్యం బస్తాలు వేసుకొని అటుగా వస్తున్న రైతన్నలు దిక్కుతోచని విద్యార్థులను పరీక్ష హాలుకు తీసుకెళ్ళడం గొప్ప రిలీఫ్‌గా ఉంటుంది.

విద్యావ్యవస్థలోని లోపాలను చర్చిస్తూ గతంలో కూడా కొన్ని సినిమాలు వచ్చాయి. 2007లో వచ్చిన 'తారే జమీన్ పర్' సినిమా డిస్లెక్సియా అనే సమస్య గల పిల్లలను మెయిన్ స్ట్రీమ్‌లోకి తెచ్చేందుకు విద్యావిధానం కూడా ఎదగాలని సూచించింది. 2018లో వచ్చిన 'హిచ్‌కీ' అనే హిందీ సినిమా ఒక నరాల సంబంధ వ్యాధితో బాధపడే వ్యక్తి కూడా మంచి ఉపాధ్యాయునిగా రాణించగలదంటూ ఓ మంచి సినిమాగా వచ్చింది. వైయక్తిక లోపాల నేపథ్యం నుండి వ్యవస్థీకృత లోపాలను ఈ సినిమాలు చర్చించాయి. చదువుకునే అవకాశం దక్కక, తీవ్ర మనోవేదనతో ప్రాణత్యాగం చేసే విద్యార్థి కథతో ఎప్పుడో 'జెంటిల్‌మేన్' సినిమా వచ్చింది. ఇంకా అవకాశం దక్కని ఆర్థికస్తోమత చాలని విద్యార్థులకు రహస్యంగా ప్రత్యామ్నాయ మార్గాలలో బోధిస్తూ, చదువు మౌలిక లక్ష్యాలను చర్చకు పెట్టిన 'శక్తి' వంటి సినిమాలు వచ్చాయి. ఇంకా హిందీ మీడియం, సూపర్ 30, 'జనగణమన' వంటి సినిమాలు అందరికీ చదువుకునే అవకాశం లేకపోవడం, కోచింగ్‌సెంటర్ల మాయాజాలం, కుల మత లింగ వివక్షలతో అందవలసిన అవకాశాలను నీరుగార్చడం వంటి అనేక సమస్యలను అద్దంపట్టి చూపాయి.

సినిమాలో ప్రస్తావించని విషయాలను తడమకూడదంటారుగానీ, కొన్ని విషయాలను ఆలోచించకుండా ఉండలేము. పాలకుల పుణ్యాన 90లనాడు భారతదేశంలో ప్రవేశించిన సరళీకృత ఆర్థిక విధానాలు విద్యారంగాన్నీ పెనుమార్పులకు గురిచేశాయి. కార్పొరేటుశక్తుల ప్రయోజనాలకు అనుగుణంగా, తమను తాము దోపిడీకి గురయ్యేవారిగా విద్యార్థులను మలిచే కార్యక్రమం ఊపందుకున్న దశ. విప్లవకవి ఛాయరాజ్ అన్నట్లు "భాషంటే ఇంగ్లీషే.... చదువంటే యింజినీరింగూ, మెడిసన్లే.... పరీక్షంటే ఎమ్‌సెట్టే.." అనేంతగా సమాజాన్ని పక్కదారి పట్టించే క్రమం మొదలైన సమయమది. అటు తమ బిడ్డల బంగారు భవిష్యత్తు గల తల్లిదండ్రుల స్తోమతకు మించినదిగా మారిపోవడం.... ఇటు బిడ్డల బతుకులు, ర్యాంకుల ఒత్తిళ్ళ వధ్యశిలలకు ఎరలైపోవడం మొదలైపోయింది. ఒత్తిళ్ళ ఉక్కపోతలో దిక్కుతోచని విద్యార్థులు ఆత్మహత్యల బాట పట్టడం, జాతి భవిష్యత్తుకు పెనుముప్పు కలిగించే పరిణామం. 2021లో జాతీయ నేర గణాంక సంస్థ విద్యార్థుల మరణాలను 13089గా నమోదు చేసింది. అంటే మనదేశ విద్యావిధానాలు ప్రతి రెండు గంటలకూ ముగ్గురు విద్యార్థులను బలితీసుకుంటున్నాయన్నమాట. విద్యావిధానం గురించిన మంచి సినిమా అనగానే, ఇలాంటి అపసవ్యతల మీద చర్చించిన లేదా ప్రశ్నించిన సినిమా అనుకునేవారికి నిరాశే మిగులుతుంది. విద్యావిధానం ఇతివృత్తంగా గతంలో వచ్చిన మంచి సినిమాలు విద్యావిధానంలోని సవ్యాపసవ్యతలపై ఎంతోకొంత చర్చ పెట్టాయి. కానీ 'సార్' సినిమా మాత్రం ర్యాంకు సాధించడమే విద్య పరమావధిగా చూపుతూ తీసిన సినిమా. ప్రచారంలో చూపినట్టు ఇది కార్పొరేటు విద్యావిధానంపై ఎక్కుపెట్టిన బాణం కానేకాదు. కార్పొరేటు విద్యకు అనుకూలంగా ప్రజల మెదళ్ళపై వదిలిన బాణం.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి అనుగుణంగా పెద్దఎత్తున యంత్ర సమానమైన.. నోరెత్తకుండా పనిచేసుకుపోయే శ్రామికశక్తిని ఉత్పన్నం చేయాలనే లక్ష్యంతో సరళీకృత ఆర్థిక విధానాలు దేశంలో కాలుమోపాయి. ఆ లక్ష్యానికి అనుగుణంగానే ప్రశ్నించని తరాన్ని తయారుచేసే పనిని విద్యావిధానాలు తీసుకుంటున్నాయి. సరిగ్గా ఇందుకు అవసరమైన మైండ్‌సెట్‌ను రూపొందించే క్రమంలో.. దానికి సాంఘిక అంగీకారం కుదిర్చే పనిలో 'సార్' లాంటి సినిమాలు వస్తున్నాయి.

# చైతన్యవాహిని

**తేది. 23-3-2023** సాయంత్రం పిఎస్ఎన్ఎమ్ హైస్కూల్ శ్రీకాకుళం నందు జనసాహితి, శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురు వర్ధంతిసభ జరిగింది. ఈ కార్యక్రమానికి జనసాహితి జిల్లాకార్యదర్శి పి. మోహన్‌రావు అధ్యక్షత వహించారు. జనసాహితి జిల్లా శాఖ అధ్యక్షులు కె. భానుమూర్తి సభను ఉద్దేశించి మాట్లాడుతూ – "భగత్సింగ్‌లో జాతీయ భావాలు తాను పుట్టిన కుటుంబ నేపథ్యం నుండి వచ్చాయని, 1919 ఏప్రిల్ 13న జరిగిన జలియన్ వాలా బాగ్ మారణకాండ 12 ఏళ్ల తనపై తీవ్ర ప్రభావం చూపిందని, అదే బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటానికి దారితీసిందని, గొప్ప దేశభక్తునిగా చివరి వరకు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేసిన ధీశాలి భగత్‌సింగ్" అని తెలిపారు. భగత్‌సింగ్ రచనలైన 'దేవుడు, మతతత్త్వం', 'అస్పృశ్యత', 'నేనెందుకు నాస్తికుడను' మొదలగు వాటిని విద్యార్థులకు యువతకు పరిచయం చేయాల్సిన కర్తవ్యం మనపై ఉందని, భగత్‌సింగ్ స్ఫూర్తితో కదలాడాలని సభికులను కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా "సమకాలీన రాజకీయ అంశాలు– భగత్సింగ్ నేపథ్యం" అనే అంశంపై 'ప్రజాసాహితి' సంపాదకుడు నాగరాజు మాట్లాడుతూ – "నాటి భగత్‌సింగ్ కాలం నాటి బ్రిటిష్ సామ్రాజ్యవాద దోపిడీకి అనేక రెట్లు నేడు పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద దోపిడి జరుగుతోందని, అణువణువున సాంస్కృతిక విధ్వంసం జరుగుతుందని, దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు గడిచినా దాని ఫలాలు పేదలకు అందలేదని, భగత్‌సింగ్ కోరుకునే సామ్యవాద సమాజం కోసం నేటి యువత విద్యార్థులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసాహితి సభ్యులు చావలి శ్రీనివాస్, దాసరి రామ్మోహన్‌రావు, నవీన్ కుమార్, చింతాడ తిరుమలరావు, చరణ్ పాత్రో, విశ్వనాథం, ఎర్రమ్మ మొదలగువారు పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి హాజరైన యువత, విద్యార్థులు, ఉపాధ్యాయులు చర్చలో పాల్గొన్నారు. కంచరాన భుజంగరావు వందన సమర్పణ గావించారు.

## ప్రముఖ రచయిత్రి రామలక్ష్మి ఆరుద్ర మృతి



**ప్రముఖ** రచయిత్రి కె. రామలక్ష్మి 92 ఏళ్ల వృద్ధాప్యంలో 2023 మార్చి 3న హైదరాబాద్‌లోని తన నివాసంలో మృతి చెందారు. ఆమె 1930 డిసెంబర్ 31న తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కోటనందూరు గ్రామంలో పుట్టారు. మద్రాసు విశ్వవిద్యాలయం నుండి బి.ఏ. పట్టా పొందారు. 1954లో ప్రముఖ కవి, సాహిత్య విమర్శకుడు, సినీ రచయిత ఆరుద్రను వివాహం చేసుకున్నారు.

1951 నుండి తెలుగు సాహిత్య రంగంలో కృషి చేస్తూ ప్రత్యేక గుర్తింపును పొందారు. తెలుగు 'స్వతంత్ర' పత్రికలో ఇంగ్లీషు విభాగం ఉపసంపాదకురాలుగా పనిచేశారు. మహిళా సంక్షేమ సంస్థలకు సేవలు అందించారు.

ఆమె రాసిన మొదటి నవల – 'విడదీసే రైలు బళ్ళు'. 'కరుణ కథ', 'లవంగి', 'నీదే నా హృదయం', 'ఒక జీవికి స్వేచ్ఛ' మొదలైన కథా సంపుటాలను వెలువరించారు.

మద్రాసు విశ్వవిద్యాలయం మహిళా ప్రతిష్ఠాత్మక అవార్డు 'గృహలక్ష్మి స్వర్ణ కంకణం' పొందారు. నంది అవార్డులతో సహా ఎన్నెన్నో పురస్కారాలు కూడా పొందారు. సినిమా రచయితగా కూడా కృషి చేశారు. 'ఆరుద్ర సినీ గీతాలు' అనే సంపుటాలను సంకలనం చేశారు. సెన్సార్ బోర్డు సభ్యురాలుగా కూడా కృషి చేసారు.

రచయిత్రిగా, పత్రికా రచయితగా, సాహితీ వేత్తగా, అనువాదకురాలిగా తనదైన రీతిలో కృషిచేశారు.

## పెరుగు ఉద్యమం

– చెన్నుపాటి రామాంజనేయులు

(తమిళనాడులో ఇటీవల కేంద్ర ప్రభుత్వం పాల ప్యాకెట్‌పై ఇంగ్లీష్ పదం curdతో పాటు హిందీ పదం "దహి" అని కూడ ముద్రించమని సర్క్యులర్ జారీ చేసింది. దానికి అంగీకరించని తమిళనాడు ప్రజలు ఉద్యమం చేపట్టారు. కేంద్రం దిగి వచ్చి ఉపసంహరించుకొంది)

పెరుగుచుండె తమిళనాట పెరుగు పోరు
జరుగు నుద్యమమీవేళ పెరుగు బదులు
"దహి"యనుచును ముద్రింపగ ద్రవిడ జనులు
హింది పదమది వలదనె చెంది కలత!
ఆధిపత్య ధోరణి తోడ ఆదినుండి
హింది రుద్దబోవుచు నుండె తొందరపడి
త్రిప్పికొట్టుచు నుండిరి తిరుగుబాటు
ఉద్యమాలు తమిళనాట ఉధృతమయ్యె!

# ఈ పుస్తకాలు అందాయి

**మానవవాద మార్గం : సూక్తులు, సందేశాలు, సహేతుక ప్రశ్నలు, సామెతలు, పద్యాలు, గేయాలు.** రచన, సేకరణ, సంకలనం : **పెన్మత్స సుబ్బరాజు**

సూక్తులూ, సామెతలు, సందేశాలు, ప్రశ్నలూ, అపార జ్ఞాన సంపదను సూక్ష్మరూపంలో వెల్లడిస్తాయి. అనేక దేశాల రచయితలు హేతుబద్ధ వ్యాఖ్యానాలు మొత్తం 6505 సేకరించి, వాటిని ఐదు భాగాలుగా విభజించి ఇచ్చారు. అవి 1. వ్యక్తి – వ్యక్తిత్వం – సమాజం; 2. సైన్సు – మతం; 3. మతం – మూఢనమ్మకాలు; 4. మతం – ఆస్తికత్వం – అజ్ఞేయవాదం – నాస్తికత్వం – హేతువాదం – మానవవాదం; 5. బైబిలు – క్రైస్తవం; 6. సామెతలు; 7. పద్యాలు – గేయాలు.

మొదటి 5 భాగాలలో వివిధ దేశాలకు చెందిన రచయితలు, చరిత్రకారులు, సామాజికవేత్తలు, తాత్వికులు మొదలైనవారు మతంపైనా, మూఢవిశ్వాసాలపైనా, వ్యక్తిత్వంపైనా, సమాజంపైనా చేసిన వ్యాఖ్యానాలున్నాయి. ఆరవ భాగంలో విజ్ఞానదాయకమైన 175 సామెతలున్నాయి. ఏడవ భాగంలో లబ్ధ ప్రతిష్ఠులైన హేతువాద, నాస్తికవాద, భౌతికవాద రచయితలు, మేధావులు ఐన వేమన, త్రిపురనేని, జాషువా, జ్వాలాముఖి మొదలైనవారు రాసిన పద్యభాగాలేగాక కొత్తగా రాస్తున్న రచయితలు గోపు చంద్రరావు, సుబ్బరాజు, పి. నాసరయ్య, గణేశ్వరం బాబూరావు, ఇసనాక మురళీధర్, ఆకురాతి గోపాలకృష్ణ, చందోలు మహబూబ్ సుబహాని షేక్, చేగిరెడ్డి చంద్రశేఖరరెడ్డి, డా॥ మలయశ్రీల రచనలు కూడా వున్నాయి.

ఈ సూక్తులలో అక్కడక్కడా కొన్ని అశాస్త్రీయమైనవి చోటు చేసుకున్నాయి. ఉదాహరణకు 1). 25వ పుటలో 251. ఎవరి ఇల్లు వారు చక్కబెట్టుకుంటే దేశం బాగుపడినట్లే! 2). 36వ పుట 536 స్వీయ కుటుంబంలో విఫలమైన వ్యక్తి, ఎన్ని విజయాలు సాధించినా వ్యర్థమే! కొన్ని సూక్తులు సమకాలీన సమాజానికి సంబంధించినవి వున్నాయి. ఉదాహరణకి (1) 61వ పుట 413. మీ డెస్క్‌టాప్ మీద ఒక పిడిఎఫ్ ఫైల్‌ను ప్రార్థనతో సేవ్ చెయ్యగలరా? (2). 85వ పుట 471. 13వ నంబరు పట్ల వున్న భయంతో పిఎస్ఎల్‌వి–12 తరువాత పిఎస్ఎల్‌వి–14 ప్రయోగించినప్పుడే, ఇస్రో శాస్త్రవేత్తలు తమ ప్రతిష్టను కోల్పోయారు. (3). 107వ పుట 436 ఒకపక్క చైనా రోబో టెక్నాలజీ, కృత్రిమ మేధ, యంత్రరంగాల్లో ఎదుగుతూ వుంటే, మనం మాత్రం గుళ్ళూ, గోపురాలు అంటూ కాలాన్ని వృథా చేస్తున్నాం! (4) 106వ పుట 409 గాడ్‌బ్లెస్‌యూ అనడంకంటే, గూగుల్ బ్లెస్‌యూ అనడం అర్థవంతంగా వుంటుంది.

శాస్త్రీయ ఆలోచనావిధానాన్నీ, శాస్త్రీయ భావాల్నీ ప్రచారం చేసే వారందరికీ ఉపయోగపడే విజ్ఞాన సర్వస్వం ఈ పుస్తకం.

(మానవ మార్గం.... కూర్పు : పి. సుబ్బరాజు. 1/4 డెమ్మీ 328 పుటలు. వెల : రూ. 500/- ప్రథమముద్రణ : డిసెంబరు 2022. జనవిజ్ఞానవేదిక, చార్వాక ప్రచురణల సంయుక్త ప్రచురణ. ప్రతులకు : పి. సుబ్బరాజు 1–122, చార్వాక భవనం, జిన్నూరు – 534265. పోడూరు మండలం, పశ్చిమగోదావరిజిల్లా. ఫోన్ : 9491184911.)

**ఆచార్య ఎన్.జి.రంగ :** ఇంగ్లీషు కూర్పు : జొన్నలగడ్డ రామారావు. తెలుగు : కందిమళ్ళ శివప్రసాద్

మొదట్లో దోపిడీ ముఠాల చేత, ఆ తర్వాత రాజులచేత, జమీందారుల చేత, విదేశీ స్వదేశీ పాలకుల చేత దోపిడీకి గురౌతూ వస్తున్న వ్యవసాయ రంగం గురించి ఒక ముందుమాట రాసిన రామారావు, ఈ పుస్తకంలో 'భారత రైతాంగ ఉద్యమ పిత'గా 'ది హిందూ' ఆంగ్ల దినపత్రికచే ప్రశంసించబడిన ఆచార్య ఎన్.జి.రంగ జీవితంలోని ముఖ్యఘట్టాలను క్లుప్తంగా ఇచ్చారు.

ఎన్.జి.రంగ 1920–23 సంవత్సరాలలో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రుడై 1924–26తో భారతదేశ ఆర్థికవ్యవస్థపై పరిశోధన చేశారు. 1923లో కాంగ్రెసు పార్టీలో చేరారు. మజ్దూర్ రాజ్ సంస్థ ద్వారా ఆయన రైతాంగ స్థితిగతులపై పలు రచనలు చేశారు. వ్యవసాయ రుణాలపై ఆరేళ్ళపాటు మారిటోరియం ప్రకటించాలని తెనాలిలో జూన్ 5, 1931న జరిగిన రైతుల సభలో డిమాండ్ చేశారు. బ్యాంకుల జాతీయకరణను సమర్థించారు. జమీందారీ వ్యవస్థపై నిర్విరామ పోరాటం చేసిన యోధుడు. భూదాన్ గ్రామదాన్‌లను వ్యతిరేకించారు. సామాజిక న్యాయం కోసం కృషిచేసిన సంస్కర్త.

ఈ చిన్న పుస్తకంలో రంగ స్థాపించిన కృషికార్‌లోక్ పార్టీ, స్వతంత్ర పార్టీల గురించి ప్రస్తావనే లేదు. అలాగే ఆయన పుట్టిన తేదీ, మరణించిన తేదీ వివరాలు లేవు. ఒక విహంగ వీక్షణంగా ఆయన కృషి గురించి రచయిత వివరించారు. చివరిపేజీలలో ఆనాటి వార్తాపత్రికలలోని వార్తలు, ఫొటోలు పొందుపరిచారు. ఆఖరిపేజీలో రంగ రాసిన 61 పుస్తకాల జాబితా www.ngranga.in అనే వెబ్‌సైట్ నుంచి ఇచ్చారు.

ఈ పుస్తకం ప్రచురణకర్త కొల్లి సాంబశివరావు. కృషికార్ సేవాసమితి, గుంటూరువారి ప్రచురణ. 1/8 క్రౌన్‌లో 56 పుటలు. వెల : రూ.40/- ప్రథమముద్రణ : అక్టోబరు 2022. ప్రతులకు : నల్లూరి రాంబాబు, ఉంగుటూరు, అమరావతి మండలం, పలనాడు జిల్లా – 522016. ఫోన్ : 94916 17555.

**జీవని :** సాహిత్య విమర్శ. వ్యాస సంపుటి. రచయిత : డా॥ పి. సంజీవమ్మ

రచయిత్రి సంజీవమ్మ అనంతపురం జిల్లాకు చెందినవారు. కడప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలుగా పనిచేశారు. ఆ తర్వాత వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేసి ప్రిన్సిపల్‌గా అనంతపురంజిల్లా కల్యాణదుర్గం కళాశాలలో ఉద్యోగ విరమణ చేశారు.

1974లో అభ్యుదయ రచయితల సంఘంతో అనుబంధం ఏర్పడి, వివిధ హోదాలలో పనిచేసి ఇప్పుడు అరసం, ఆంధ్రప్రదేశ్‌కు గౌరవ అధ్యక్షురాలిగా వున్నారు. తన డాక్టరేట్ కోసం 'తెలుగు నవలలో సామాజిక చైతన్యం' అనే అంశంపై సిద్ధాంత గ్రంథం రాశారు. 2004లో 'సాహిత్య విమర్శ వ్యాసాలు', ఇప్పుడు 2023లో 'జీవని' ప్రచురించారు.

'నా సాహిత్యజీవితం నాకు తృప్తిగా వుంది' అంటున్న 80 ఏళ్ళ వయసు దాటిన సంజీవమ్మ, భర్త మాచిరెడ్డి, 2022 అక్టోబరు 1న కడపజిల్లా సిద్దవట మండలంలో నేకనాపురంలో 3 కోట్లతో జీవని వృద్ధాశ్రమం నిర్మించి దాని బాగోగులు చూసుకుంటూ సాహిత్య వ్యాసంగం చేస్తున్నారు.

తనలో అభ్యుదయ దృక్పథాన్ని పెంపొందించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘానికి 'జీవని' వ్యాస సంపుటిని అంకితమిచ్చి సంజీవమ్మ ఒక కొత్త సంప్రదాయాన్ని నెలకొల్పారు. దీనిలో వున్న 16 వ్యాసాలను 'మార్క్సిస్టు సాహిత్య విమర్శకు నమూనా వ్యాసాలుగా' ముందుమాటలో రాచపాళెం చంద్రశేఖరరెడ్డి ప్రశంసించారు.

"ప్రేమ్‌చంద్ నవలలు – సమకాలీన తెలుగు నవలలు – ఒక పరిశీలన" అనే వ్యాసంలో రచయిత్రి ఈ తరం యువ సాహితీవేత్తలకు ప్రేమచంద్ రాసిన కొన్ని ఉత్తమ నవలలను పరిచయం చేశారు. ఆ నవలలను పూర్తిగా చదవాలనే ఆసక్తి కల్గించేలా తన వ్యాసాన్ని రాశారు. ప్రేమచంద్ రాసిన 'కర్మభూమి' నవల గోర్కీ 'అమ్మ' నవలను తలపిస్తుందన్నారు. (పేజి 60). భారతీయ రైతు విషాదాంత కథ 'గోదాన్' అన్నారు.

ఒక వ్యాసంలో శ్రీశ్రీ ఇచ్చిన ఉపన్యాసాలను సమీక్షించారు. మరో వ్యాసంలో శ్రీరంగం నారాయణ బాబు కవిత్వంలో భావచిత్రాలను విశదీకరించారు. మీసరగండ విశ్వరూపాచారి అనే విద్వాన్ విశ్వం గురించి రాస్తూ ఆయన 'సంప్రదాయం మథించినవాడు. కాని ఛాందసం లేదు. ఆయన ఆలోచనలు ఆధునికం. అభ్యుదయపరం' అని కొనియాడారు. మార్క్సిస్టు దృక్పథంలో సాహిత్య విమర్శ గురించీ, మార్క్సిస్టు సాహిత్య విమర్శకుడిగా రారా, సొదుం రామ్మోహన్‌ల గురించి రాస్తూ మార్క్సిస్టు సాహిత్య విమర్శా దృక్పథాన్ని వివరించారు. గురజాడ, రవీంద్రుల సాహిత్యంలో మహిళలపట్ల సానుకూల వైఖరిని విశ్లేషించారు. చివరి వ్యాసంలో అరసం విజయాలు – నేటి బాధ్యతలు గుర్తుచేశారు.

లోతైన సాహిత్యవిమర్శ మృగ్యమైన నేటి పరిస్థితిలో సంజీవమ్మ వ్యాసాలు సాహితీ విమర్శలో కృషిచేస్తున్న వర్ధమాన విమర్శకులకు కరదీపికగా ఉపయోగపడతాయి.

1/8 డెమ్మీలో 14+146 పుటలు. వెల : 200/– ప్రథమముద్రణ : ఫిబ్రవరి 2023. ప్రతులకు : విశాలాంధ్ర, ప్రజాశక్తి (విజయవాడ), నవచేతన (హైదరాబాద్) – రచయిత, జీవని వృద్ధాశ్రమం, బాకరాపేట, సిద్ధవటంరోడ్, నేకనాపురం (పోస్టు), సిద్దవటం మండలం, వై.ఎస్.ఆర్. కడపజిల్లా – 516247.

## సామాజిక శ్రేయస్సు – అమ్మనుడి 'కందము' పంచశతి :


రచయిత – చందు నాగేశ్వరరావు

రెండు తెలుగు రాష్ట్రాలలో అత్యధిక ప్రజల అమ్మనుడి తెలుగుపట్ల పాలకులు ప్రదర్శిస్తున్న వ్యతిరేక వైఖరిని ఖండిస్తూ భాషోద్యమం తెలుగునాట బలహీనంగానైనా నడుస్తోంది. 'అమ్మనుడి' పేరుతో కేవలం తెలుగు భాషపైన కేంద్రీకరించిన రచనలతో ఒక మాసపత్రికను తెలుగుజాతి ట్రస్టు గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రచురిస్తోంది. 'ప్రజాసాహితి' పత్రిక తన జనసాహితి సంస్థ దృక్పథాన్ని తెలియచేస్తూ 1998 నుండి ప్రచురించిన వివిధ వ్యాసాలను ఒక బృహద్గ్రంథంగా ప్రచురించింది. ఇదిగాక వా.స.మూర్తి, అట్లూరి పురుషోత్తం, జి.వి. పూర్ణచంద్, నూర్‌బాషా రహంతుల్లా, చుక్కా రామయ్య, దివికుమార్, శ్రీనివాస్‌తేజ, స.వెం.రమేశ్, నందివెలుగు ముక్తేశ్వరరావు, పారుపల్లి కోదండరామయ్య, డా॥ పొత్తూరు రంగనాయకులు, డా॥ గుంటుపల్లి శ్రీనివాస్, డా॥ సామల రమేశ్‌బాబు, సింగమనేని నారాయణ, తదితరులు తమ పుస్తకాలలో ప్రాథమిక విద్య మాతృభాషా మాధ్యమంలోనే వుండాలని ఎన్నో ఉదాహరణలతో వివరించారు. జాతీయ విద్యా కమీషన్లు, అంతర్జాతీయంగా వున్న ఎందరో భాషాశాస్త్రవేత్తలు ఈ విషయాన్ని గట్టిగా సమర్థించారు. అయినా తెలుగు రాష్ట్రాలలో ప్రాథమిక స్థాయి నుండి ఇంగ్లీషు బోధనా మధ్యమంగా కొనసాగుతోంది.

దీనిని విమర్శిస్తూ పైన ఉదహరించిన విద్యావేత్తల రచనలతో పాటు కవులు తమ కవిత్వం ద్వారా అమ్మనుడి గురించి వివిధ ప్రక్రియలలో రాస్తున్నారు. ఇప్పటికే సామాజిక రుగ్మతల గురించి కందపద్య రూపంలో రెండు శతకాలు రచించిన జనసాహితి సభ్యుడు చందు నాగేశ్వరరావు ఈసారి ఏకంగా 560 కందపద్యాలలో అమ్మనుడి 'కందము' పంచశతిని ప్రచురించారు. దీనికి ముక్తేశ్వరరావు, గుంటుపల్లి శ్రీనివాస్, జనసాహితి ముందుమాటలు రాశారు. దీనిలో వర్తమాన సామాజిక విషయాలతో పాటు తెలుగు భాష ప్రాముఖ్యతను తెలియజేసే పద్యాలు వున్నాయి.

(1/8 డెమ్మీలో 140 పుటలు. వెల : రూ.200/– ప్రథమముద్రణ : ఫిబ్రవరి 2023. ప్రతులకు : మైత్రీబుక్‌హౌస్, జలీల్ వీధి, అరండల్‌పేట, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ–2. మరియు ఫ్లాట్ నెం. 105, వెన్నెల రెసిడెన్సీ, శివరామకృష్ణవీధి, నాజర్‌పేట, తెనాలి – 522201. ఫోన్ : 79896 63908).

# ఇటీవల వెలువడిన జనసాహితి ప్రచురణలు




## ప్రాచీన ప్రపంచ చరిత్ర

### సామాజిక విశ్లేషణ

**1/4 క్రౌన్ సైజులో**

**పేజీలు : 335**

**వెల : రూ. 450/-**


## సృజనకు విత్తు సొంత భాష

**1/8 క్రౌన్ సైజులో**

**పేజీలు : 64**

**వెల : రూ. 40/-**




## వెర్రిపడగలు

**1/8 డెమ్మీ సైజులో**

**పేజీలు : 56**

**వెల : రూ. 40/-**


ఈ పుస్తకాలు దొరకుచోటు :

**మైత్రీబుక్‌హౌస్,** జలీల్‌వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2.

సెల్ : 70755 08270

PRAJA SAAHITI April 2023 (TELUGU) Rs. 25/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2021-2023

No. of Pages : 36 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month



ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.

Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada

A PUBLICATION OF JANASAAHITHI